అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 21-3-2024 | 12 పేజీలు | వెల : 6.50

సంపుటి : 10 | సంచిక : 30 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar



అధికారమే పరమావధి

ఓటర్లను ప్రలోభపెట్టే రాజకీయాలు

- అసమ్మతిని అణచివేస్తున్న మోడీ సర్కారు..
- లోక్‌సభ ఎన్నికలకు ముందు అస్త్రశస్త్రాలు
- ప్రజాస్వామ్య దేశంలో ఈ విధానం సరికాదు : కేంద్రం తీరుపై మేధావులు, సామాజికవేత్తల ఆందోళన

నిరసన గళాలపై ఉక్కుపాదం

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఎన్నికల పండుగకు సిద్ధమవుతున్నది. 18వ లోక్‌సభకు ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఇప్పటికే నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాబోయే ఎన్నికల్లోనూ ఎలాగైనా విజయం సాధించాలని బీజేపీ భావిస్తున్నది. ఇందుకోసం తమ పార్టీ నేతృత్వంలో కేంద్రంలో ఉన్న సర్కారు అధికార బలాన్ని సైతం వినియోగిస్తున్నది. దేశంలో ఏ వర్గం నుంచైనా 'అసమ్మతి'కి అవకాశం లేకుండా నియంతృత్వంగా వ్యవహరిస్తున్నది. నిరసన గళాలపై ఉక్కుపాదం మోపుతున్నది. ప్రత్యర్థి పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, విమర్శకులు, సామాజికవేత్తలు.. ఇలా ఎవరనేది తేడా లేకుండా అసమ్మతి

...11లో






భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థిగా ఎండీ జహంగీర్

మిగతా 16 స్థానాల్లో ఎవరికి మద్దతివ్వాలో త్వరలో నిర్ణయం

- కాంగ్రెస్ ప్రతిపాదిస్తే ఆ మూడు చోట్ల ఎక్కడి నుంచైనా పోటీచేస్తాం
- కులాల ప్రాతిపదికన కార్పొరేషన్లు సరికాదు
- మిగతా గ్యారంటీలనూ అమలు చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

వివరాలు 3లో



ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి కీలకం

ఇండియా కూటమికి పెరుగుతున్న ప్రజాదరణ

రాబోయే సార్వత్రిక ఎన్నికలు భారత ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైనవని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. దేశ లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని కాపాడుకుంటామా లేదా అనే విషయాన్ని ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయని ఆయన చెప్పారు. గత పది సంవత్సరాలుగా ప్రజాస్వామ్య మౌలిక మూల స్తంభాలపై దాడి జరుగుతూనే ఉన్నదని పీటీఐ వార్తాసంస్థకు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏచూరి విమర్శించారు.



పదేండ్లుగా రాజ్యాంగ విలువలపై దాడి

- సానుకూల దిశలో సీట్ల సర్దుబాటు చర్చలు
- కేంద్ర ఆర్థిక విధానాలతో ప్రజల జీవితాలు ధ్వంసం
- కమలదళంలో నిరాశా నిస్పృహలు
- ఈడీ, సీబీఐ వంటి ఏజెన్సీలు దుర్వినియోగం
- 400 సీట్లు వస్తాయన్న వారిలో ఈ కలవరమెందుకు?
- స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే బీజేపీ అంచనాలు తప్పుతాయి : పీటీఐ ఇంటర్వ్యూలో సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

న్యూఢిల్లీ : ప్రతిపక్ష ఇండియా కూటమికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. అయితే కూటమిలోని అన్ని పార్టీలూ తమ స్థాయికి తగిన విధంగా కృషి చేయాలని, అంతా దాని పైనే ఆధారపడి ఉన్నదని చెప్పారు. ఇవి దేశ మనుగడకు సంబంధించిన ఎన్నికలని వ్యాఖ్యానించారు. 'మనం మన లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని కాపాడుకుంటామా లేదా అనే విషయాన్ని ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయి. ఎందుకంటే గత పది సంవత్సరాల్లో అనేక తీవ్రమైన ఉల్లంఘనలు జరిగాయి. దీనిని రాజ్యాంగ విలువల పైన, రాజ్యాంగ మూల స్తంభం పైన జరిగిన దాడిగా నేను భావిస్తాను. లౌకిక ప్రజాస్వామ్యం అనేది ఓ మూల స్తంభం. ఆర్థిక సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజం అనేవి ఇతర స్తంభాలు' అని వివరించారు.

ప్రజా హక్కుల పరిరక్షణే కూటమి లక్ష్యం

'మనం మన భారత రిపబ్లిక్ లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని కాపాడుకోగలమా లేక అది మరింతగా హరించుకుపోవడాన్ని అనుమతిస్తామా? ప్రస్తుత పరిస్థితుల్లో ఇవే ముఖ్యమైన అంశాలు' అని ఏచూరి చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికే ఇండియా కూటమి ఏర్పడిందని ఆయన తెలిపారు. కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ప్రజల్లో లోతైన పునాదులు ఉన్నాయని అన్నారు. 'రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల మానవ-పౌర స్వేచ్ఛ హక్కులను పరిరక్షించి, వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఇప్పుడు ఉంది. ఆ ఉద్దేశంతోనే ఇండియా కూటమి ఏర్పడింది. ప్రజల

...2లో

స్వేచ్ఛాయుత ఎన్నికలే ప్రధానం

370 స్థానాలు గెలుచుకోవాలన్న బీజేపీ లక్ష్యం గురించి ప్రశ్నించగా ఎన్నికలు ఎంత స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయన్న విషయంపై అది ఆధారపడి ఉంటుందని ఏచూరి తెలిపారు. 'ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయా లేదా అనే దానిపై అది ఆధారపడి ఉంటుంది. ఎన్నికల బాండ్లు, పీఎం కేర్స్...ఇలా అన్నింటి నుండి వారికి కోట్లాది రూపాయలు వచ్చాయి. ప్రపంచంలోనే ఇవి అత్యంత ఖరీదైన ఎన్నికలు కాబోతున్నాయి. ఈవీఎంలపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీవీపాట్లు, ఈవీఎంలపై సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఎన్నికల కమిషన్‌ను కలవాలని మా పార్టీ ప్రతినిధి బృందం భావించింది. అయితే విచారకరమైన విషయమేమంటే ఎన్నికల కమిషన్ మా అభ్యర్థనను అంగీకరించలేదు. ఇక్కడ అన్నీ ప్రశ్నలే. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడమంటే అందరికీ సమానావకాశాలు లభించడం. అయితే ఇక్కడ అలా లేదు. ఇవాళ కూడా ప్రభుత్వ విమానాలను దుర్వినియోగం చేస్తున్నారు. రాజకీయ సభలకు ప్రధానిని, ఇతర నాయకులను తీసికెళ్లడానికి సాయుధ దళాల హెలికాప్టర్లు వాడుతున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

హాజరైన సీఎం రేవంత్, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, సీఎస్, మంత్రులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. అనంతరం గవర్నర్‌తో సీఎం రేవంత్ ఏకాంతంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక తదితర అంశాలపై సీఎం ఆయనకు వివరించినట్టు సమాచారం. రాష్ట్రానికి మూడో గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ వ్యవహరించనున్నారు.

ముగ్గురు గవర్నర్లు తమిళులే!

తెలంగాణ ఆవిర్భావం నుంచి

...11లో

తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- 102 లోక్‌సభ స్థానాలు, 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు
- సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు
- ఏప్రిల్ 19న పోలింగ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం, సిక్కిం (32 స్థానాలు), అరుణాచల్ ప్రదేశ్ (60 స్థానాలు) అసెంబ్లీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ

...11లో

వైద్యారోగ్య శాఖలో 5,348 పోస్టుల భర్తీకి పచ్చజెండా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో 5,348 పోస్టుల భర్తీకి సర్కారు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల చేశారు. ప్రజారోగ్యం, ఆయుష్, డీసీఏ, ఐపీఎం, డీఎంఈ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు జారీ చేశారు. వైద్యారోగ్య సర్వీసుల నియామక బోర్డు ద్వారా నేరుగా ఉద్యోగాల భర్తీ చేపట్టాలని జీవోలో సూచించారు. ఇందుకోసం

...11లో

ముఖ్యమంత్రి గారూ..

- రైతులంటే.. మీకు ఎందుకంత చిన్నచూపు..? : కేటీఆర్ ట్వీట్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'రైతులంటే మీకు ఎందుకంత చిన్నచూపు?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. పంటలు ఎండుతున్నా పట్టించుకోవటం లేదు..వడగండ్లు ముంచెత్తినా సీఎం కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు తప్ప..

...11లో

డెడ్ స్టోరేజీకి కడెం ప్రాజెక్టు

నాడు రైతులకు వరప్రదాయని..నేడు నీరందించలేని దుస్థితి..

- డెడ్ స్టోరేజీకి చేరిన కడెం ప్రాజెక్టు
- చివరికి క్రాప్ హాలిడే ప్రకటించిన అధికారులు..!
- ప్రాజెక్టులో ప్రస్తుతం 2.96టీఎంసీలే నీటి నిల్వ
- భారీ వరదలు వచ్చినా నీరు నిల్వని పరిస్థితి
- సాగులోకి రాని పంటలు..బీళ్లుగా మారిన పొలాలు
- బీజేపీ ఎంపీ గెలిచినా ప్రాజెక్టు అభివృద్ధికి నిధులివ్వని కేంద్రం





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి (ఎమ్.సురేశ్)

రైతులకు వరప్రదాయనిగా ఉన్న కడెం ప్రాజెక్టు.. నేడు రైతులకు నీరందించలేని దుస్థితికి చేరింది. ప్రతి ఏటా రెండు పంటలకు సరిపడా నీరందిస్తూ.. కర్షకులకు తోడుగా నిలిచే ఈ ప్రాజెక్టు దయనీయ స్థితికి చేరింది. దీనకంతటికీ పాలకులు.. అధికారుల నిర్లక్ష్యమే కారణం. కుండపోత వర్షం, భారీగా వరద వచ్చి ప్రాజెక్టులో నిలిచినా ఆ నీటిని నిల్వ చేసుకునేందుకు గత ప్రభుత్వంలో అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో కిందికిపోవాల్సి వచ్చింది. నీరంతా వర్షాకాలంలోనే వెళ్లిపోవడంతో ప్రస్తుత యాసంగి పంటలకు నీరందించలేని దుస్థితిలో కడెం ప్రాజెక్టు ఉంది. చివరికి పంటలు వేయొద్దని అధికారులు ప్రకటించాల్సి వచ్చింది. కడెం ప్రాజెక్టుకే క్రాప్ హాలిడే ప్రకటించారు.. ప్రాజెక్టు ఉన్నా నీరు

...11లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





రానూ నాయక్ స్ఫూర్తితో గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

గిరిజన సంఘాల నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానూ నాయక్ స్ఫూర్తితో గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రానూ నాయక్ 74వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధర్మానాయక్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భంగ్యా భూక్యా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పటేల్ సైన్యం పారిపోయిన దొరలను వెంట బెట్టుకుని వేలాది మంది పోరాట వీరులను చంపేసిందని తెలిపారు. ఆ సైన్యం రానూ నాయక్‌ను బంధించి దళ నాయకుల ఆచూకీ చెప్పాలని ఎంతో హింసించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా చెప్పకపోవడంతో అతని ధైర్య సాహసాలను చూసి సైన్యం చంపకుండా వదిలివేశారని తెలిపారు. మతాలు, కులాలు, ప్రాంతాలకు అతీతంగా జరిగిన ఆ పోరాటాన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు వక్రీకరించి ఓట్ల రాజకీయానికి పాల్పడుతున్నాయని విమర్శించారు.

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్ ఈ సందర్భంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యాంగంలోని గిరిజన హక్కులు, చట్టాలపై గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడిని తీవ్రతరం చేసిందని విమర్శించారు. గిరిజన తెగల ఆహారపు అలవాట్లు, సంస్కృతి, ఆచారాలపై ఆధిపత్య మనువాద సంస్కృతిని బలవంతంగా రుద్ది హైందవీకరించే ప్రయత్నం చేసిందని తెలిపారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులకు ఉన్న హక్కులను కాలరాస్తూ గిరిజనేతరులకు భూమిపై హక్కులు కల్పించేందుకు వీలుగా



చట్టాలను రద్దుచేసేందుకు రంగం సిద్ధం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, దానికి మద్దతునిస్తున్న పార్టీలను ఓడించాల్సిన బాధ్యత గిరిజన తెగలపై ఉందని విజ్ఞప్తి చేశారు. కొన్ని ముఖ్యమైన గిరిజన డిమాండ్లపై డిక్లరేషన్‌ను ఈ సందర్భంగా ప్రవేశపెట్టారు.

కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు దాస్ రాంనాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, ప్రొఫెసర్ శంకర్ , కాంగ్రెస్ యస్ టీ సెల్ నాయకులు విజయబాయి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్, టోరి గోరి బంజారా ఛానల్ జర్నలిస్ట్ అశోక్ రాథోడ్, కళ్యాణ్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం, ఎం.రవి నాయక్, కె.శంకర్, భూక్యా హరి, వి.రామ్ కుమార్, బాల్యా నాయక్, వెంకట్రామ్ నాయక్, రఘు నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు

- ఒక దేశం ఒకే చట్టం అనే పేరుతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు కల్పించిన రాజ్యాంగ హక్కులు, చట్టాలను కాలరాయడాన్ని విరమించుకోవాలి.
- గిరిజన హక్కులను కాలరాస్తూ అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రం నూతనంగా తీసుకొచ్చిన అటవీ సంరక్షణ నియమాల చట్టం 2023ను ఉపసంహరించుకోవాలి.
- షెడ్యూల్ ప్రాంతాల్లో బీజేపీ పాలిత రాష్ట్రాలు గిరిజనేతరులకు భూమిపై హక్కులు కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.
- తెలంగాణలో గిరిజన తెగల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టిన బీజేపీ పార్లమెంట్ సభ్యులు సోయం బాబురావును కేంద్ర ప్రభుత్వం కట్టడి చేయకపోవడమే గాక... ప్రధాని మోడీ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తీసుకోవడం గిరిజన తెగల మధ్య మరింత ఆజ్యం పోసింది. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.
- అటవీ హక్కుల గుర్తింపు చట్టం -2006లోని కటాఫ్ తేదీని 2020 వరకు పొడిగించాలి. అప్పటి వరకు పోడు భూములను సాగు చేసుకుంటున్న వారందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి. ఆయా భూములపై యాజమాన్య హక్కు కల్పించి బ్యాంకు రుణాలు ఇవ్వాలి.
- వేలాదిమంది గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బయ్యారం ఉక్కు పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.
- నల్లమల్లలో యురేనియం తవ్వకాలను నిలిపివేస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇవ్వాలి.
- దేశవ్యాప్తంగా పెరిగిన గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ను పెంచాలి.
- ములుగులో ఏర్పాటు చేస్తున్న గిరిజన విశ్వవిద్యాలయంలో ఎస్టీ విద్యార్థులకు 80 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
- జాతీయ ఎస్టీ.కమిషన్ ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలి.
- తెలంగాణలో గిరిజనులకు పెంచిన 10 శాతం రిజర్వేషన్ జీవో 33ను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలి.
- షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టం, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. జీవో 3 స్థానంలో అవే హక్కులతో మరో జీవోను జారీ చేసి రాజ్యాంగబద్ధత కల్పించాలి.
- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలి.

ఎంపీ స్థానాలకు ఓబీసీ మోర్చా ఇన్‌చార్జులు, కన్వీనర్ల నియామకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకు కన్వీనర్, కో కన్వీనర్‌లను, జోనల్ ఇన్‌చార్జులను నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జి.ఆనంద్‌గౌడ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.జోనల్ ఇన్‌చార్జులుగా సంజయ్ గహనాథే, నందనం దివాకర్, వీణాఈశ్వరప్ప, సదానంద ముదిరాజ్‌లను నియమించారు.

రేపు 'సుప్రీం' ముందుకు కవిత పిటిషన్

- ఈడీ అరెస్ట్, కస్టడీని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన కవిత
- విచారణ జరపనున్న సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ట్రయల్ కోర్టు కస్టడీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్ రేపు (శుక్రవారం) సర్వోన్నత న్యాయస్థానం ముందుకు విచారణకు రానుంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు విచారణ జాబితాలో కవిత పిటిషన్‌ను చేర్చింది. తన అరెస్ట్ అక్రమమని, కస్టడీ రాజ్యాంగ విరుద్ధ మంటూ సోమవారం 537 పేజీలతో కవిత పిటిషన్ దాఖలు చేశారు. గతంలో సుప్రీంకోర్టులో తాను దాఖలు చేసిన పిటిషన్, పిటిషన్ పై విచారణ, కోర్టు ఉత్తర్వుల కాపీలు, మీడియా పబ్లిష్ చేసిన కథనాలను కవిత జత చేశారు. కేంద్రం చేతిలో ఈడీ కీలుబొమ్మగా మారిందని, పొలిటికల్ ఎజెండాతో ఈడీ అధికారులు పని చేస్తున్నారని తన పిటిషన్‌లో కవిత ఆరోపించారు. చట్టవ్యతిరేకంగా, కక్ష సాధింపులో భాగంగా తనను అరెస్ట్ చేశారని మెన్షన్ చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపకల్పన, అమలులో తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎలాంటి కేసు తనపై లేదన్న అంశాలను పరిగణలోకి తీసుకోవాలని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తాజా పిటిషన్‌పై తుది తీర్పు వెలువడేవరకు తక్షణమే తనను విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. అలాగే ప్రస్తుత అరెస్ట్ పై స్టే విధిస్తూ, ట్రయల్ కోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో... అభిషేక్ బోయినపల్లికి మధ్యంతర బెయిల్ మంజూరు

- భార్య అనారోగ్యం రీత్యా నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇచ్చిన సుప్రీం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలోని మనీలాండరింగ్ కేసులో కవిత సన్నిహితుడిగా దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తోన్న అభిషేక్ బోయినపల్లికి సుప్రీకోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్సీఆర్) దాటి వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. తన భార్య అనారోగ్యం దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని గతేడాది జులైలో అభిషేక్ బోయినపల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ అభిషేక్ బోయినపల్లి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా అభిషేక్ బోయినపల్లి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ దాదాపు 19 నెలలుగా జైల్లో ఉన్నారని, ఆయన భార్య అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. అయితే ఈ వాదనలపై ఈడీ తరుపు హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు అభ్యంతరం తెలిపారు. అయిన ప్పటికీ ఈ వాదనలను పరిగణనలోకి తీసుకోని ధర్మాసనం అభిషేక్ బోయిన పల్లికి నాలుగు వారాలు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. విడుదలయ్యే రోజు నుంచి సరిగ్గా నాలుగు వారాలు బెయిల్ ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భం గా ట్రయల్ కోర్టు విధించిన షరతులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక మొబైల్ నెంబర్ ఈడీ అధికారులకు ఇవ్వాలని, తనకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి అందించాలని ఆదేశించింది. అయితే భార్య చికిత్సలో భాగంగా పిటిషనర్ తన స్వస్థలం హైదరాబాద్‌కు వెళ్లేందుకు పర్మిషన్ ఇచ్చింది. తదుపరి విచార ణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది.కాగా లిక్కర్ పాలసీ కేసులో అక్టోబర్ 2022లో అభిషేక్ బోయినపల్లిని సీబీఐ అరెస్ట్ చేసింది. అనంతరం మనీ లాండరింగ్ కేసులో నవంబర్ 2022లో ఈడీ అభిషేకని అదుపులోకి తీసు కుంది. అనంతరం రౌస్ ఎవెన్యూ స్పెషల్ కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించగా... దాదాపు 19 నెలలుగా అభిషేక్ బోయినపల్లి తీహార్ జైల్లోనే ఉన్నారు.

ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి కీలకం : ఏచూరి

(మొదటిపేజీ తరువాయి)

హక్కులకు రాజ్యాంగం గ్యారంటీ ఇస్తోంది. అత్యంత ముఖ్యమైన విషయాలేమంటే రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కు. న్యాయం పొందే హక్కు, వీటికి కూటమి భాగస్వామ్య పక్షాలు కట్టుబడి ఉన్నాయి' అని వివరించారు.

విలువలే ప్రధానం

ఇండియా కూటమిలో 40 ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయి. గత సంవత్సరం జూన్ 18న పాట్నాలో జరిగిన ప్రతిపక్ష పార్టీల సమావేశంలో కూటమి ఆవిర్భవించింది. అయితే ఆ తర్వాత బీహార్‌లో జేడీయూ, ఉత్తరప్రదేశ్‌లో ఆర్ఎల్‌డీ పార్టీలు కూటమి నుండి నిష్క్రమించాయి. సీట్ల సర్దుబాటులో జాప్యం కారణంగా కూటమికి ఎదురు దెబ్బలు తగిలాయి. దీనిపై ఏచూరి స్పందిస్తూ సీట్ల సర్దుబాటుపై సానుకూల దిశగా చర్చలు జరుగుతున్నాయని, అవి త్వరలోనే ముగుస్తాయని చెప్పారు. 'ఎన్నికల రాజకీయాలు, సీట్ల సర్దుబాట్లు, పొత్తులు అనేవి సంఖ్యలకు సంబంధించిన లెక్కలు కావు. అవి రాజకీయాలు. రెండు రెండు కలిస్తే నాలుగు కావడం, వాటిని తీసేయడం కాదు. కాబట్టి ఎవరు వెళుతున్నారు, ఎవరు వస్తున్నారన్నది ప్రశ్న కాదు. ఏ విలువలపై ఎవరు చేరుతున్నారన్నదే ఇక్కడ ప్రధానం' అని వ్యాఖ్యానించారు.

వినాశకర ఆర్థిక విధానాలే కారణం

'మీరు ఎన్నికలను ఓ వ్యాపారంగానే భావిస్తే ఫిరాయింపులో లేదా అలాంటివేవో జరుగుతాయి. అది వేరే విషయం. కానీ అవి రాజకీయాలు కావు' అని ఏచూరి చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజల ముందున్న సమస్యలను ఆయన ప్రస్తావిస్తూ జీవనోపాధే ఇప్పుడు ప్రధాన విషయంగా ఉన్నదని అన్నారు. 'ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న ప్రధాన సమస్య వారి జీవన ప్రమాణాలు. గత పది సంవత్సరాల కాలంలో ఉపాధి స్థాయిల్లో మెరుగుదల లేదని గణాంకాలు చెబుతున్నాయి. ఆర్థిక విధానాలే ఈ వినాశనానికి కారణం. ఆర్థిక వ్యవస్థనే కాదు... ప్రజల జీవితాలను కూడా ఇవి ధ్వంసం చేశాయి. ఉపాధి కూడా ప్రజల ముందు ప్రధాన సమస్యగా ఉంది. మతపరమైన ఏకీకరణ, విద్వేషాల వ్యాప్తి, విషపూరిత ప్రచారం ద్వారా ప్రజలను ప్రభావితం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది' అని ఆరోపించారు. అయితే ఈ ప్రయత్నాలు ఫలించబోవని ఆయన అన్నారు.

నిరాశ దేనికో...?

'బీజేపీలో నిరాశానిస్పృహలు ఎందుకు? రాష్ట్రాలలో పార్టీలను చీలుస్తున్నారు. ఈడీ, సీబీఐ, కొన్ని సంస్థలను పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తున్నారు. 370 లేదా 400 స్థానాలకు పైగా గెలుచుకుంటామని ధీమాగా ఉన్న వారు ఎందుకింత నిరాశ పడుతున్నారు? ప్రతిపక్షం బలంగా ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ వాటిని చీల్చే పనిలో ఎందుకు ఉన్నారు? వారిని బెదిరిస్తున్నారు. భయపెడుతున్నారు. తమ పార్టీలోకి వచ్చేలా చేసుకుంటున్నారు' అని ఏచూరి మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలు బీజేపీలో చేరగానే వారిపై ఉన్న కేసులన్నీ అటకెక్కుతాయని ఆయన వ్యంగ్యోక్తులు విసిరారు. పార్టీలో చేరని వారిని...అంటే వారి ఒత్తిడికి తలొగ్గని వారిని జైలుకు పంపుతారని అన్నారు.

ఇన్ని జరుగుతున్నా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు గురవుతోందని ఎన్నికల కమిషన్ భావించడం లేదని ఏచూరి విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఎంత స్వేచ్ఛగా, ఎంత నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్న విషయంపైనే అంతా ఆధారపడి ఉన్నదని అన్నారు. అప్పుడు బీజేపీ ప్రచారం చేసుకుంటున్న దానికి భిన్నంగా ఎన్నికల ఫలితాలు వస్తాయని ఏచూరి తెలిపారు.

ఆకాంక్షలకు అనుగుణంగా
విద్యా వ్యవస్థ నిర్మాణం

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకెళతాం : టీపీసీసీ మేధావుల కమిటీ చైర్మెన్ అనంతుల శ్యామ్ మోహన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను విధ్వంసం చేసిందని టీపీసీసీ మేధావుల కమిటీ చైర్మెన్ అనంతుల శ్యామ్ మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్మాణం చేయనుందని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్న డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ దోస్త్‌ను రద్దు చేయాలని సీఎంను కోరుతామన్నారు. బుధవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల అసోసియేషన్లతో ఆయన సమావేశమయ్యారు. విద్యారంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై పెట్టుబడిని సామాజిక బాధ్యతగా చూస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వ విద్యాసంస్థలతోపాటు గ్రామీణ ప్రయివేటు విద్యాసంస్థలను రక్షించేందుకు కృషి చేస్తామన్నారు. కార్పొరేట్ కళాశాల్లో ఫీజు నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంటు తదితరాంశాలపై సీఎంతో చర్చిస్తామనీ, విద్యారంగ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పాపిరెడ్డి, తెలంగాణ ప్రయివేట్ జూనియర్, డిగ్రీ కాలేజీ అసోసియషన్ ప్రతినిధులు గౌరీ సతీష్, గౌతమ్, జనార్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిదే విజయం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి ధీమా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని తద్వారా ప్రజాస్వామ్య, లౌకిక ప్రభుత్వం ఏర్పడబోతున్నదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ 17 ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు సీఎం రేవంత్, మంత్రులు టీమ్‌వర్క్ చేస్తున్నారని తెలిపారు. ఢిల్లీ ప్రత్యేక అధికార ప్రతినిధిగా నియమితులైన తర్వాత తొలిసారి ఆయన బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు చేరుకున్నారు.భారీ కాన్వాయ్‌తో కార్యకర్తలు ఆయన్ను తొడ్కొని వచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ ప్రభుత్వం వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. అయినా బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తమ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ నేత ఈటల రాజేందర్, బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ కాంగ్రెస్‌పై అడ్డూ అదుపు లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల కంటే రెట్టింపు ఉత్సాహంతో ఎంపీ సీట్లను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలబడుతున్నదని చెప్పారు. పదేండ్ల నుంచి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ధరణి సమస్యలపై ఇప్పటికే ప్రత్యేక కమిటీ వేసిందన్నారు.

ఈటల కోసం బీఆర్‌ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం : బీర్ల ఐలయ్య

మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం బీఆర్‌ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. ఆ రెండు పార్టీలు కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. ఈటలను గెలిపించేందుకు బీఆర్‌ఎస్ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టిందని చెప్పారు. గతంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసింది బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాదా? అని ప్రశ్నించారు. ఫోన్లను ట్యాపింగ్ చేసే సంస్కృతి ఆ రెండు పార్టీలదేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా పాలనను ఆ రెండు పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని ఆయ వారిని హెచ్చరించారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పంట నష్టం వివరాలు తెప్పించాలంటూ ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. ఆ వివరాలు రాగానే పరిహారంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వానాకాలం నుంచి పంటల బీమా అమలు చేస్తామన్నారు. కామారెడ్డిలో ఎక్కువగా పంట నష్టం వాటిల్లిందని వివరించారు. సాధ్యమైనంత వరకు రైతులను ఆదుకుంటామన్నారు. ఇప్పటికే 80 శాతం మంది రైతులకు రైతుబంధు అందిందని చెప్పారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉద్యోగం పోయిన (ఓడిపోయిన)తర్వాత ఆవేదనతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

బీజేపీ సిట్టింగ్ స్థానాలు గెలవడమే కష్టం

- 400 సీట్లు ఎలా వస్తాయి
- దేశంలో బలపడుతున్న ఇండియా కూటమి : సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అబ్‌కి బార్ బీజేపీ సర్కార్, 400 స్థానాలే లక్ష్యమని ఆ పార్టీ నేతలు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, ప్రధాని మోడీలో మాత్రం ఆందోళన కనిపిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 270 సీట్లు రావడం కష్టమేననీ, సిట్టింగ్ స్థానాలనూ ఆ పార్టీ గెలవలేదని చెప్పారు. దేశంలో 'ఇండియా' కూటమి బలపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో 400 స్థానాలు బీజేపీకి ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, పౌరహక్కులను రద్దు చేస్తుందనీ, ఫాసిజాన్ని అమలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోదా శ్రీరాములు అధ్యక్షత వహించారు. ఇటీవల మరణించిన మాజీ మంత్రి నర్సారెడ్డి, ఎమ్మెల్యే లాస్య నందితతోపాటు పలువురికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలనర్సింహ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం అజీజ్ పాషా మాట్లాడుతూ గత లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్‌లోని మొత్తం 26 స్థానాలనూ బీజేపీ గెలిచిందనీ, ఈసారి 'ఇండియా కూటమి' బలపడిందని చెప్పారు. తద్వారా సిట్టింగ్ స్థానాలను బీజేపీ కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. రాజస్థాన్, బీహార్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఆ పార్టీ సిట్టింగ్ స్థానాలను కోల్పోతుందని అన్నారు. సీఏఏను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఆ తర్వాత ఎన్నార్సీని తెచ్చి ముస్లింల పౌరసత్వాన్ని తొలగించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారనీ, ఎంతదూరమైనా వెళ్లేందుకు వారు సిద్ధపడ్డారని వివరించారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలలో డబ్ల్యుటీవో ఒప్పందాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధరను కూడా అమలు చేయడం లేదన్నారు. 52 శాతం రైతులు అప్పుల పాలయ్యారని, ప్రతి రోజూ 27 మంది ఆత్మహత్యచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 25 నుంచి 30 స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుం దన్నారు. దీనికి సంబంధించి ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుగుతు న్నాయనీ, ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుపైన స్పష్టత వచ్చిందని వివరించారు. రాష్ట్రంలో పెద్దపల్లి, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో ఒక దాంట్లో సర్దుబాటు ఉండాలంటూ తాము కాంగ్రెస్‌కు ప్రతిపాదించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరయ్యారు.

డాక్టర్ త్రిపుర సుందరి మరణం తీరనిలోటు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నివాళి





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా వైద్యులు డాక్టర్ త్రిపుర సుందరి మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు సంతాపం ప్రకటించారు. బుధవారం ఆమె అంత్యక్రియలకు డీజీతోపాటు హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ హాజరై నివాళులర్పించారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా డీజీ మాట్లాడుతూ త్రిపుర సుందరి నెల్లూరు, గుంటూరు ప్రజా వైద్యశాలల్లో చాలా కాలం పాటు పేద రోగులకు వైద్య సేవలందించారని చెప్పారు. ఆమె తన చివరి రోజుల వరకు కమ్యూనిస్టు అభిమానిగా ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందించారని అన్నారు. ఆమె మరణం పేదలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత నారాయణకు రెండువారాలపాటు విశ్రాంతి అవసరం

- ఏఐజీ డాక్టర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణకు రెండు వారాలపాటు విశ్రాంతి అవసరమని ఏఐజీ ఆస్పత్రి డాక్టర్లు సూచించారు. ఈనెల 16న కామారెడ్డిలో జరిగిన ఓ వివాహానికి హాజరైన సందర్భంలో వేదిక ఎక్కుతూ ఆయన జారి కింద పడ్డారు. అనంతరం విశాఖపట్నం, చెన్నైలో నిర్వహించిన పార్టీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంలో నొప్పి ఎక్కువ కావడంతో డాక్టర్లను సంప్రదించారు. రిబ్ ఎముక విరిగినట్టు వారు నిర్ధారించి ఆయనకు రెండువారాలపాటు విశ్రాంతి అవసరమని సూచించారు. ప్రస్తుతం నారాయణ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఉద్యోగ కల్పనలో కానరాని పురోగతి



స్వయం ఉపాధిని వెతుక్కుంటున్న ప్రజలు

- కుటుంబానికి సహాయకారుల పాత్రలో మహిళలు
- పైసా ప్రతిఫలం లేకున్నా తప్పని చాకిరీ



న్యూఢిల్లీ : దేశంలో ఉద్యోగ కల్పనలో వృద్ధి కన్పించడం లేదు. ఫలితంగా ప్రజలు స్వయం ఉపాధికి దారులు వెతుక్కుంటున్నారు. మరికొందరు మహిళలు కుటుంబంలో జీతం భత్యం లేని వెట్టి చాకిరీ చేస్తున్నారు. మరోవైపు గత ఐదు సంవత్సరాల కాలంలో కార్మికుల వాస్తవ వేతనాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా స్థిరంగా ఉన్నాయి. న్యాయం, సామరస్యం, రాజ్యాంగ విలువల కోసం కృషి చేస్తున్న పౌర సమాజ బృందం 'బహుత్వ కర్నాటక' ఉపాధి, వేతనాలు, అసమానతల పేరిట రూపొందించిన నివేదికలో ఈ విషయాలను తెలియజేసింది. కుటుంబంలో వేతనాలు అనే ఊసే లేకుండా మహిళలు రాత్రింబవళ్లు కష్టపడాల్సి వస్తోంది. ఉద్యోగావకాశాలు లభించకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఇలాంటి వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఐదేండ్ల క్రితం ప్రతి నలుగురు మహిళల్లో ఒకరు ఇలా 'ఉచితం'గా ఇంటి చాకిరీ చేసే వారు. ఇప్పుడు ప్రతి ముగ్గురిలో ఒకరు అలా చేయాల్సి వస్తోంది. కుటుంబంలో వేతనాలు లేకుండా పని చేస్తున్న వారిని అంతర్జాతీయ కార్మిక సంస్థ కుటుంబ కార్మికులకు సహాయకారులుగా అభివర్ణించింది. కుటుంబంలో ఎవరైనా దుకాణమో లేదా వ్యాపారమో నిర్వహిస్తుంటే వారికి చేదోడువాదోడుగా ఉండడమే వీరి పని. ఇందుకోసం వీరికి ప్రత్యేకంగా వేతనమంటూ ఉండదు. కొందరు మహిళలు కుటుంబంలో ఎవరైనా ఉద్యోగం చేస్తుంటే వారికి సహాయపడుతూ ఉంటారు. అయితే వీరికి కూడా వేతనమంటూ ఏదీ ఉండదు. అంటే వీరు చేసే పనికి వేతనమో లేదా జీతమో ఉండదన్న మాట. తృణమో ఫణమో...అంతే ఇలాంటి వారికి అప్పుడప్పుడూ తృణమో ఫణమో లభిస్తూ ఉంటుంది. ఉద్యోగాలు చేస్తున్న కుటుంబ సభ్యులు అరుదుగా వీరికి కొంత సొమ్ము ఇస్తుంటారు. వ్యాపారంలో లాభం వచ్చినప్పుడు కూడా వీరి చేతిలో డబ్బు పెడతారు. అయితే వ్యాపారానికి సంబంధించిన విధానపరమైన నిర్ణయాలలో వీరి పాత్ర ఏమీ ఉండదు. వీరు చేసే పనిని ఉద్యోగంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ గుర్తించదు. వ్యవసాయంలో, కుటుంబాలు నిర్వహించే వ్యాపారంలో సాయపడే మహిళా సభ్యులు ఈ కేటగిరీ కిందికి వస్తారు.



వాస్తవాల దూరంగా నిటి ఆయోగ్ నివేదిక

2011-12లో 22 శాతంగా ఉన్న పేదరికం 2022-23 నాటికి 5% తగ్గిందని నిటి ఆయోగ్ చెబుతోంది. అయితే 'బహుత్వ కర్నాటక' సంస్థ ఇచ్చిన నివేదిక దీనికి భిన్నంగా ఉంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్), ఉపాధి-నిరుద్యోగ సర్వే (ఇప్పుడు చేయడం లేదు) నుండి తీసుకున్న సమాచారాన్ని క్రోడీకరించి ఈ నివేదికను రూపొందించారు. 2014లో అధికారంలోకి రావడానికి ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. అయితే 2022-23లో 25 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పట్టభద్రుల్లో 42% మంది నిరుద్యోగులుగానే ఉన్నారని ఈ నివేదిక చెబుతోంది. గత ఏడాది కూడా పట్టభద్రుల్లో నిరుద్యోగుల స్థాయి అధికంగానే ఉన్నదని నివేదిక రచయితల్లో ఒకరైన విద్యావేత్త రాజేంద్రన్ నారాయణన్ తెలిపారు.

స్వయం ఉపాధి వెదుకుతూ..

2011-12, 2022-23 మధ్యకాలంలో కార్మికుల్లో స్వయం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య పెరిగింది. 2011-12లో దేశంలోని కార్మికుల్లో పురుషుల్లో 51.5 శాతం, మహిళల్లో 56.5 శాతం స్వయం ఉపాధి పొందిన వారే. వీరి సంఖ్య 2022-23 నాటికి 53.4 శాతం, 64.3 శాతానికి పెరిగింది. పేద కుటుంబాల ఆదాయాల్లో ఏ మాత్రం పెరుగుదల లేకుండా స్థిరంగా ఉండడంతో మహిళలు ఎలాంటి ఆర్థిక ప్రతిఫలం లేకున్నా వ్యవసాయంలోనో లేదా దుకాణాల్లోనో సహాయకారులుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని నివేదిక తెలిపింది.

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పద్మారావు గౌడ్?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా స్థానిక శాసన సభ్యులు పద్మారావు గౌడ్ పేరు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. పార్టీలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం అధినేత కేసీఆర్ ఆయన అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపినట్టు సమాచారం. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి నడిచారు. అలాగే పార్టీ పట్ల ఆయన చివరి వరకు విధేయతతో ఉన్న నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనే సరైన అభ్యర్థని బరిలో దించేందుకు సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాలంటున్నాయి. ఒకటి రెండు రోజుల్లో ఆయన పేరును అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం.

మే 24కు పాలిసెట్ వాయిదా

ఎస్‌బీటీఈటీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-2024 రాతపరీక్షలను వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) ప్రకటించింది. ఈ మేరకు ఎస్‌బీటీఈటీ కార్యదర్శి, పాలిసెట్ కన్వీనర్ పుల్లయ్య బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే 17న నిర్వహించ తలపెట్టిన పాలిసెట్‌ను అదేనెల 24వ తేదీకి వాయిదా వేశామని తెలిపారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు. సందేహాల కోసం 040-23222192 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పంట నష్టం ఎకరాకు రూ.10 వేలు చెల్లించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడగండ్ల వాన, అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు బాధలో ఉంటే ఒక్క మంత్రి కూడా వారికి భరోసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది అకాల వర్షాల వల్ల వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో పంటలు దెబ్బతింటే తమ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు చెల్లించిందని గుర్తు చేశారు. ఈ యేడాది ఆదిలాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయనీ, అందువల్ల రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. రెండు నెలలు గడుస్తున్నా రైతులకు రైతు బంధు జమచేయని రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు మాత్రం టంఛన్‌గా బిల్లులు చెల్లిస్తోందని ఆరోపించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు.

క్రీడా రంగంలో విద్యార్థులను ప్రోత్సహించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

- నిజాం కళాశాలలో క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులను క్రీడా రంగంలో ప్రభుత్వం ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ అధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ నినాదంతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం హైదరాబాద్ నిజాం కాలేజీలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భగత్ సింగ్ స్ఫూర్తితో యువతలో ఐక్యత కోసం క్రికెట్, ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతలకు వ్యతిరేకంగా, కులం, మతం పేరుతో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. భగత్‌సింగ్ కోరుకున్న అసమానతలు, వివక్షలు లేని సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావేద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి, నిజాం కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు విగ్నేష్, అభిమన్యు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థిగా ఎండీ జహంగీర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థిగా ఎండీ జహంగీర్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య ప్రకటించారు. ప్రజాసమస్యలపై పోరాడే ఆయన తమ అభ్యర్థిగా పోటీ చేస్తారని చెప్పారు. భువనగిరి జిల్లాలో అనేక సమస్యలపై జహంగీర్ పోరాటాలు చేశారని అన్నారు. మిగతా 16 స్థానాల్లో ఎవరికి మద్దతివ్వాలనే దానిపై ఇంకా కొంత సమయం వేచిచూసేందుకు పార్టీ నిర్ణయించిందన్నారు. దీనిపై హడావుడిగా ఇప్పుడే నిర్ణయం తీసుకోవద్దని అనుకున్నామని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశాన్ని మంగళవారం టి జ్యోతి అధ్యక్షతన నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, రేవంత్‌రెడ్డి వంద రోజులపాలన, పార్లమెంటు ఎన్నికలు, పార్టీ వైఖరిపై చర్చించామని వివరించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేశారనీ, మిగిలిన వాటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందని ఆశిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సమస్యను పరిష్కరించాలని కోరారు. సీఎం దృష్టికి ఈ సమస్యను తెచ్చామనీ, కార్మికుల వేతనాలను పెంచకుండానే డీఏను మూలవేతనంలో కలుపుతూ ఉత్తర్వులిచ్చారని గుర్తు చేశారు. దాంతో కోటిమంది కార్మికులు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కనీస వేతనాల జీవోలను సవరించాలని డిమాండ్ చేశారు. ధరణి బాధితుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఓయూ మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు చదువుమీద దృష్టి కేంద్రీకరించాలనీ, వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 69 కేంద్రాల్లో లక్ష కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాయని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద వారికి రూ.ఐదు లక్షలు ఇచ్చి, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. మూసీ సుందరీకరణ చేయడానికి ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తే సంతోషమేనని అన్నారు. దాని పర్యవసానంగా కొన్ని పనులు చేయాలనీ, ముందు ఆ నీటిని శుద్ధి చేయాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంతం నుంచి కల్తీ ధాన్యం, కల్తీ కూరగాయలు, కల్తీ పాలు వస్తున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ పక్కన గడ్డి కోసుకునే వారు, అరిటాకులు అమ్ముకునేవారు, ఇండ్లు కోల్పోయే వారికి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కులాల ప్రాతిపదికన కార్పొరేషన్ల ఏర్పాటు సరైంది కాదన్నారు. గతంలో ఏర్పాటు చేసిన వాటికి వెనుకబాటుతనం, ఇతర కారణాలుండేవని గుర్తు చేశారు. కులవ్యవస్థను నిర్మూలించాల్సిన ప్రభుత్వం రెడ్డి, కమ్మ వంటి కులాల పేరుతో కార్పొరేషన్లను ఏర్పాటు చేసి దాన్ని కాపాడే పనిచేయొద్దని కోరారు. పొత్తులకు సంబంధించి కాంగ్రెస్ నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదనలు రాలేదన్నారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలతో జాతీయస్థాయిలో ఇండియా కూటమి ఏర్పడిందని చెప్పారు. రాష్ట్రంలోనూ బీజేపీని ఓడించడమే తమ పార్టీ లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం) కలిసి పనిచేస్తే బీజేపీ ఓడిపోతుందని చెప్పారు. ఖమ్మం, మహబూబాబాద్, భువనగిరి, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాల్లో తమకు బలముందన్నారు. భువనగిరి కాకుండా మిగతా మూడింటిలో ఎక్కడ పోటీ చేయాలని కాంగ్రెస్ ప్రతిపాదించినా తాము సిద్ధమని ప్రకటించారు. కలిసి పనిచేద్దామని బీఆర్ఎస్ నుంచి ప్రతిపాదన వస్తే ఏం చేయాలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వందరోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు హామీ ఇచ్చారనీ, వాటిని పరిష్కరించాలని కోరారు.

సీపీఐ(ఎం)ను గెలిపించాలి : జహంగీర్



భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీలకు జహంగీర్ ధన్యవాదాలు చెప్పారు. ఇది చారిత్రక నియోజకవర్గమనీ, అక్కడ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందనీ, ఎంతో మంది అమరులయ్యారని అన్నారు. త్యాగాలు, చరిత్ర తెలిసిన ప్రాంతమని వివరించారు. కమ్యూనిస్టుల పోరాటాలతో వచ్చిన ఫలితాలను అనుభవించిన ప్రజలున్నారని చెప్పారు. చెట్టు, పుట్టను అడిగినా కమ్యూనిస్టుల చరిత్రను చెప్తాయన్నారు. సాగునీరు, తాగునీరు, విద్యావైద్యం, కాలుష్యం, మూసీ పరివాహక ప్రాంతం, ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యలు న్నాయని అన్నారు. దశాబ్దాలు మారినా అనేక మంది పాలకులు మారినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంటులో గళమెత్తే సీపీఐ(ఎం) అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు.

పేద కుటుంబం నుంచి వచ్చిన జహంగీర్ : చెరుపల్లి



పేద కుటుంబం నుంచి వచ్చిన జహంగీర్ 35 ఏండ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్నారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు చెప్పారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జనగామ, ఇబ్రహీంపట్నం, భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాలు కమ్యూనిస్టులకు కేంద్రాలని అన్నారు. గతంలో నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు, ఆలేరు, భువనగిరి, ఇబ్రహీంపట్నంలో కమ్యూనిస్టులు గెలిచారని గుర్తు చేశారు. నిబద్ధతతో పనిచేసే జహంగీర్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పేదరికం, కష్టాల నుంచి వచ్చిన ఆయనకు సమస్యలపై మంచి అవగాహన ఉందన్నారు. ప్రస్తుతం ఆయారాం, గాయారాంలు రాజకీయాల్లో ఉన్నారని చెప్పారు. తాను పార్ట్‌టైం రాజకీయ నాయకుడిని, ఫుల్ టైం బిజినెస్‌మెన్‌ని అంటూ ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. రాజకీయాల్లో విలువలు భ్రష్టుపట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీలో అలాంటి వారికి టికెట్లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు.

వలస కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి : జూలకంటి



ప్రజలు వలసపోతున్నారనీ, వాటిని ఆపి ఉపాధి అవకాశాలను కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారిని ఆదుకోవాలని సూచించారు. పంటలు ఎండిపోతున్నాయనీ, రైతులను ఆదుకోవాలని కోరారు. తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

జమిలిపై పెరుగుతున్న ఆందోళన

- ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం
- స్థానిక ప్రాధాన్యతలకు తగ్గనున్న ప్రాముఖ్యత
- ప్రభుత్వంలో లోపించనున్న జవాబుదారీతనం
- ప్రతిపక్షాలకు ఇబ్బందికరమే

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నివేదిక అందజేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు అందజేసిన ఈ నివేదిక 'ఒకే దేశం ఒకే ఎన్నిక' భావనకు మద్దతు తెలిపింది. జమిలి ఎన్నికల కారణంగా పరిపాలనా సంబంధమైన ప్రక్రియలను క్రమబద్ధీకరించవచ్చునని, ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చునని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే మరోవైపు వైవిధ్యభరితమైన రాజకీయ యవనిక ప్రమాదంలో పడుతుందన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందన్న మాట నిజమే. ప్రస్తుతం దేశంలో ప్రతి ఏటా ఎక్కడో ఒక చోట ఏదో ఒక ఎన్నిక జరుగుతోంది. దీనివల్ల ప్రజాధనం పెద్ద ఎత్తున ఖర్చవుతోంది. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్న రాజకీయ పార్టీలకు ఈ పద్ధతి ప్రయోజనకరంగానే ఉంటుంది. అదే సమయంలో ఈ విధానం కొన్ని విషయాలలో ప్రమాదకరమైన సంకేతాలు అందిస్తోంది.

నిరంకుశత్వం ప్రబలుతుంది

పాలకుల్లో నిరంకుశ ధోరణులు ప్రబలంగా ఉన్నప్పుడు జమిలి ఎన్నికల నిర్వహణ అభిలషణీయం కాదు. దేశంలో ఐదు సంవత్సరాల పాటు ఎక్కడా ఎన్నికలే లేకుంటే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. పాలకులు పరిపాలనను గాలికి వదిలేసి నియంతలుగా మారతారు. ఐదు సంవత్సరాల వరకూ తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమా వారిలో ఏర్పడుతుంది. అహంకారం పెరుగుతుంది. కేవలం ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయన్న కారణంతో రాజకీయ బహుళత్వం, ప్రజాస్వామిక పాలనపై ఈ విధానం చూపే దుష్ప్రభావాన్ని విస్మరించకూడదు. ఒకవేళ జమిలి ఎన్నికలు నిర్వహించాలని అనుకుంటే ఆ మార్పుపై సమగ్ర చర్చలు, సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉంది. కానీ ఆ ప్రక్రియ సరిగా జరగలేదనే చెప్పాలి. కొన్ని పార్టీలు, సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ప్రభుత్వం ఖాతరు చేయలేదు.

స్థానిక సమస్యలు మరుగున పడతాయి

దేశంలో జరిగే వివిధ ఎన్నికల్లో సందర్భాన్ని బట్టి జాతీయ, ప్రాంతీయ అంశాలకు ప్రాధాన్యత లభిస్తూ ఉంటుంది. అయితే జమిలి ఎన్నికల నిర్వహణతో స్థానిక ప్రాధాన్యతలకు ప్రాముఖ్యత తగ్గిపోతుంది. అసెంబ్లీ ఎన్నికలు వచ్చినప్పుడు ఓటర్లు ఆయా పార్టీల ప్రాంతీయ పనితీరు ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు. జాతీయ అంశాలకు వారు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వరు.



జమిలి ఎన్నికలపై గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని మోడీ, బీజేపీ అనుసరించే వ్యూహంపై అందరి దృష్టీ నిలిచి ఉంది. అధికారం కేంద్రీకృతం కావాలన్నదే కమలదళం ఎత్తుగడ. ప్రతి ఓటు పైనా మోడీ సంతకం ఉండాలన్నదే దాని అజెండా. ఇప్పుడు ఎన్నికల డ్రామాకు తెర లేచింది. భారత ప్రజాస్వామ్య వేదిక తదుపరి చర్య కోసం ఎదురు చూస్తోంది. జమిలి ఎన్నికలపై బీజేపీ చేస్తున్న హడావిడి పరిపాలనను నూతన శిఖరాలకు చేరుస్తుందా లేక ప్రాంతీయ స్వతంత్రతపై కన్పిస్తున్న వెలుగును మసకబారుస్తుందా అన్నది వేచి చూడాల్సిందే.

ఉదాహరణకు రాష్ట్ర ఎన్నికల్లో ఢిల్లీ నియోజకవర్గ ప్రజలు ఆమ్‌ఆద్మీ పార్టీని గెలిపించారు. అదే పార్లమెంటరీ ఎన్నికల్లో వేరే పార్టీలకు ఓటేశారు. లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు స్థానిక సమస్యలు, ఇతర అంశాలు మరుగున పడతాయి. బీజేపీ తన ఎన్నికల ప్రచారంలో ఎక్కువగా దేశాభివృద్ధిని ప్రస్తావిస్తూ ఉంటుంది. ప్రాంతీయ అంశాలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వదు. ఇది ఓ రకంగా అమెరికాలో అమలులో ఉన్న అధ్యక్ష తరహా ఎన్నికల ప్రక్రియకు దారితీస్తుంది. ఫలితంగా ఒకే పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యాన్ని చెలాయించే ప్రమాదం ఉంది. జాతీయ అజెండా మాటున స్థానిక అంశాలను విస్మరించడం ప్రజాస్వామ్య మూలాలకే విఘాతం కలిగిస్తుంది.

అధికార పార్టీలకే ప్రయోజనం

ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం జాతీయ లేదా ప్రాంతీయ ఆధిపత్యం చెలాయించే పార్టీలకు ఉపయోగకరంగా ఉంటుంది. జమిలి ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఈ ధోరణి కన్పిస్తుంది. ఈ విధానం కింద కేంద్రంలో అధికారంలో ఉండే బీజేపీ వంటి పార్టీలు ఓ వెలుగు వెలుగుతాయి. రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ప్రాంతీయ పార్టీల హవా కొనసాగుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో పూర్వవైభవం సాధించాలని కలలు కంటున్న కాంగ్రెస్ పార్టీకి ఈ తరహా ఎన్నికలు ఇబ్బందికరమే. అదే విధంగా రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీతో తలపడి గెలవడం కష్టమవుతుంది. జమిలి ఎన్నికలు ఎప్పుడూ అధికారంలో ఉన్న పార్టీకే మేలు చేకూరుస్తాయన్నది సుస్పష్టం. 1967లో జరిగిన ఎన్నికల్లోనూ, 2014, 2019లో కొన్ని రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు ఒకేసారి జరిగిన ఎన్నికల్లోనూ జరిగింది అదే.

ఫెడరలిజంకు సవాలు

జమిలి ఎన్నికలు ఫెడరలిజంకు సవాలుగా పరిణమిస్తాయి. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని, ప్రజాస్వామ్య ప్రక్రియను అవి నీరుకారుస్తాయి. లోక్‌సభ అయినా లేదా ఏ రాష్ట్ర శాసనసభ అయినా పదవీకాలం ముగియక ముందే రద్దయితే అక్కడ ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. రాష్ట్రపతి పాలన విధించే ప్రమాదమూ ఉంది. ఇది రాష్ట్రాల సార్వభౌమత్వాన్ని హరిస్తుంది. ప్రజాస్వామ్య నిబంధనల్ని కాలరాస్తుంది. జమిలి ఎన్నికల విధానంలో తరచుగా ఎన్నికలు జరగవు కాబట్టి ప్రభుత్వంలో జవాబుదారీతనం లోపిస్తుంది. ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో కూడా ఉదాసీనత చోటుచేసుకుంటుంది. వారు ఓటర్లను పట్టించుకోరు. తాము ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుంటారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం ఎన్నికల ప్రక్రియను కేంద్రీకృతం చేస్తుంది. ప్రాంతీయ గొంతుకలకు స్థానం లేకుండా పోతుంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా పరిపాలన జరగదు.

హాజరు పెంచకుంటే గుర్తింపు రద్దే

పరీక్షా పే చర్చ పై పాఠశాలలకు సీబీఎస్ఈ తాఖీదులు

భువనేశ్వర్ : ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా ప్రారంభించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని సీబీఎస్ఈ తన అనుబంధ పాఠశాలల్లో కొన్నింటికి సూచించింది. లేకుంటే గుర్తింపును రద్దు చేస్తానని హెచ్చరించింది. ప్రస్తుత సంవత్సరపు 'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి జనవరి 29న రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపట్టిన ఈ కార్యక్రమం కోసం 2.26 కోట్ల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. గత సంవత్సరం ఈ సంఖ్య 38 లక్షలు మాత్రమే.

భువనేశ్వర్‌లోని సీబీఎస్ఈ ప్రాంతీయ కార్యాలయం ఒడిషాలోని పలు పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు జనవరి మొదటి వారంలో ఈ-మెయిల్ సందేశాలు పంపింది. ప్రధాని కార్యక్రమానికి పేర్లు నమోదు చేసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. భువనేశ్వర్‌లోని సీబీఎస్ఈ అండర్ సెక్రటరీ లలిత్ కుమార్ హిమాన్షు ఈ సందేశాలు పంపారు. హాజరు పెంచకపోతే గుర్తింపు పొడిగింపులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పరీక్షా పే చర్చ అనేది వార్షిక కార్యక్రమం. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాల ఆడిటోరియంలో దీనిని నిర్వహిస్తారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని సూచనలు, సలహాలు ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని పలు టీవీ ఛానల్స్ కూడా ప్రసారం చేస్తాయి. కార్యక్రమంలో పాల్గొనాలని కోరుకునే వారు ముందుగా ఓ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉండేలా సంబంధిత పాఠశాలలే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.



'పరీక్షా పే చర్చ-2024 కోసం మీ పాఠశాల నుండి రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నాయి. సీబీఎస్ఈ కేంద్ర కార్యాలయం ఈ నమోదు ప్రక్రియలను పర్యవేక్షిస్తుంది. మీ పాఠశాల నుండి రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నందున గుర్తింపు పొడిగింపులో, దానికి సంబంధించిన ఇతర పనుల్లో సమస్యలు ఎదురు కావచ్చు' అని ప్రిన్సిపాల్స్‌కు రాసిన లేఖల్లో హిమాన్షు తెలిపారు. 'మీ పాఠశాల నుండి గరిష్ట స్థాయిలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్లు నమోదు చేసుకునేలా చూడండి. అంతా అయిపోయిన తర్వాత వివరణలు ఇచ్చుకోవడం, సమస్యలు కొనితెచ్చుకోవడం కంటే పనిని పూర్తి చేయడం మంచిది' అని సుద్దులు చెప్పారు.

సంపాదకీయం

గొంతెండుతోంది...



రాష్ట్రం గొంతెండుతున్నది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఇటు తాగు, అటు సాగునీటికి కటకటే. నీటి కరువు జనాలకే కాదు భూములకునూ. రిజర్వాయర్లల్లో తగినంత నీరుందని సర్కారు చెబుతున్నా, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులు తారుమారయ్యే ప్రమాదం లేకపోలేదు. నీటికోసమే రాష్ట్రం ఆవిర్భవించినా, గత పదేండ్లల్లో ఆ ఉద్యమ కృషి నీటి వనరుల అభివృద్ధిలో కనిపించలేదు. రూ. వేల కోట్లు ఖర్చు పెట్టిన తర్వాత కూడా కలగానే మిగలడం ఆందోళన కలిగించేదే. బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు,తాగునీటి ప్రాజెక్టులు నిర్మించినా, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిణామాలు ఫలితాలు రాలేదడాన్ని నిరూపిస్తున్నాయి. సాక్ష్యంగా నిలుస్తున్నాయి. 2014తో పోల్చుకుంటే, 2022-23 నాటికి భూగర్భజలాలు భారీగా పెరిగాయనేది సర్కారు కామెంట్. దీన్ని ఎవరూ కాదనలేకపోయినా, 'తెలంగాణ డైనమిక్ గ్రౌండ్ వాటర్ రిసోర్సెస్ కంప్యూటెడ్' అనే సంస్థ నివేదిక చెప్పింది. కాగా కొన్ని నెలల్లోనే పరిస్థితులు దిగజారాయి. దీనికి సరైన నీటి విధానాలు అనుసరించకపోవడం, అమలు చేయకపోవడమే కారణం.

ప్రణాళిక దశనుంచే అనుకున్న లక్ష్యాల సాధనకు అడుగులు పడాలి. అందుబాటులోకి వచ్చే నీరు, విద్యుత్ వినియోగం సమర్థవంతంగా ఉండటానికి తగిన పంటల విధానం రూపకల్పనకు రైతులతో విస్తృత సంప్రదింపులు తప్పనిసరి. వాతావరణంలో మార్పులతో పుడమి వేడి పెరుగుతున్న మాట ఎవరూ కాదనలేనిది. అప్పుడు సర్కారీ పెట్టుబడులు అర్థవంతంగా, ప్రయోజనకారిగా ఉండాలనేది ఆర్థికవేత్తల అభిప్రాయం. రోజురోజుకూ అధికమవుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికల రచన జరగాలి. అమలూ పకడ్బందిగానే ఉండాలి.

గతేడాది సెప్టెంబరులో ఆశించిన మేరకు వానలు పడలేదు. దీంతో అది భూగర్భజలాలపై తీవ్ర ప్రభావమే చూపింది. తాగునీటి ఎద్దడికీ దారితీసింది. అలాగే వ్యవసాయ సాగును దెబ్బతీసింది. దానికితోడు కేసీఆర్ పెట్ ప్రాజెక్టు దాదాపు రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చోటుచేసుకున్న పగుళ్లు, సీపేజీల మూలంగా నీటిని పూర్తిగా వదిలేయాల్సి వచ్చింది. దీంతో భూగర్భజలాలు మళ్లీ యథాస్థితికి చేరాయి. మిషన్ భగీరథ ప్రాజెక్టు 2045 నాటి ప్రజావసరాలకుగాను రూ.38 వేల కోట్లతో నిర్మించారు. ఎద్దును కొని పగ్గాన్ని మరిచినట్టు తెలంగాణలో నీటి పంపిణీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వైచిత్రి. లీకేజీలు, నిర్వహణా సమస్యలతో 44 డిగ్రీల ఎండలో సామాన్యులను రోడ్డెక్కించే దుస్థితి.

తాగు, సాగునీటి రిజర్వాయర్లు నిండుకుంటున్న వేళ, సాధారణ ప్రజలకు హెచ్చరికనే. భూగర్భజలాలు 39.782 టీఎంసీల నుంచి 27.508 టీఎంసీలకు తగ్గాయి. రాష్ట్రంలోని 12 ప్రధాన సాగునీటి రిజర్వాయర్లల్లో నీటి నిల్వలు 438 టీఎంసీల నుంచి 283.41 టీఎంసీలకు అంటే 45 శాతం పడిపోయాయి. దీంతో యాసంగి సాగుపై ప్రభావం పడింది. 54 లక్షల ఎకరాలకుగాను 43 లక్షలు మాత్రమే సాగైంది. సుమారు 11 లక్షల ఎకరాల్లో రైతులు సాగుచేయలేకపోయారు. ఇదీ వ్యవసాయ శాఖ లెక్క. అలాగే రాష్ట్రంలో కేవలం ఆరు జిల్లాలు మినహా మిగతా అన్నీ చోట్లా వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. నాగర్‌కర్నూల్, జోగులాంబ-గద్వాల జిల్లాల్లో మరీ తక్కువ. దీంతో తెలంగాణలో పరిస్థితులు ఎంత కఠినంగా మారనున్నాయో కండ్లకు కడుతున్నది.

సాంకేతిక, ఆర్థిక, పర్యావరణ కోణాల్లో ప్రాజెక్టులు నిర్మించాలనేది సాగునీటిరంగ నిపుణుల మాట. తొందరపాటు నిర్ణయాలతో ఆర్థిక, పర్యావరణ నష్టాలు జరుగుతున్నాయనేది వారి ఆవేదన. రాజకీయ, పర్యావరణ, ఆర్థిక, సామాజిక, సాంకేతికాంశాలను మిళితం చేసే నీటి (నదులు, వాగులు, చెరువులు, ప్రాజెక్టులు) నిర్వహణ వ్యవస్థ నిర్మాణంలో వినూత్న ఆలోచనలను ప్రేరేపించే సుపరిపాలన పద్ధతులు అవలంభించాలనేది సూచన. ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం పాతదే. భూవినియోగం, విస్తీర్ణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోవడం గమనార్హం. నీటికొరత పెరుగుతున్న దనడానికి ప్రస్తుత దుస్థితి, అధ్యయనాలే సాక్ష్యం. పర్యావరణ మార్పులను తట్టుకునే నీటివనరులను పెంపొందించాలి.ప్రస్తుత నీటి విధానాలను సమీక్షించుకుని ముందుకు పోవాల్సిన అవసరాన్ని గుర్తించాలి. తాజా పరిస్థితులూ ఆ వాస్తవాలను నొక్కి చెబుతున్న విషయాన్ని అంగీకరించాలి. ఆ మేరకు కార్యాచరణ ఉండాలి.

నీటిపారుదల ప్రాజెక్టుల్లో రైతుల భాగస్వామ్యం అత్యంత కీలకం. ప్రణాళిక దశనుంచే అనుకున్న లక్ష్యాల సాధనకు అడుగులు పడాలి. అందుబాటులోకి వచ్చే నీరు, విద్యుత్ వినియోగం సమర్థవంతంగా ఉండటానికి తగిన పంటల విధానం రూపకల్పనకు రైతులతో విస్తృత సంప్రదింపులు తప్పనిసరి. వాతావరణంలో మార్పులతో పుడమి వేడి పెరుగుతున్న మాట ఎవరూ కాదనలేనిది. అప్పుడు సర్కారీ పెట్టుబడులు అర్థవంతంగా, ప్రయోజన కారిగా ఉండాలనేది ఆర్థికవేత్తల అభిప్రాయం. రోజురోజుకూ అధికమవుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికల రచన జరగాలి. అమలూ పకడ్బందిగానే ఉండాలి. రాజకీయ అవినీతి, అశ్రీతపక్ష పాతానికి ఆనవాలుగా నిలిచింది నేడు కాళేశ్వరం ప్రాజెక్టు. గత ప్రభుత్వం రీడిజైనింగ్, పునరుద్ధరణ, సంస్కరణలు, అద్భుతాలు అంటూ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టుల్లో అధ్యయనం, లోతైన పరిశీలన, పారదర్శకత, జవాబుదారీతనం లేకపోవడమే కాళేశ్వరం విఫలమవడానికి ప్రధాన కారణంగా నిపుణుల విమర్శ. గతకాలపు అనుభవాలను గుణపాఠాలు స్వీకరించి ముందడుగు వేయడం ప్రస్తుత రేవంత్ సర్కారు కర్తవ్యంగా భావించాలి.

విద్వేష విషబీజం 'రజాకార్'


ఎస్ వీరయ్య


రజాకార్ సినిమా ఇప్పుడే ఎందుకు విడుదలైంది? ఏడాది కిందనే బండి సంజయ్ ఈ సినిమా రాబోతున్నదనీ, కాచుకోండనీ సవాలు విసిరాడు కదా! ఆయనే ఇప్పుడు పన్ను రాయితీ అడుగుతున్నారు. కారణమేమిటి? అసలు చరిత్రలో ఏం జరిగింది? మార్చి 12న కేంద్ర ప్రభుత్వం 'సెప్టెంబర్ 17' విమోచన దినంగా జరుపుకోవాలని ఆదేశాలు జారీచేసింది. 15వ తేదీన రజాకార్ సినిమా విడుదలైంది. 16వ తేదీన ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు ప్రకటించింది. 15-16 తేదీలలోనే ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణలో పర్యటించారు. వీటి మధ్య సంబంధం ఏమిటి? ఇవన్నీ సమాధానం వెతకాల్సిన ప్రశ్నలే.

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో 1946 నుంచి 1951 వరకు సాగిన చారిత్రాత్మక పోరాటం. హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనంకాక తప్పని పరిస్థితి సృష్టించిన మహోద్యమం. అయినా సినిమాలో ఎక్కడా ఎర్రజెండా కనిపించదు. అనేక సంస్థలతో పాటు కమ్యూనిస్టు పార్టీ కూడా పోరాడుతున్నదని ఒక సందర్భంలో భారత ప్రభుత్వంలో హోంమంత్రి సర్దార్ పటేల్‌కు మున్షీ చెప్పినట్టు మాత్రం చూపించారు. విలీనం సమయంలో కమ్యూనిస్టులు మెల్లగా తప్పుకున్నారని అబద్ధాలు చెప్పారు. పోరాటం మొదలైంది జమీందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా. భూమి కోసం,

నిజాం రాచరికాన్ని, దౌర్జన్యాలను ఎండగట్టిన పాత్రికేయుడు షోయబుల్లాఖాన్. ఆయన్ను హత్య చేసింది రజాకార్ మూకలు. భూస్వాముల దోపిడీ మీద, నిజాం దౌర్జన్యాల మీద యుద్ధం ప్రకటించిన కవీ, కమ్యూనిస్టు నేత మఖ్దుం మొహియుద్దీన్. ఈ మొత్తం పోరాటానికి నాయకత్వం వహించిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. వీరోచిత పాత్ర పోషించిన నేతలు రావి నారాయణ రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి నాయకులెందరెందరో. నాలుగువేల మంది ఎర్రజెండా యోధులు ప్రాణాలర్పించిన వీరగాథ. ఇక్కడ హిందూ-ముస్లిం సమస్య ఎక్కడిది? కానీ రజాకార్ సినిమాలో ఈ పోరాటానికి మతం రంగు పులిమారు. మత మార్పిడులకు, తుర్కిస్తాన్ ఏర్పాటు ప్రయత్నాలకు వ్యతిరేకంగా సాగిన మతకొట్లాటగా చిత్రీకరించారు. చరిత్రను దారుణంగా వక్రీకరించారు.

భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటం, భూస్వామ్య వ్యవస్థ మీద తిరుగుబాటుగా మారింది. రైతాంగమే కాదు, సమస్త కులవృత్తులు భూస్వాములకు వెట్టిచాకిరీ చేయాలి. తమ ఉత్పత్తులను ఉచితంగా ఇవ్వాలి. అందుకే హిందూ, ముస్లిం తేడా లేకుండా గ్రామాలకు గ్రామాలే తిరుగుబాటు బావుటా ఎగురవేసాయి. దొరల గడీల మీద యుద్ధం ప్రకటించాయి. వెట్టిచాకిరీ మీద ప్రతిఘటనగా మొదలై దున్నేవాడికే భూమి కోసం సాగింది. రైతాంగం సాధించిన భూమి, ఇతర హక్కుల రక్షణ కోసం క్రమంగా నిజాం రాచరికాన్నే సవాలు చేసింది. హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీనమైన తర్వాత కూడా పోరాటం కొనసాగించవల్సి వచ్చింది. 1951 అక్టోబర్‌లో ఆనాటి నెహ్రూ ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం మేరకు పోరాట విరమణ జరిగింది. పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది ఈ పోరాటం. వృత్తిదారులకు రక్షణ కల్పించింది. మూడువేలకు పైగా గ్రామరాజ్యాలు ఏర్పాటు చేసింది. కనీస వేతనాలు గ్యారంటీ చేసింది. స్త్రీ పురుషులకు సమాన హక్కులు ప్రకటించింది. కుల వివక్షను నిషేధించింది. గ్రామాల మీద భూస్వాముల పెత్తనాన్ని, నిజాం రాజు ఆధిపత్యాన్ని తిరస్కరించింది. ఇంతటి భూ పోరాటంలో ఐలమ్మ పోరాటం పేరుతో ఒక ఘటనగా మాత్రం చూపించి, మొత్తం పోరాట స్వభావాన్ని వక్రీకరించారు. కొత్త తరాలకు ఈ సినిమాలో చూపించిందే చరిత్రగా తప్పుదారి పట్టించారు. చివరకు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా 1836-60 కాలంలో జరిగిన రాంజీ గోండు తిరుగుబాటును కూడా నిజాం వ్యతిరేక పోరాటంతో అతికించారు.

భూస్వాములు, జమీందార్లూ, జాగీర్దార్ల మీద ఆధారపడి సాగుతున్న నిజాం రాజ్యం, ఈ పెత్తందార్ల అధికారానికే ముప్పు ఏర్పడడాన్ని సహించలేక పోయింది. తన సైన్యాన్ని దొరలకు మద్దతుగా పంపింది. ఖాసిం రజ్వీ నాయకత్వంలో ఏర్పడిన రజాకార్ మూకలను కూడా భూస్వాములు స్వాగతించారు. తమ గడీలలో ఆశ్రయమిచ్చి గ్రామపేదల మీద ఎగదోసారు. ఇక్కడ రజాకార్లు ముస్లింలు. వారిని పేద రైతాంగం మీద ఎగదోసి దాడులు చేయించిన భూస్వాములు హిందువులు. రజాకార్ సంస్థకు అధ్యక్షుడు ఖాసీం రజ్వీ కాగా, ఉపాధ్యక్షుడు విసునూరు రామచంద్రారెడ్డి. భూస్వామిని ప్రశ్నించినందుకు బందగి (ముస్లిం) హత్యకు గురయ్యాడు. హత్య చేయించిన భూస్వామి హిందువు. భూస్వామికి అండగా నిలిచినది నిజాం ప్రభుత్వం. నిజాం రాచరికాన్ని, దౌర్జన్యాలను ఎండగట్టిన పాత్రికేయుడు షోయబుల్లాఖాన్. ఆయన్ను హత్య చేసింది రజాకార్ మూకలు. భూస్వాముల దోపిడీ మీద, నిజాం దౌర్జన్యాల మీద యుద్ధం ప్రకటించిన కవీ, కమ్యూనిస్టునేత మఖ్దుం మొహియుద్దీన్. ఈ మొత్తం పోరాటానికి నాయకత్వం వహించిన యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య. వీరోచిత పాత్ర పోషించిన



నేతలు రావి నారాయణ రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి నాయకులెందరెందరో. నాలుగువేల మంది ఎర్రజెండా యోధులు ప్రాణాలర్పించిన వీరగాథ. ఇక్కడ హిందూ-ముస్లిం సమస్య ఎక్కడిది? కానీ రజాకార్ సినిమాలో ఈ పోరాటానికి మతం రంగు పులిమారు. మత మార్పిడు లకు, తుర్కిస్తాన్ ఏర్పాటు ప్రయత్నాలకు వ్యతిరేకంగా సాగిన మతకొట్లాటగా చిత్రీకరించారు. చరిత్రను దారుణంగా వక్రీకరించారు. ఇందుకోసం, నేటి రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ఆవు పాత్రను కూడా సృష్టిం చారు. రజాకార్ మీద ఆవు దాడి చేసినట్టు చూపించి, హిందువులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాల నుంచి రజాకార్ మూకల దాడులను వేరుచేసి చూపారు. తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కనుగుణంగా చరిత్రను వక్రీకరించేందుకు వాడుకున్నారు.

జాతీయ జెండా పూని ప్రజలు తిరుగుబాటు చేసినట్టు చూపించారు. దీనికి స్టేట్ కాంగ్రెస్ పేరు వాడుకున్నారు. సంస్థానాలలో పోరాటం చేయవద్దని ఆనాటి కాంగ్రెస్ పార్టీ నిర్ణయం. అందువల్ల కొందరు స్టేట్ కాంగ్రెస్‌గా ప్రకటించుకున్నప్పటికీ, ఈ పోరాటంతో వారికి సంబంధం లేదు. విడిగా వారు పోరాడిందీ లేదు. కానీ నేటితరం భావోద్వేగాలను తప్పుదారి పట్టించేందుకు పెద్ద స్తూపం రూపంలో, త్రివర్ణ పతాకం ఎగురవేసేందుకు చేసిన ప్రయత్నంగా, దానిమీద రజాకార్లు దాడి చేసినట్టుగా నాటకీయంగా చిత్రీకరించారు. స్టేట్ కాంగ్రెస్ ఏనాడూ రజాకార్లతో ఘర్షణ పడ్డ దాఖలాల్లేవు కదా!

మొదట ఈ పోరాటానికి పునాదులు వేసింది ఆంధ్ర మహాసభ. తెలుగు భాష అభివృద్ధి కోసం, గ్రంథాలయోద్యమం నడిపింది. సాంస్కృతికోద్యమానికి నాయకత్వం వహించింది. ఇందులోనుంచే ఎర్రజెండా ఉద్యమం ఆవిర్భవించింది. భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ రూపంలో పోరాటం ఆరంభమైంది. కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో సాయుధ పోరాటంగా మారింది. కానీ ఎక్కడో ఒక మాటమాత్రంగానే ఆంధ్ర మహాసభను ప్రస్తావించారు. కమ్యూనిస్టులు, ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజ్, వందేమాతరం, స్టేట్ కాంగ్రెస్, తదితర సంస్థల ఆధ్వర్యంలో పోరాటం జరిగినట్టు ప్రస్తావించారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలను సాయుధ రైతాంగ పోరాటంతో ఏమాత్రం సంబంధం లేని సంస్థలను ఒకే గాటన కట్టారు. నాయకులు, తేదీలు, ప్రాంతాల పేర్లు వాడుకుని వాస్తవ చరిత్రను వక్రీకరిం చారు.

హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌లో విలీన క్రమాన్ని పూర్తిగా వక్రీకరించారు. ఇందుకోసం ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అవమానించేందుకు వెనుకాడలేదు. యూనియన్ సైన్యాలను నిజాం రాజు ప్రతిఘటించినట్టు అభూత కల్పనలు చిత్రీకరించారు. నిజానికి నిజాం రాజు అసలు ఇండియన్ సైన్యాలతో పోరాడనే లేదు. చేతులెత్తేసాడు. సాయుధ రైతాంగం తిరుగుబాటుతో నిజాం రాజు సింహాసనం కదులుతున్న దశలో, పటేల్ సైన్యాల శరణు కోరాడు. సెప్టెంబరు 13న యూనియన్ సైన్యాలు రావటం, 17న విలీనానికి నిజాం రాజు మిర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రకటన చేయటం చకచకా జరిగిపోయాయి. ఇక్కడ 13వ తేదీ సంఖ్యకు గుజరాత్ సెంటిమెంట్ జోడించారు. అనేక రాజ్యాలను ఆక్రమించి, బ్రిటిష్ ఇండియాగా ప్రకటించుకుని తెల్లదొరలు రాజ్యమేలిన విషయం చారిత్రక సత్యం. బ్రిటిష్ ఇండియాలో కూడా జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, ముస్లిం లీగ్‌ల నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం సాగింది. అనేక ఇతర సంస్థలు, వ్యక్తులు, సమరయోధులు తోడయ్యారు. స్వాతంత్ర్యం సిద్ధించే సమయానికి స్వతంత్ర, సామంత రాజ్యాలుగా ఉన్న 565 సంస్థానాల గురించి కూడా ఒప్పందం జరిగింది. ఆమేరకే కొన్ని ఇండియన్ యూనియన్‌లో, మరికొన్ని పాకిస్తాన్‌లో విలీనం కాగా, హైదరాబాద్, జమ్ము కాశ్మీర్, జునాఘడ్ సంస్థానాలు స్వతంత్ర రాజ్యాలుగానే ప్రకటించుకున్నాయి. జునాఘడ్ ప్రజల తిరుగుబాటుతో ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత ఇండియాలో విలీనమైంది. జమ్ముకాశ్మీర్ రాజు ఒకవైపు షేక్ అబ్దుల్లా నాయకత్వంలో ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న కశ్మీరీల పోరాటం, మరోవైపు పాక్ సైన్యాల చొరబాటుతో దిక్కులేక, జమ్ము కాశ్మీర్ రాజు, తన సంస్థానాన్ని కొన్ని షరతులతో ఇండియాలో విలీనం చేసి, ఇండియన్ సైన్యాల సహాయం కోరాడు. హైదరాబాద్ రాజ్యంతో భారత ప్రభుత్వం యథాతథ ఒప్పందం చేసుకున్నది. కమ్యూనిస్టుల నాయకత్వంలో పోరాటంతో నిజాం రాజ్యం కూలిపోయే దశలో మాత్రమే ఎర్రజెండా పోరాటాన్ని అణిచేందుకు, భూస్వాములను రక్షించేందుకు పటేల్ సైన్యాలు ప్రవేశించి, నిజాం రాజుతో రాజీ కుదుర్చుకున్నాయి. ఏ నిజాం రాజ్యం మీద ప్రజలు తిరుగుబాటు చేసారో ఆ రాజైన మిర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ఖైదు చేయవల్సింది పోయి, హైదరాబాద్ స్టేట్‌కు రాజప్రముఖ్‌గా నియమించి గౌరవించారు. విలీనం చేసినందుకు కోట్ల రూపాయల విలువ చేసే సంపద ముట్టజెప్పారు. మరోవైపు నరహంతక ఖాసిం రజ్వీకి మరణశిక్ష వేయాలని ప్రజలు కోరుతుంటే, సకల మర్యాదలతో పాకిస్తాన్ పంపించి రక్షించారు. రైతులు దున్నుకుంటున్న భూములు గుంజుకుని భూస్వాములకు అప్పగించారు. అడ్డుకున్న రైతులను 2500 మందిని పటేల్ సైన్యాలు పొట్టన బెట్టుకున్నాయి. పటేల్ సైన్యాలు నిజాం రాజును బంధించి, పోరాడుతున్న ప్రజల హక్కులు కాపాడుతాయని నమ్మిన తెలంగాణ రైతాంగాన్ని మోసం చేసాయి. దానితో హక్కుల కోసం పోరాటం కొనసాగించక తప్పలేదు. ఇదీ చరిత్ర.

బ్రిటిష్ ఇండియాలో జరిగింది స్వాతంత్ర్య పోరాటం. తెలంగాణ ఆనాడు బ్రిటిష్ ఇండియాలో లేదు. ఇక్కడ

కమ్యూనిస్టుల నాయకత్వంలో పోరాటంతో నిజాం రాజ్యం కూలిపోయే దశలో మాత్రమే ఎర్రజెండా పోరాటాన్ని అణిచేందుకు, భూస్వాములను రక్షించేందుకు పటేల్ సైన్యాలు ప్రవేశించి, నిజాం రాజుతో రాజీ కుదుర్చుకున్నాయి. ఏ నిజాం రాజ్యం మీద ప్రజలు తిరుగుబాటు చేసారో ఆ రాజైన మిర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ఖైదు చేయవల్సింది పోయి, హైదరాబాద్ స్టేట్‌కు రాజప్రముఖ్‌గా నియమించి గౌరవించారు. విలీనం చేసినందుకు కోట్ల రూపాయల విలువ చేసే సంపద ముట్టజెప్పారు. మరోవైపు నరహంతక ఖాసిం రజ్వీకి మరణశిక్ష వేయాలని ప్రజలు కోరుతుంటే, సకల మర్యాదలతో పాకిస్తాన్ పంపించి రక్షించారు. రైతులు దున్నుకుంటున్న భూములు గుంజుకుని భూస్వాములకు అప్పగించారు. అడ్డుకున్న రైతులను 2500 మందిని పటేల్ సైన్యాలు పొట్టన బెట్టుకున్నాయి.

జరిగింది భూస్వాముల మీద, రాచరికం మీద పోరాటం. దీనిని కూడా వక్రీకరించి స్వతంత్ర పోరాటంగా చిత్రీకరించారు. మతం రంగు పులిమి ముస్లింల నుంచి హిందువుల విముక్తిగా చిత్రీకరించారు. దీనికే మోడీ ప్రభుత్వం 'విమోచన దినం'గా పేరు పెట్టింది. వాస్తవానికి విలీనం జరిగింది. భూస్వామ్య దోపిడీ నుంచి విముక్తి జరగనే లేదు. 565 సంస్థానాలు కలవకపోతే భారతదేశం 565 ముక్కలయ్యేదని, అఖండ భారత్ ఏమయ్యేదని సర్దార్ పటేల్ అన్నట్టుగా చూపించి పటేల్ పరువు తీసారు. ఇప్పుడున్న బీజేపీ నేతలకు, ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంతో అణువంత సంబంధం లేదు. కానీ స్వాతంత్ర్యోద్యమంలో ఉన్న కాంగ్రెస్ నేత సర్దార్ పటేల్. బ్రిటిష్ ఇండియాకు, 565 సంస్థానాలకు సంబంధం లేదని వారికి బాగా తెలుసు. వాటిని ఇండియాలో విలీనం చేయటమే ఆనాటి సమస్య. అనేక రాజ్యాలు, భాషలు, సంస్కృతుల సమాహారంగా ఏర్పడింది కాబట్టే దీనిని 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అన్నారు.

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందటం కోసం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రజాకార్ పేరుతో చరిత్రను వక్రీకరించి సినిమా తీసాయి. దీనికి ముందు 'కశ్మీర్ ఫైల్స్', 'కేరళ స్టోరీ' పేరుతో కూడా ఇలాంటి ప్రయత్నమే చేసారు. గొప్ప నటీనటులను, రచయితలను, దర్శకులను, నిపుణులైన సిబ్బందిని ప్రజా ప్రయోజనాలకు హాని చేసే సినిమా రూపొందించేందుకు, ప్రమోషన్ కోసం సమర్థవంతంగా వాడుకున్నారు. ■

వల్లించేది శాంతి ప్రవచనాలు..


ఎం కోటేశ్వరరావు
8331013288

అణుశక్తితో నడిచే ఓహియో తరగతి జలాంతర్గాములను కూడా సూయజ్ కాలువ ద్వారా సమీకరించారు. ఇవి ఎక్కడా ఎలాంటి హడావుడి చేయవు. ఒక్కొక్క జలాంతర్గామి 154 తోమహాక్ క్రూయిజ్ క్షిపణులను మోసుకు పోగలదు. మధ్యధరా సముద్రంలో ఉన్న ఫోర్డ్ కారియర్ అనే యుద్ధ నౌకను కూడా తరలించారు.దీనిలో ఒక విమానవాహక యుద్ధ నౌకతో పాటు మూడు ఖండాంతర క్షిపణి రక్షణ నౌకలు కూడా ఉన్నాయి.ఎమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణులను కూల్చివేసిన నౌకతో పాటు ఇతర అనేక యుద్ధనౌకలను మధ్యధరా సముద్రం నుంచి ఎర్ర సముద్రంవైపు తరలించారు. ఇవన్నీ ఇజ్రాయిల్‌కు మద్దతుగా, దాన్ని వ్యతిరేకించే దేశాలను బెదిరించటం, అవసరమైతే దాడులకు దిగేందుకే అన్నది స్పష్టం.

ప్రపంచ శాంతికోసమే తాము తాపత్రయ పడుతున్నట్లు చెప్పిన వారందరూ చరిత్రలో అశాంతికి మూలకారకులుగా రుజువైంది. ఇప్పటికీ ఆదే జరుగుతోందా? పాలస్తీనా ప్రాంతాలను కబళించిన ఇజ్రాయిల్ ఇప్పుడు మొత్తం అరబ్బులనే అంతం చేసేందుకు, వారి ప్రాంతాల నుంచి వెళ్లగొట్టేందుకు జరుపుతున్న మారణకాండ మంగళవారం నాటికి 165వ రోజులో ప్రవేశించింది. గాజాలో ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన వారి సంఖ్య 32వేలకు చేరుకుంది. గాయపడిన వారు, నిలువనీడ, సర్వస్వం కోల్పోయిన వారు, ధ్వంసమైన గృహాల సంఖ్య సరేసరి. మానవహక్కులు, మానవాదానికి అసలు సిసలు ప్రతినిధులుగా చెప్పుకుంటున్నవారు పడక కుర్చీలకే పరిమితమయ్యారు. గతేడాది అక్టోబరు ఏడు నుంచి జరుపుతున్న ఇజ్రాయిల్ దాడులతో పాటు మధ్య ప్రాచ్యంలో అమెరికా మిలిటరీ, ఆధునిక ఆయుధాల మోహరింపు కూడా పెరిగింది. ఆసియాలో పరిస్థితి ఇదైతే ఐరోపా దేశాలకు ముప్పు పేరుతో గత ఎనిమిది దశాబ్దాలుగా తిష్టవేసిన అమెరికా ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభం ముసుగులో ఆ దేశాలకు ముప్పును మరింత పెంచేవిధంగా ప్రయత్నించటం శాంతిని కోరుకొనే వారికి ఆందోళన కలిగిస్తోంది. నాటి జర్మనీ రెండవ ప్రపంచ యుద్ధానికి ప్రధాన కారకురాలిగా ఉంటే ఇప్పుడు అమెరికా చర్యలు మూడవ ప్రపంచపోరుకు దారితీసేవిగా ఉన్నట్లు అనేకమంది చెబుతున్నారు.

ఆసియా ఖండంలోని సహజ సంపదలు, రాజకీయ ఆధిపత్యం మీద కన్నేసిన అమెరికా ఒక్కోదశలో ఒక్కోకారణాన్ని సాకుగా చూపి తిష్టవేస్తోంది. మధ్య ప్రాచ్యంలో పరిణామాలు దేనికి దారితీసేదీ ఎవరూ ఊహించలేని స్థితి. బాధితులకు ఆహార సరఫరా చేస్తున్నట్లు చెబుతూనే అంతకంటే ఎక్కువగా అమెరికన్లు మిలిటరీ కేంద్రీకరణకు పూనుకున్నారు. గాజా మీద దాడులకు నిరసన లేదా ప్రతీకారంగా ప్రపంచంలో ఎంతో కీలకమైన నౌకా మార్గం ఉన్న ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్ వైపు ప్రయాణించే నౌకల మీద ఇరాన్ మద్దతు ఉన్న ఎమెన్‌లోని హౌతీ దళాలు దాడులకు దిగటం, వాటి మీద అమెరికా జరుపుతున్న దాడుల గురించి తెలిసిందే. కొద్ది గంటల్లోనే గాజాలోని హమాస్ సాయుధులను అదుపుచేస్తామని ప్రగల్బాలు పలికిన ఇజ్రాయిల్ ఇప్పటివరకు సామాన్య పౌరులు, వారిలో కూడా 70శాతం మంది పిల్లలూ, మహిళలు, వృద్ధులు, ఆసుపత్రులలో రోగులనే చంపుతున్నది. ఎంతకాలం అవసరమైతే అంతకాలం తాము మధ్య ప్రాచ్యంలోనే తిష్టవేస్తామని అమెరికా మిలిటరీ అధికారులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవటం అంత తేలికకాదని అమెరికా మిలిటరీ కమాండర్ మిగుయెజ్ చెప్పాడు. ఆహార సరఫరా పేరుతో ఆయుధాలను పెద్ద ఎత్తున ఎర్ర సముద్ర ప్రాంతానికి చేరవేస్తున్నారు. లెబనాన్‌లోని హిజబుల్లా, హౌతీ సాయుధులను ఎదుర్కొనేందుకు మధ్య ప్రాచ్యంలోని జలాల్లోకి ఐషెన్‌హోవర్, యుఎస్ఎస్ గెరాల్డ్ ఫోర్డ్ అనే రెండు విమానవాహక యుద్ధనౌకలను అమెరికా మోహ రించింది. వాటికి అనుబంధంగా అనేక ఇతర మిలిటరీ నౌకలు ఉన్నాయి. నీటిలో, నేల మీద ఎలా అవసరమైతే అలా ప్రయా ణించే యుద్ధ వాహనాలు, ఎఫ్-16 యుద్ధ విమానాలను పెద్ద ఎత్తున తరలించారు. గతంలో ఇరాక్‌లో మోహరించిన లక్షా 60వేలు, ఆఫ్ఘనిస్తాన్‌కు తరలించిన లక్ష మంది మిలిటరీతో పోలిస్తే ఇప్పుడు మధ్య ప్రాచ్యంలో ఉన్న తమ సేనలు తక్కువే అని అమెరికా సమర్థించుకుంటున్నది. దీర్ఘకాలంగా మిలిటరీ స్థావరాలున్న కతార్, బహ్రెయిన్, యుఏయిలతో పాటు జోర్డాన్, ఇరాక్, సిరియాలలో కూడా వేలాది మంది సైనికులు ఉన్నారు.

తమ మిలిటరీ, పరికరాలను సిద్ధంగా ఉంచినప్పటికీ యుద్ధం కోసం కాదని అమెరికా రక్షణశాఖ పెంటగన్ ప్రపంచాన్ని నమ్మించేం

ఉక్రెయిన్ సంక్షోభం తొలిరోజుల్లో రష్యా యుద్ధ పాటవం పెద్ద లెక్కలోది కాదని ఐరోపా, ఇతర దేశాల జనాలను నమ్మిం చిన నాటో కూటమి ఇప్పుడు రష్యాను ఒక బూచిగా చూపుతున్నది. సోవియట్ యూనియన్ ఉనికిలో ఉన్నపుడు ఐరోపాను ఉపయోగించుకున్న అమెరికా, తాజాగా అదే ఐరోపా దేశాలతో కలసి ఉక్రెయిన్‌ను పరిశోధనశాలల్లో గినియా పందుల మాదిరి, తరువాత మరోసారి అమెరికా ఐరోపాను సమిధగా వినియోగించుకోవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. రష్యన్లు ఐరోపాను ఆక్రమించుకుంటారన్న ప్రచారం దానిలో భాగమే అన్నది స్పష్టం. అమెరికా గద్దె మీద ఎవరున్నా, తమ కార్పొరేట్ల, రాజకీయ ప్రయోజనాలు, ప్రపంచాధిపత్యానికే అగ్రపీఠం వేస్తారని తెలిసిందే.

దుకు చూస్తున్నది. అక్టోబర్ ఏడవ తేదీ తరువాత ఇప్పటివరకు హౌతీ దళాలు 170 దాడులను జరిపాయి. వాటిని నిలు వరించటంలో అమెరికా ఎలాంటి పురోగతినీ సాధించలేదు. దీంతో రవాణా నౌకలు ఆఫ్రికా గుడ్‌హోప్ అగ్రం చుట్టి తిరిగి రావాల్సి వస్తోంది. దీనివలన సరకు రవాణా ఆలస్యం కావటమే గాక ఖర్చు కూడా పెరుగుతున్నది. దీనికి పూర్తి బాధ్యత అమెరికా, ఇజ్రాయిల్‌దే అన్నది స్పష్టం. మధ్య ప్రాచ్యంలో ఎన్నో ఏండ్లుగా 30వేలకు పైగా అమెరికా దళాలు ఉన్నాయి. ఇవిగాక తాత్కాలికం, అదనపు దళాల పేరుతో మరికొన్ని వేల మందిని, ముందే చెప్పుకున్నట్లు పెద్ద సంఖ్యలో యుద్ధనౌకలనుదించారు. ఒక్క సిరియాలో తప్ప మధ్య ప్రాచ్య, పశ్చిమాసియాలోని దేశాలన్నింటా ఏదో ఒక పేరుతో అనుమతి తీసుకొనే అమెరికా తిష్టవేసింది. కొన్ని చోట్ల ఆయా దేశాల దళాలకు శిక్షణ, ఇస్లామిక్ తీవ్రవాదులను ఎదుర్కొనే పేరుతో ఇదంతా జరిగింది. నిజానికి ఇరాన్ మద్దతున్న సాయుధ బృందాలను అరికట్టేందుకే ఇదంతా అన్నది బహిరంగ రహస్యం. జోర్డాన్‌లో ఉన్న మిలిటరీ స్థావరం సరిహద్దుల్లో ఉన్న ఇరాక్, సిరియాలపై దాడులు చేసేందుకే ఉంది. తూర్పు సిరియాలో ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ దళాలున్నాయి. మధ్య ప్రాచ్యంలో తిష్టవేసిన అమెరికా దళాల గురించి చూద్దాం.

ఎర్ర సముద్రంలోకి ఫిబ్రవరిలో దించిన ఐషెన్‌హోవర్ విమానవాహక యుద్ధ నౌకతో పాటు నియంత్రిత క్షిపణిదాడుల నౌక, ప్రత్యర్థుల క్షిపణులను అడ్డుకొనే రెండు నౌకలు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, ఐదువేల మంది నౌకాదళ సిబ్బంది ఉన్నారు. ఇది ఇరాన్‌కు హెచ్చరికగానే జరిగింది. అణుశక్తితో నడిచే ఓహియో తరగతి జలాంతర్గాములను కూడా సూయజ్ కాలువ ద్వారా సమీకరించారు. ఇవి ఎక్కడా ఎలాంటి హడావుడి చేయవు. ఒక్కొక్క జలాంతర్గామి 154 తోమహాక్ క్రూయిజ్ క్షిపణులను మోసుకు పోగలదు. మధ్యధరా సముద్రంలో ఉన్న ఫోర్డ్ కారియర్ అనే యుద్ధ నౌకను కూడా తరలించారు.దీనిలో ఒక విమానవాహక యుద్ధ నౌకతో పాటు మూడు ఖండాంతర క్షిపణి రక్షణ నౌకలు కూడా ఉన్నాయి.ఎమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణులను కూల్చివేసిన నౌకతో పాటు ఇతర అనేక యుద్ధనౌకలను మధ్యధరా సముద్రం నుంచి ఎర్ర సముద్రంవైపు తరలించారు. ఇవన్నీ ఇజ్రాయిల్‌కు మద్దతుగా, దాన్ని వ్యతిరేకించే దేశాలను బెదిరించటం, అవసరమైతే దాడులకు దిగేందుకే అన్నది స్పష్టం. నౌకా దళాలు కాకుండా 45వేల మంది వివిధ దేశాల స్థావరాల్లో





ఉన్నారు.వీటన్నింటిని చూసుకొనే ప్రపంచం, ఐరాస సాధారణ అసెంబ్లీ ఖండించినా, భద్రతా మండలిలో తీర్మానాలు ప్రవేశపెట్టినా, అంతర్జాతీయ కోర్టులలో కేసులు దాఖలు చేసినా ఇజ్రాయెల్ ఏమాత్రం ఖాతరు చేయ కుండా గాజాలో మారణకాండ, పశ్చిమగట్టు ప్రాంతంలో నిరంతరం దాడులు జరుపుతున్నది. అమెరికా తీరు వివాదం విస్తరించటానికే దోహదం చేస్తున్నది.

ఆసియాలో ఇలా ఉంటే ఐరోపాలో ఉక్రెయిన్ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం గావించేందుకు అమెరికా పూనుకుంది. ఉక్రెయిన్‌కు 61బిలియన్ డాలర్ల ఆయుధ సరఫరాను అంగీకరించకపోతే ఆ దేశాన్ని, ఐరోపా, మొత్తం స్వేచ్ఛా ప్రపంచాన్ని ముప్పులో ఉంచినట్లేనని అధ్యక్షుడు జో బైడెన్ అమెరికా పార్లమెంట్‌ను బెదిరించాడు. 2014కు ముందు ఉన్న ఉక్రెయిన్ సరిహద్దులను పునరుద్దరిం చేందుకు రష్యాను ఓడించాలన్న జోబైడెన్ కలను చూస్తుంటే గతంలో వియత్నాం, ఉత్తర కొరియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా, ఎమెన్ తదితర దేశాలలో మాదిరి ఓటములు గుర్తుకు వస్తున్నట్లు అనేకమంది చెబుతున్నారు. అమెరికా గనుక 2022 ఏప్రిల్‌లోనే టర్కీ ముందుకు తెచ్చిన శాంతి ప్రతిపాదనలను అంగీకరించి ఉంటే ఇంతదాకా వచ్చేది కాదని, శాంతికి బదులు అమెరికా, నాటో కూటమి పోరును మరింతగా ఎగదోసేందుకే ఒక సాధనంగా చేసుకుంటున్నారన్నది స్పష్టం. ఉక్రెయిన్ వ్యవహారంలో అమెరికా వినాశకర విధానాన్ని అనుసరించటానికి కారకులైన వారిలో ఒకరిగా ఆరోపిస్తూ విక్టోరియా న్యూలాండ్ అనే విదేశాంగశాఖ ఉప మంత్రిని పదవీ కాలం ఉండగా ముందుగానే తొలగించారు. అంతకు రెండువారాల ముందు ఆమె ఒక సమావేశంలో మాట్లాడుతూ ఉక్రెయిన్‌పోరు మొదటి ప్రపంచ యుద్ధానికి దారితీసిన ఘర్షణ స్థాయికి దిగజారిందని, ఉక్రెయిన్‌కు ప్రతిపాదించిన 61 బిలియన్ డాలర్ల ఆయుధ సాయానికి ఒకవేళ పార్లమెంటు ఆమోదం తెలపకపోతే బైడెన్ దగ్గర మరొక ప్రత్యామ్నాయం లేదని వెల్లడించారు. ఈ కారణంగానే ఆమెను తొలగించారని, లేదూ బైడెన్ విధానాలకు నిరసనగా ఆమే రాజీనామా చేసినట్టు కూడా కొందరు చెబుతున్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు 2022 ఫిబ్రవరి చివరివారంలో ప్రారంభమైతే నెల రోజుల తరువాత అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ తమ లక్ష్యం శాంతి, సాధ్యమైనంత త్వరలో సాధారణ జీవన పునరుద్ధరణ అని చెప్పాడు. కానీ అమెరికా,బ్రిటన్,ఫ్రెంచి నేతలు రంగంలోకి దిగి శాంతి చర్చలు కొనసాగకుండా చేశారు. అంతే కాదు పెద్ద సంఖ్యలో నాటో దళాలను ఉక్రెయిన్‌కు పంపు తున్నట్లు ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ ప్రకటించాడు.దాన్ని నమ్మిన జెలెన్‌స్కీ వారి మాయలో పడి శాంతి ప్రక్రియ నుంచి వైదొలిగాడు. ఇప్పటివరకు ఆయుధాలు తప్ప దళాలను నాటో పంపలేదు. సంక్షోభం ప్రారంభమై పుడు ఉక్రెయిన్ జనాలకు హెల్మెట్లు, రాత్రుళ్ల పడుకొనేందుకు బ్యాగులు పంపితే సరిపోతుందని జర్మనీ చెప్పిందని, ఇప్పుడు వారే మరిన్ని క్షిపణులు, యుద్ధ టాంకులు అవసరమం టున్నారని మక్రాన్ చెబుతున్నాడు.


ప్రతి దశలోనూ ఆరు నుంచి ఎనిమిది నెలలు వెనుబడి ఉన్నామని కూడా అన్నాడు. ఒక వేళ గనుక ఇప్పుడు నాటో దళాలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే అది రష్యా-నాటో యుద్ధంగా మారుతుందని రష్యా హెచ్చరించింది. అవసరమైతే అణ్వాయుధాలను ప్రయోగించేందుకు కూడా వెనుకాడబోమని పుతిన్ చెబుతున్నాడు. అయితే ఇప్పటికే కొన్ని ప్రత్యేక నాటో దళాలు ఉక్రెయిన్‌లో ఉన్నట్లు పెంటగన్ పత్రాలు వెల్లడించాయి. ఉక్రెయిన్ చేరిన వేలటన్నుల ఆయుధాలు ఎక్కడకు వెళుతున్నదీ తెలుసుకొనేందుకు కొందరు తమ మిలిటరీ అధికారులు అక్కడ ఉన్నట్లు అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి అంగీకరించాడు. ■

ఓ మేరీ ప్యారీ దోస్త్...

ఓ మేరీ ప్యారీ దోస్త్...
ఈ రంజాన్ మాసపు
నెలవంక కొసల్లో కూసోని
కాసేపు ముచ్చటిద్దాం రా..!

అనంతమైన అంకెలను
విసుగ్గోక తవ్వుతూ
అంతుపట్టని అక్షరాల
ఓపిగ్గా పిలుస్తూ
బాల్యపు కాగితాల్లో
కదలకుండా ఎంతసేపని
కూర్చుంటావ్ ...రా..!

భూమిపై లేలేత అడుగులేసినట్టు
అక్షరాలను నొప్పించక రాసే
సున్నిత మనసున్నోడా...
శాంతి కపోతాన్నెగరేసినట్టు
బొమ్మల హత్తుకు గీసే
ప్రేమా హృదయుడా..!
నీ దోస్తాన్నూ వెంటేసుకురా
ప్రపంచాన్ని గీద్దాం..!



మన పరిచయానికి వీడుకోలుకు
మధ్య గడిచిన సంభాషణకు
సర్వానికి సమాధానమైన
చిరునవ్వుల చల్లుతూ రా..!

ఎంత అరిచినా వినని సమాజాన
సమస్త గాయాల మోసే
నీ మౌనమో అణుబాంబు
అందరినీ అల్లుకునే
నీ స్నేహమే ఒక విశ్వమని రా..!

రా... మేరీ ప్యారీ దోస్త్...
మఖ్దూం చెప్పినట్టు
"బతుకు వెంటబెట్టుకు నడుద్దాం
లోకాన్ని వెంటబెట్టుకు నడుద్దాం
మనం నడిస్తే కాలాన్నే
వెంటబెట్టుకు నడుద్దాం"
...రా..!

-అమృతరాజ్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
గురువారం | మార్చి 21, 2024 | www.navatelangana.com



దొండేటి అనసూర్యమ్మ మృతి

నివాళ్లర్పించిన పలువురు



నవతెలంగాణ-తిరుమలాయపాలెం
పిండిపోలు గ్రామానికి చెందిన యుటీఎఫ్ రాష్ట్ర నాయకులు దొండేటి రామచంద్రయ్య సతీమణి అనసూర్యమ్మ బుధవారం మృతిచెందారు. ఆమె భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్ సందర్శించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ దొండేటి అనసూర్యమ్మ మృతి చెందడం కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటని, ఆమె జీవించినంత కాలం భర్తకు సహకరిస్తూ పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారని, వారి జీవితం ఎంతోమంది కమ్యూనిస్టు భావాలు కలిగిన వారికి ఆదర్శమన్నారు. నివాళ్లర్పించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, బుగ్గవీటి సరళ, బండి రమేష్, బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, తుళ్లూరు నాగేశ్వరరావు, దొండేటి ఆనందరావు, పప్పుల ప్రసాద్, పద్మనాభల సుధాకర్, పప్పుల ఉపేందర్, చల్ల వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, పిట్టల పాపారావు, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, దొండేటి శ్రీనివాస్, నాగాటి సురేష్, పప్పుల చిన ఉపేందర్, దొండేటి నిర్మల్‌రావు, కల్లూరు శరత్ తదితరులున్నారు.



అంకమ్మ తల్లి తిరుణాళ్ళకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ఎర్రుపాలెం
మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ తల్లి, అక్కమ్మ పేరంటాల రామలింగేశ్వర స్వామి తిరుణాళ్ళ మహోత్సవమునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వంశ పారంపర్య పూజారి వేమిరెడ్డి వెంకటిరెడ్డి మాట్లాడుతూ నేటి నుండి తిరునాళ్ల ప్రారంభమవుతాయని తెలిపారు. గురువారం రాత్రి అమ్మవారు ఊరేగింపు, శుక్రవారం ఉదయం జలబిందలు, రాత్రి పూలకప్పెరా ఉంటుందని తెలిపారు. అంకమ్మ తిరుణాళ్ళ సందర్భంగా 23వ తారీకు నుండి ఆంధ్ర రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లా తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా మూడు జిల్లాల స్థాయిలో ఎడ్ల పూటీ పందాలు నిర్వహించబడతాయని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని ఈ పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 30 వేలు, ద్వితీయ బహుమతి 25 వేలు, తృతీయ బహుమతి,20 వేలు, చతుర్ధ బహుమతి 15,116 వేల రూపాయలు, పంచమ బహుమతి 12వేలు, షష్టిమ బహుమతి 10 వేలు, సప్తమ బహుమతి 8 వేలు, అష్టమ బహుమతి 6వేలు, నవమ బహుమతి 5,800, దశమ బహుమతి 5,500 రూపాయల నగదు బహుమతులను గెలుపొందిన వారికి అందజేయను న్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎంట్రీలకు సంప్రదించవలసిన వివరాలు 9908438525, 96408 54179 ఈ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఎంట్రీలకు చివరి తేదీ 22వ తారీకు సాయంత్రం 4 గంటలలోపు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-కల్లూరు



18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ పులి సాంబశివుడు, డిటి బాబ్జి ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఓటు హక్కు అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా యువ అధికారి చింతల అన్వేష్, అకౌంట్స్ ప్రోగ్రాం అధికారి కమర్తపు భానుచందర్ ఆదేశాల మేరకు కోవెలశ్రీ వెల్ఫేర్ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కాసిన కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఓటుపై అవగాహన కార్యక్రమం ప్రతిభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమం లో పీఈటి పి.వీర రాఘవయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డివో

నవతెలంగాణ - బోనకల్
అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని ఖమ్మం ఆర్డీవో గుంటుపల్లి గణేష్ సిబ్బందిని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ఖమ్మం ఆర్డీవో గుంటుపల్లి గణేష్ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజు వాహనాల తనిఖీ అనంతరం వాహనాల నమోదు రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. వాహనాల తనిఖీ తీరును ఆయన స్వయంగా పరిశీలించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, గిర్ధవర్ గుగులోతు లక్ష్మణ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఎర్ర శ్రీనివాసరావు, చెక్ పోస్ట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సప్త కళా సమ్మేళనం బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని భక్త రామదాసు క్షేత్రంలో ఈ నెల 24న ఫైర్ ప్రార్థవిక అండ్ పండు ఎంటర్టైన్మెంట్ వారి సమర్పించు సప్త కళా సమ్మేళనం బ్రోచర్‌ను బుధవారం నిర్వాహకులు ఫైర్ రవి ఆధ్వర్యంలో కళాపరిషత్ అధ్యక్ష కార్యదర్శులు కళాసారది డాక్టర్ నాగ బత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత ఆవిష్కరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి ఖమ్మం కళాపరిషత్ ఎప్పుడు ముందంజలో ఉంటారని అని అన్నారు. అదే విధంగా ఫైర్ రవి చిన్నప్పటి నుంచి చాలా కష్టపడి పైకి వచ్చాడని, ఇలాంటి కళాకారులను ప్రోత్సహించడం బాధ్యత అని వారు కొనియాడారు. అదే విధంగా ఈనెల 24 ఆదివారం సాయంత్రం 6:30కు జరగబోయే సప్త కళా సమ్మేళనంకు ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రజలు, కళాకారులు, కళాపోషకులు, అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

నవతెలంగాణ-ఎర్రుపాలెం
మండల పరిధిలోని మామునూరు గ్రామ పంచాయతీ శివారు లోని సింహాద్రి అప్పన్న స్వామివారి ఆలయం నందు వేద పండితుల మంత్రోచ్చారణతో బుధవారం ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పాల్గొని ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల వితరణతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్‌లో జాబ్ డ్రైవ్

నవతెలంగాణ-ఖమ్మం
నగరంలోని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేసెమెంట్ సెల్ అండ్ టిఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్‌లో హెటిరో కెమికల్స్ లిమిటెడ్ కంపెనీ పాల్గొని ఇంటర్వ్యూ ద్వారా 18 మంది విద్యార్థులను ఎంపిక చేయాలని ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాకీరుల్లా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.వెంకటేశ్వరరెడ్డి, టి.జీవన్ కుమార్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమా సత్యవతి, టిఎస్‌కేసీ కోఆర్డినేటర్ పి.అనురాధ, ప్లేసెమెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ వి.సాంబశివరావు, అధ్యాపకులు మహేష్, టాస్క్ జిల్లా కోఆర్డినేటర్ దినేష్, హెటిరో కెమికల్స్ హెచ్ఆర్ పర్సనల్ ప్రసాద్, మెంటార్ వేలాద్రి పాల్గొన్నారు.

డోర్నకల్- గద్వాల్ రైల్వేలైన్ కోసం మార్కింగ్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఖమ్మంరూరల్ మండలంలో ఇటీవల రెండు రోజులుగా అధికారులు రహదారులపై ఎస్‌సీపీ అని నలుపు, తెలుపు రంగులతో కూడిన మార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. డోర్నకల్ నుంచి సూర్యాపేట మీదుగా గద్వాల వరకు నూతనంగా నిర్మించనున్న రైల్వే లైన్ కోసం అధికారులు మార్కింగ్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో డోర్నకల్ నుంచి మిర్యాగూడెం మీదుగా యాదాద్రి పవర్ ప్లాంట్ కోసం రైల్వే ఏర్పాటుకు గతంలో ఖమ్మంరూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో అధికారులు సర్వే చేపట్టారు. ప్రస్తుతం డోర్నకల్ నుంచి గద్వాల రైల్వేలైన్ కోసం అధికారులు మార్కింగ్ చేయడం విశేషం..రహదారిపై గ్రామాల వద్ద మార్కింగ్‌లు చూసిన అన్నదాతలు రైల్వే లైన్ వస్తే తమ భూముల ధరలు అమాంతం పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్కింగ్‌లు ఎంవీపాలెం- కాచిరాజుగూడెం మధ్య ఎస్సీపీ 113, ఆరెకోడు- చింతపల్లి మధ్య ఎస్సీపీ 112 అని నంబర్లు ఏర్పాటు చేశారు.

స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

- వ్యకాస జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు
- ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం అభినందనీయం
- బివికే జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఖమ్మం
స్వచ్ఛత సేవా కార్యక్రమాల్లో ఆపద, విపత్తు సమయాల్లో ప్రజలు ఆదుకోవడంలో కూడా యువత ముందుండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు యువతకు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఉచిత బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు భూక్య ఉపేందర్ నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి యువకులు ముఖ్యంగా టెర్రరిజం వైపు కొట్టుకుపోతున్నారని, అన్ని అంశాలను డబ్బు చుట్టూ తిప్పుతూ డబ్బులు సంపాదించడమే జీవిత లక్ష్యంగా పని చేస్తున్నారని, ఈ ఉరుకుల పరుగుల జీవితంలో పక్క వారిని పట్టించుకోవడమే మర్చిపోతున్నారని, అందుకే యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ కూడా సామ్రాజ్యవాదులు వ్యతిరేకంగా పోరాటంలో యువతలందరినీ కలుపుకొని వచ్చి తెల్లదొరలను తరిమికొట్టే దానికి ఆయన జీవితాన్ని త్యాగం చేశాడని, ఆయన కోరుకున్న నిజమైన సమాజం రావాలంటే యువత పరుల కోసం పనిచేయాలని స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

బివికే జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ డివైఎఫ్ఐ నిర్వహిస్తున్న రక్తదానం అందరి దృష్టిని ఆకర్షిస్తుందని, డివైఎఫ్ఐ చేస్తున్న ప్రయత్నం మంచిదని, దీన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా ఉండడం, వివిధ సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం డివైఎఫ్ఐ చేస్తున్న మంచి పనులను గుర్తు చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ నేటి వరకు 2934 మందికి రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు. డివైఎఫ్ఐలో అడిగిన వెంటనే రక్తదానం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మందికి సాయం చేసేందుకు ఉచిత బ్లడ్ టెస్టింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టెస్టింగ్ ద్వారా గ్రూపు తీసుకొని అవసరమైనప్పుడు వారికి ఫోన్ చేసి రక్తం అందిస్తామని అన్నారు.

కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శివం నారాయణ, ఎన్నారై అసోసియేషన్ జిల్లా కార్యదర్శి స్వరూప రాణి, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శీలం వీరబాబు, కూరపాటి శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పొనుగుల సుధాకర్, డివైఎఫ్ఐ నాయకులు జక్కంపూడి కృష్ణ, తోట నరేష్‌రెడ్డి, పోలేపల్లి శరణ్య, బడా శభాష్ రెడ్డి, హుస్సేన్‌రావు, సునీల్, సాయి, జేమ్స్, గుమ్మడి బిక్షం, దుర్గాప్రసాద్, వెంకన్న, రవితేజ, వీరభద్రం, నరేష్ రెడ్డి, సుధాకర్, శ్రీహరి, విజయ్, కృష్ణ, శ్రీకాంత్, ప్రేమ్ నవీన్, గోపాలకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని అనాసాగరం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిపిఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎంపీవో శివకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గతంలో గ్రామంలో మంచినీటిని అందించిన బోర్వెల్స్ గ్రౌండ్ వాటర్ తగ్గినందున అవి సక్రమంగా పనిచేయడం లేదని చెప్పారు. నీళ్ల ఉన్న బోర్ వెల్స్ సదాశివపురం రోడ్డులోని బోర్ వెల్, స్కూల్ వద్ద ఉన్న బోర్వెల్‌లకు ఫెన్సింగ్ చేసి మోటార్లు ఏర్పాటు చేసి గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించాలన్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించే విధంగా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కెవి.రామిరెడ్డి, ఎడ్ల తిరుపతిరావు, గ్రామ శాఖ కార్యదర్శి ఎన్.మధుసూదన్‌రావు, పి.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గ పక్షపాతి చలమాల గంగాధర్

- వర్ధంతి సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి



నవతెలంగాణ-పెనుబల్లి
కార్మికవర్గ పక్షపాతి చలమాల గంగాధర్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి అన్నారు. గంగాధర్‌రావు వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన స్తూపం వద్ద నివాళ్లర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు కలకోట చిన్న వెంకటేశ్వర్లు జండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పార్టీ మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షత వహించగా మాచర్ల భారతి మాట్లాడుతూ బీజేపీ పాలకులు అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను ఎండగట్టాలన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్యల పైన పాలకులు అనుసరిస్తున్న విధానాలపైన అనేక పోరాటాలు చేయాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు మాట్లాడుతూ మతం, కులం, ప్రాంతం పేరు మీద ప్రజలను విడదీసి పాలకులు పాలన చేస్తున్నారన్నారు. వాటి నుండి రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చలమల విఠల్, గోపిసెట్ల వెంకటేశ్వరరావు, కాటినేని శ్రీనివాసరావు, ట్రైలర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు ఎస్కే భాషా, తడికమళ్ళ చిరంజీవి, చలమాల నరసింహారావు, అన్నపురెడ్డి లక్ష్మయ్య, మీదే స్వామి, సిపిఎం మండల నాయకులు గుడిమెట్ల బాబు, కండే సత్యం, మిట్టపల్లి నాగమణి, రాజనేని మంగమ్మ, మామిళ్ళ సోమయ్య పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్



నవతెలంగాణ- నేలకొండపల్లి
చెక్‌పోస్ట్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తప్పక తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. బుధవారం మండలంలోని పైనంపల్లి గ్రామం వద్ద గల సూర్యాపేట- ఖమ్మం జిల్లాల సరిహద్దులోని అంతర్ జిల్లా చెక్ పోస్టును ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ రికార్డులను ఆయన పరిశీలించారు. చెక్‌పోస్ట్ అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని ఆయన స్వయంగా పరిశీలించారు. పైనంపల్లి, చెరువుమాదారం, రాజారాంపేట పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహల్దార్ గౌరీ శంకర్, ఆర్ఐ ఏ.మధుసూదన్‌రావు, ఆర్‌అండ్‌బి ఏఈ ప్రసాద్, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం రూరల్
క్రీడలు యువతకు శారీరక మానసిక ఉల్లాసాన్నిస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట యూత్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నాయుడుపేటలో పాలేరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో యూత్ బాధ్యులు సాయి, పి.సాయి, ఏసు, కాంగ్రెస్ నాయకులు రామ్మూర్తినాయక్, కళ్లెం వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, కిషోర్ రెడ్డి, అశోక్ నాయక్, కిషోర్ నాయక్, ఏనుగు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆటో ఢీ.. ఇరిగిన విద్యుత్ స్తంభం

- తప్పిన పెను ప్రమాదం



నవతెలంగాణ- బోనకల్
అతివేగంతో వచ్చిన ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బుధవారం రాత్రంతా వీధిలైట్లు లేక గ్రామం చీకటిలో మగ్గింది. ఈ సంఘటన మండల పరిధిలోని చిరు నోముల గ్రామంలో బుధవారం రాత్రి పది గంటల సమయంలో జరిగింది. మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా నడుపుకుంటూ బోనకల్ నుంచి చిరునోముల వస్తున్నాడు. చిరునోముల గ్రామ సమీపంలోనే గరపాకుల నారాయణ స్తూపం వద్ద గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ స్తంభం ఇరిగి కింద పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా జరుగుతూనే ఉంది. ఆటో దెబ్బతిన్నప్పటికీ డ్రైవరు మాత్రం స్వల్పగాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. అదే సమయంలో కొంతమంది బోనకల్ నుంచి చిరునోముల వస్తు సంఘటనపై విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్ అధికారులు హుటాహుటిన వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. బుధవారం రాత్రి అంతా వీధిలైట్లు లేకపోవడంతో చీకటిలోనే గ్రామం ఉంది. సంబంధిత ఆటో డ్రైవర్‌పై విద్యుత్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అట్టహాసంగా శ్రీచైతన్యోత్సవ్-24

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఈనెల 21, 22 తేదీల్లో మండల పరిధిలో పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి టెక్నికల్ అండ్ కల్చరల్ ఫెస్ట్ శ్రీచైతన్యోత్సవ్-24 నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిలో భాగంగా ప్రాజెక్టు ఎక్స్పో, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు శ్రీ చైతన్యోత్సవ్-24కి హాజరవుతారని వివరించారు. 21వ తేదీన ముఖ్య అతిథిగా కలెక్టర్ గౌతమ్, స్టేట్ బోర్డు టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ పుల్లయ్య, జానకీరామ్ హాజరవుతారని వివరించారు. 22వ తేదీన కలర్స్ సెలబ్రేషన్స్ పేరుతో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, డైరెక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, సీఈఓ శ్రీనివాస్, ఏఓ వైశాలి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి : కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పెద్దతండా, మద్దులపల్లి, పొన్నెకల్లు ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అవసరమున్న చోట పెయింటింగ్ వేయాలని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్, పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు సరిపడా ఉండేలా చూడాలన్నారు. భద్రతా పరంగా అన్ని చర్యలు తీసుకోవాలని, రక్షణగోడ లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే రక్షణగోడ నిర్మించాలన్నారు. రక్షణ గోడలపై ఓటరు అవగాహనకు సంబంధించిన నినాదాలు రాయించాలన్నారు. ఎన్నికల విధుల సిబ్బందికి వసతికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు పాఠశాలను చూడగానే ఇందులో పోలింగ్ కేంద్రం ఉన్నదనే ప్రత్యేకత కన్పించాలన్నారు. పెద్దతండా, మద్దులపల్లిలోని అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. మెనూ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. కేంద్రాల్లోని స్టోర్సును పరిశీలించి సామగ్రి నిల్వను తనిఖీ చేశారు. పిల్లల బరువును తూకం వేసి చూశారు. అగ్రిమెంట్ ప్రకారం కోడిగుడ్లు బరువు ఉండేలా చూడాలన్నారు. అనంతరం పొన్నెకల్లు వద్ద నిర్మాణ పనులు జరుగుతున్న ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి పనులను కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు.ఈ నెల చివరి లోపు పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, రేడియం స్టిక్కర్లు ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణా సహాయ కలెక్టర్ యువరాజ్, జడ్పీ ఉప సీఈఓ నాగలక్ష్మి పాలేరు నియోజకవర్గ ఆర్ఓ రాజేశ్వరి, తహసీల్దారు రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, యస్ హెచ్ఈఈ యుగంధర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు



పట్టణ పరిధిలోని పుల్లయ్య బంజర్ రోడ్‌కు చెందిన ఇజ్జిగాని తిరుపతిరావు కుమార్తె ఇజ్జిగాని శిరీష, సంతోష్ నిశ్చయ తాంబూలాల వేడుకకు బుధవారం సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా బొడ్డు చిన్న నరసింహ కుమార్తె స్వరూప గోపిలకు ఇటీవల వివాహం జరగగా నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్ చౌదరి, బైర్ల కాంతారావు, నల్లగట్ల కిషోర్, తదితరులు ఉన్నారు.

పాకాల పాటి వీరయ్యకు నివాళి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కొత్త వెంకట గ్రామానికి చెందిన పాకాల పాటి వీరయ్య ఇటీవల మృతి చెందారు. దశదినకర్మ బుధవారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ నాయకులు వీరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాప సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కటికి కిరణ్ కుమార్, దీవెన వెంకటేశ్వరరావు, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచితంగా జీరో అకౌంట్

నవతెలంగాణ-తల్లాడ

మండలంలో పదేళ్లు నిండిన చిన్నారులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచితంగా జీరో అకౌంట్ అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకురాలు సంఘసాని నిర్మల కోరారు. పిల్లల ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, స్టడీ, కండక్ట్, జిరాక్స్, రెండు పాస్ ఫొటోలు తెచ్చుకుని జీరో ఎకౌంటు పొందాలని సూచించారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి జీరో అకౌంట్ ఇస్తున్నామని, వారు ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు. 1000 బీమా చెల్లిస్తే 20 లక్షలు ఇన్సూరెన్స్ పొందవచ్చు అన్నారు. ఎస్బిఐ కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-కామేపల్లి



మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం జాతర రెండు రోజుల నుండి కొనసాగుతోంది. కళ్యాణ మహోత్సవం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని సీనియర్ లాయర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బోడేపూడి విటల్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని తంబూరి దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ మహా అన్నదాన కార్యక్రమంలో సుమారు 5000 మందికి అన్నదానం చేశారు. అన్నదానం చేసిన విటల్ రావును పలువురు ప్రత్యేకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, బానోతు నరిసింహానాయక్, మేకపోతుల మహేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో పెట్రోల్ బంక్ ప్రారంభం

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి క్రాస్ రోడ్డు వద్ద బల్లేపల్లి మాజీ సర్పంచ్ భాషా నాయక్ ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంకును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అందరికీ వాహనాదారులకు నాణ్యమైన పెట్రోల్ డీజిల్ అందించాలని కోరారు. అందరికీ అందుబాటులో మంచి ప్రదేశంలో ఈ పెట్రోల్ బంకును ఏర్పాటు చేసినందుకు భాషానాయక్ ను ప్రత్యేకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఏపూరి మహేందర్ కుమార్ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని ముచ్చర్ల పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాన్ని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పోలింగ్ నిర్వహణ బందోబస్తు వివరాలు తదితర అంశాలపై స్థానిక సీఐ తిరుపతిరెడ్డి ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రత్యేక కృషి చేయాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులుగా దోసపాటి, రేగూరి ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-నేలకొండపల్లి



నేలకొండపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా దోసపాటి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడిగా రేగూరి హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నేలకొండపల్లిలోని వాసవి భవన్ నందు ఆర్యవైశ్య సంఘం మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నికలు జిల్లా ఆర్యవైశ్య సంఘం మహాసభ అధ్యక్షుడు వనమా వేణుగోపాల్ (సూరి) ఆదేశాల మేరకు నిర్వహించారు. ఎన్నికల ఆఫీసర్లుగా ఖమ్మానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు గోళ్ళ రాధాకృష్ణమూర్తి, గుమ్మడవెల్లి శ్రీనివాస్, వెచ్చ రామకృష్ణ వ్యవహరించినారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు దోసపాటి చంద్రశేఖర్, రేగూరి హనుమంతరావులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిచేస్తామని అన్నారు. మాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు గెల్లా జగన్మోహన్రావు, కొత్త రమేష్, వంగవీటి నాగేశ్వరరావు, రాయపూడి నారాయణరావు, కొప్పు కృష్ణమూర్తి, మాటూరి సుబ్రహ్మణ్యం, ఎండూరి బ్రహ్మం, ఎర్ర నాగేశ్వరరావు, కొత్త వేణుబాబు, దోసపాటి అచ్యుతరామయ్య, దోసపాటి వెంకటేశ్వరరావు, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, రాయపూడి శ్రీనివాస్ రావు, అయ్యప్ప శ్రీను, బోనగిరి యుగంధర్, ఎర్ర అప్పారావు, భవనాసి మోహన్ రావు, జీవీ రమణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే మా సంపూర్ణ మద్దతు

- బీసీ ఫెడరేషన్ కులాల సమితి, పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ షేక్ సయ్యద్ భాష

నవతెలంగాణ-ఖమ్మం



పార్లమెంటు ఎన్నికలలో బీసీలకు అండగా ఉన్న కాంగ్రెస్ పార్టీకే మా సంపూర్ణ మద్దతు అని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ షేక్ సయ్యద్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. తనను ఖమ్మం పార్లమెంట్ ఇన్చార్జిగా ప్రకటించినందుకు రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దూదేకుల సామాజిక వర్గానికి కూడా ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్ర కార్యవర్గ పెద్దల ఆదేశాల మేరకు ఫెడరేషన్ కులాల డిమాండ్లకు అనుకూలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకే మా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

బలగాలతో ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ-ఖమ్మం



పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్ మార్చ్ పోలీసు కవాతు నిర్వహిస్తున్నామని పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెంట్రల్ పోలీస్ ఫోర్స్, పారామిలిటరీ బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి ఫ్లాగ్ మార్చ్ పోలీసు కవాతును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా పార్లమెంటు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే సెంట్రల్ పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి ఫ్లాగ్ మార్చ్ పోలీసు కవాతును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన వ్యక్తికి, ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ వారిగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే నేరచరితులను బైండోవర్ చేస్తామని తెలిపారు. అక్రమ మద్యం, నగదు, కానుకల రవాణాను చెక్ పెట్టేందుకు జిల్లా సరిహద్దులో చెక్ పోస్టుల ద్వారా నియంత్రించే చర్యలు చేపట్టనునట్లు తెలిపారు. లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఖమ్మం నగరంతో పాటు వైరా, సత్తుపల్లి, మధిర, ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలోని సెంట్రల్ పోలీస్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ నూతన పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్ బృందాలు బాధ్యతయుతమైన విధులు నిర్వరిస్తున్నారని పేర్కొన్నారు.



ఖురాన్‌తోనే మానసిక ప్రశాంతత

- ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం

పవిత్ర గ్రంథం ఖురాన్‌ను చదవడం నేర్వడం ఆచరించడం ద్వారా ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ముఫ్తీ మహ్మద్ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మీ అన్నారు. ఎప్పుడైతే మనిషి ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడతాడో అప్పుడు సమాజంలో ఏ సమస్యలు తలెత్తబోవని, తద్వారా అది మానవాళి వికాసానికి దోహదం చేస్తుందని అన్నారు. నగర శివారు గొల్లగూడెంలోని తాలిముల్ ఇస్లాం మదర్సాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, ప్రత్యేక తరావీహ్ నమాజ్ ద్వారా తొమ్మిది రోజుల్లోనే ఖురాన్ పఠనం పూర్తి చేశారు. ఈ సందర్భంగా మదర్సాలో జరిగిన ఖత్మే ఖురాన్ వేడుకలో ముఫ్తీ రవూఫ్ ఖాన్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. నేటి తరం పిల్లలు ఖురాన్ ను ప్రేమించడం.. గౌరవించడం గురించి నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని గుర్తు చేశారు. మనిషి తన జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలంటే విశ్వాసం ఒక్కటే ఆయుధమని ఆయన అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ అల్లాపై విశ్వాసంతో జీవించడం నేర్చుకోవాలన్నారు. ఇస్లాం ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ మరో పది మందికి చేరవేయాలని సూచించారు. తమ పక్కన ఉండే పొరుగువారి ఆకలి ని తీర్చమనే గొప్ప మానవతను చాటి చెప్పిందే ఇస్లాం అన్నారు. అందుకే ఇస్లాం ను ఇతరులు చూసి నేర్చుకునే విధంగా ముస్లింలు ఆచరణ ఉండాలని హితవు పలికారు.

రాయల నాగేశ్వరరావుకు అభినందనలు

నవతెలంగాణ-ముదిగొండ

టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం రాయల నాగేశ్వరరావు నివాసంలో ముదిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం రాయలను కలిసి పూలబొకే ఇచ్చి అభినందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పందిరి అంజయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పసుపులేటి దేవేంద్రం, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు భూక్య ధర్మానాయక్, మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ ఖేత్ జనరల్ సెక్రటరీ పోతురాజు పురుషోత్తం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇలవల పుల్లారెడ్డి, అయ్యగారిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మట్టా బాబురాంరెడ్డి, నాయకులు కళ్యాణ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయల నాగేశ్వరరావుకు సన్మానం

ఖమ్మం : కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ పదవుల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్‌కు నామినేట్ అయిన రాయల నాగేశ్వరరావును డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, డిసిసిబి అధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరరావు సన్మానించారు. బుధవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఆయనను జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, మారం కరుణాకర్ రెడ్డి, సామినేని సురేష్, అప్పారావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం

నవతెలంగాణ-వైరా



లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు అధ్యక్షతన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు సామూహిక సీమంతం బుధవారం జరిగింది. ఈ ముఖ్య అతిథిగా హాజరైన వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ -2 నంబూరి మధుసూధన్ రావు మాట్లాడుతూ ప్రతి గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండాలని, ఐసీడీఎస్ ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో ఇస్తున్న పౌష్టికాహారం కిట్స్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. క్లబ్ అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు మాట్లాడుతూ వైరా, కొణిజర్ల సెక్టార్లలోని అంగన్వాడీ కేంద్రాల్లోని 27 మంది గర్భిణీలకు రూ.20 వేలు విలువచేసే చీరె, సీమంతపు కిట్టును అందజేస్తూ సామూహికంగా సీమంతం వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ సిడిపిఓ కమల ప్రియ, అదనపు సిడిపిఓ ఉషారాణి, హెల్త్ సెంటర్ హెడ్ నర్స్ రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణీలు పరీక్షలు చేయించుకుంటూ అందుకు సంబంధించిన మందులు వాడాలని అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పోషణ పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని, పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ నియమాలను పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అవసరమైన సందర్భాల్లో కేంద్రాలను సందర్శించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి చింతలపూడి వెంకటేశ్వరరావు, నంబూరు విజయ రాణి కన్యదారి హనుమాయమ్మ, బండారు సరిత, సత్యవతి, కొమిరిశెట్టి శ్రీధర్, చింతోజు నాగేశ్వరరావు, సీత, నీరజ, పది మల పుష్పలత, ఏపూరి రాజారావు, గద్వాల్ రవీందర్, పుష్పావతి, కొల్లా రాంబాబు, కట్ల సురేష్, తాడికొండ రాము, పులి కృష్ణార్జున్, అంగన్వాడీ సిబ్బంది చెరుకూరు వాసవి, శారద, దయామని, అరుణ తదితరులు పాల్గొని గర్భిణులకు ఆశీస్సులు అందజేశారు.

జీవ వైవిధ్య సంరక్షణలో 'పిచ్చుకలు' కీలకపాత్ర

- సహజ ఆహారపు గొలుసులను సంరక్షించాలి
- జీవ వైవిధ్య బోర్డు సభ్యులు చంద్రశేఖర్
- జేవీఆర్ కళాశాలలో

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

నవతెలంగాణ-సత్తుపల్లి



జీవ వైవిధ్య సంరక్షణలో పిచ్చుకలు కీలకపాత్ర పోషిస్తాయని, మానవుని ప్రమేయం వల్ల వాటి సహజ ఆవాసాలు తగ్గిపోయి కాలుష్యం పెరిగిపోవడంతో రైతు నేస్తంగా కొనియాడబడే పిచ్చుకల సంఖ్య రోజురోజుకి తగ్గిపోతోందని పర్యావరణవేత్త, గ్రీన్ వారియర్, జీవ వైవిధ్య బోర్డు సభ్యులు జేవీఎస్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ఎకోక్లబ్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. పిచ్చుకల ఉనికిని కాపాడుకుంటూ జీవ వైవిధ్యం, సహజ ఆహారపు గొలుసులను సంరక్షించడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయకుమార్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో ఉన్న బొటానికల్ గార్డెన్, ఫ్రూట్ గార్డెన్, వృక్షాలు పక్షులకు సహజ ఆవాసాలుగా మారాయన్నారు. వేసవిలో కళాశాల ఎకోక్లబ్ వలంటీర్లు, విద్యార్థులు చెట్లకు నీటి పాత్రలు ఏర్పాటు చేసి నీటిని నింపడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ దారా కృష్ణారావు, క్లబ్ అధ్యక్షుడు దొడ్డా కృష్ణయ్య ఎకోక్లబ్ కన్వీనర్ జి వీరన్న, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పానెం రామచంద్రరావు, రాంబాబు, పీర్ సాహెబ్, రవికుమార్, ప్రభావతి, మురళి, ఎకోక్లబ్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఖమ్మం బార్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

2024-25 సంవత్సరానికి జరుగుతున్న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నామినేషన్లు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. అధ్యక్ష పదవికి 3 నామినేషన్లు, ప్రధాన కార్యదర్శి పదవికి 2 నామినేషన్లు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి 2 నామినేషన్లు వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి, మహిళా ప్రతినిధి పదవికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు అయ్యాయి. అధ్యక్ష పదవికి చిలుకూరి స్వర్ణ కుమారి, నెరెళ్ల శ్రీనివాసరావు, కన్నెబోయిన నాగేశ్వర రావు, ఉపాధ్యక్ష పదవికి కె.ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పదవికి చింతనిప్పు వెంకటేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, జాయింట్ సెక్రటరీ పదవికి కండే వెంకటేశ్వరరావు, కోశాధికారి పదవికి ఎజ్జగాని శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి అలవాల యుగంధర్ రావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కళ్యాణి, మహిళా ప్రతినిధి పదవికి తన్నీరు లలిత నామినేషన్లు దాఖలు చేసారు. గురువారం నామినేషన్ల పరిశీలన సాయంత్రం 5 గంటలకు చెల్లుబాటు అయ్యే నామినేషన్ల ప్రకటన ఉంటుందని బార్ ఎన్నికల అధికారులు మారగాని శ్రీనివాసరావు, కూరపాటి శేఖర్ రాజు, రాయల పావెల్ తెలియ చేసారు.

బార్ అసోసియేషన్‌కు ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

నవతెలంగాణ-మధిర

మధిర బార్ అసోసియేషన్ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ బుధవారంతో ముగిసింది. ఈ ఎన్నికకు సంబంధించిన నామినేషన్లకు అధ్యక్ష , కోశాధికారి పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడం వల్ల అధ్యక్షులుగా బోజడ్ల పుల్లారావు, కోశాధికారిగా కాకాని విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చింతల గోపాల్ ప్రకటించారు .అదే విధంగా మిగిలిన ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి పదవులకు ఎన్నిక ప్రక్రియ కొనసాగుతుందని ఈ సందర్భంగా ఎన్నికల అధికారి తెలిపారు.



పార్లమెంటు ఎన్నికలకు పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా స్థానిక పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాలకు పాల్పడకుండా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని సూచించారు. అక్రమ నగదు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా ఆయుధాల లైసెన్స్ కలిగి ఉన్నవారు వెంటనే వాటిని స్థానిక పోలీసు స్టేషన్లలో డిపాజిట్ చేయాలని సూచించారు. గత ఎన్నికలలో నమోదు అయిన కేసులు, చార్జీషీట్ దాఖలు, తుది నివేదికను ఈ సందర్భంగా పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, ఏసీపీ అవినాష్ కుమార్ పాల్గొన్నారు.

మతోన్మాద ఫాసిస్ట్ విధానాలను పోషిస్తున్న మోడీ

పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి

నవతెలంగాణ-సత్తుపల్లి

దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మతోన్మాద ఫాసిస్ట్ విధానాలను ప్రధాని మోడీ పెంచి పోషిస్తున్నారని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ మాసోత్సవాల సందర్భంగా సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం మహిళా సదస్సు జరిగింది. ఈ సదస్సులో శిరోమణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రజల దృష్టిని మరల్చడానికి అయోధ్య రామాలయాన్ని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు గోకినపల్లి లలిత మాట్లాడుతూ మోడీ ఈ పదేండ్ల కాలంలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సంఘ మండల అధ్యక్షురాలు తాటి దేవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంఘ డివిజన్ కార్యదర్శి జే పరిమళ, మండల కార్యదర్శి వెంకటనర్సమ్మ, మండల నాయకురాళ్లు కోటమ్మ, దుర్గ, అలివేలు, వెంకటమ్మ, భద్రమ్మ, చెల్లమ్మ, బుల్లెమ్మ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తుపాకుల

నవతెలంగాణ-ముదిగొండ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులో తన నివాసంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం డిసిసిబి చైర్మన్ పదవి బిసికి కేటాయించాలని సిఎం రేవంత్ రెడ్డిని తుపాకుల యలగొండస్వామి కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గారపాటి రేణుకాచౌదరి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సూరంపల్లికి ఎంఎల్ఏ పరామర్శ

నవతెలంగాణ-కొణిజర్ల

కొణిజర్ల మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి రేణుక చౌదరి ముఖ్య అనుచరుడు సూరంపల్లి రామారావు ఇటీవల కత్తిపోట్లకు గురై హైదరాబాద్ ఎఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ బుధవారం ఎఐజీ ఆస్పత్రికి వెళ్లి సూరంపల్లిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | మార్చి 21, 2024 | www.navatelangana.com



వలస కూలీల ట్రాక్టర్ బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-చర్ల

మండలం పరిధిలోని దోసిల్లపల్లి మూలమలుపు వద్ద అదుపుతప్పి వలస కూలీల ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో 20 మందికి స్వల్ప గాయాలు, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చర్ల ప్రాథమిక వైద్యశాలకు క్షతగాత్రులను తరలించి అక్కడనుండి తీవ్రంగా గాయపడిన నలుగురిని ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. వీరంతా సరిహద్దు చత్తీస్‌గడ్ రాష్ట్రం చింతల్ నార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొత్తగూడ గ్రామానికి చెందిన వలస కూలీలు. ప్రమాదం జరిగిన సమయంలో సిఐ రాజు వర్మ ఆ ప్రాంతంలోనే విధులు నిర్వహిస్తుండగా ఘటన తెలుసుకుని హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలుపుతున్నారు.



మొక్కలు నరికించిన వాళ్లతోనే...

మొక్కలు నాటించిన గ్రీన్ భద్రాద్రి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గ్రీన్ భద్రాద్రి వారు నాటిన, పొగడ మొక్కలు వృక్షాలుగా ఎదిగినవాటిని, మూడు చెట్లను నరికించిన వ్యక్తితోనే కడియం నర్సరీ నుండి మూడు సంవత్సరాల వయుస్సు కలిగిన పది అడుగుల ఎత్తు ఉన్న మూడు మొక్కలను తెప్పించి గ్రీన్ భద్రాద్రి వారు నాటించారు. అంతే కాక త్వరలో గ్రామ పంచాయతి సెక్రెటరీచే అపరాద రుసుం కట్టిస్తామని, మొక్కలు నరికిన వారు ఎంతటివారైన విడిచిపెట్టేది లేదని తెలిపారు. మీ ఇంటి ముందు లేదా షాప్స్ ముందు ఉన్న మొక్కలను బ్రతికించటానికి మాకు సహకరించండి, ఆ మొక్కలు మికు భద్రాచలం ప్రజలకు చక్కటి ప్రాణ వాయువుని ఇస్తాయన్నారు. అలా కాక విచక్షణా రహితంగా మొక్కలు నరికితే ఖచ్చితంగా తగు చర్యలు తప్పవని గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు, కార్యదర్శి శ్రీరంగం సంపత్, గౌరవఅధ్యక్షులు హరితమిత్ర డాక్టర్ గొళ్ళ భూపతిరావు, బోనాల నాగ సూర్యనారాయణ, కామిశెట్టి కృష్ణార్జునరావు, స్థానిక షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సర బీఎస్సీ లైఫ్ సైన్స్ విద్యార్థులు బుధవారం వృక్షశాస్త్రం, జంతు శాస్త్ర విభాగాలు సంయుక్తంగా క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఈ క్షేత్ర పర్యటనలో భాగంగా చొప్పల గ్రామంలోని దేవర్లగుట్టపై ఉన్న వృక్ష వైవిధ్యమును, దామరవాయిలో ఉన్న మూడు వేల సంవత్సరాల క్రితం బృహత్సిలా యుగంలాటి సమాధులను, రామప్ప చెరువును సందర్శించారు. ఈ క్షేత్ర పర్యటన వల్ల పాఠ్య అంశాలపై పూర్తి అవగాహన ప్రత్యక్ష పొందారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. జాన్ మిల్టన్ ఇలాంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహనతో పాటు అదనంగా పాఠ్యాంశంపై విషయపరిజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు ఎస్. శ్యామ్ ప్రసాద్, డాక్టర్ ఎన్.నాగ సమీరా, జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఏ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వామపక్ష అభిమాని, అభ్యుదయ న్యాయవాది బొల్లేపలి లక్ష్మీనారాయణ

- ఐలూ జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్

నవతెలంగాణ-కొత్తగూడెం



బొల్లేపల్లి లక్ష్మీనారాయణ తన క్లయింట్లకు దేవుడు. యువ న్యాయవాదులకు మార్గదర్శి. ఆయన జీవితం యువ న్యాయవాదులకు స్ఫూర్తిదాయకం. ఆయన తన కుటుంబంలో మొదటి తరం న్యాయవాది, వామపక్ష అభిమాని, అభ్యుదయ న్యాయవాది బొల్లేపల్లి లక్ష్మీనారాయణ అని ఐలూ జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటి తరం న్యాయవాదులలో ఆయన ఒకరు. అతనికి మార్గదర్శకుడు లేడు. తనకు తానే మార్గదర్శి. యువ న్యాయవాదిగా కార్మికవర్గంతో కలిసి ఉండేవారు. తప్పుడు క్రిమినల్ కేసుల్లో ఇరికించి రాజ్యం వల్ల బాధితులుగా ఉన్న ప్రజల కోసం ప్రతిఫలం ఆశించకుండా పని చేసేవారు. బొల్లేపలి లక్ష్మీనారాయణ 92 సంవత్సరాల వయస్సులో మార్చి 7 వ తేదిన కొత్తగూడెం శ్రీనగర్ కాలనీలోని తన స్వగృహంలో కన్నుమూశారు. బొల్లేపల్లి లక్ష్మీనారాయణ మరణించినప్పటికి ఆయన పని పద్ధతులు, తార్కిక జ్ఞానంతో సమస్యలను అవగాహన చేసుకోవటం, ఆయన అధ్యయన శైలి, నోట్సు వ్రాసుకునే విధానం, పట్టుదల, గాంభీర్యం, నిర్భీతి, పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ప్రేమ, సమకాలికుల పట్ల స్నేహం, వృత్తిలో నిజాయితీ, వామపక్ష ఆలోచన, నేటి యువ న్యాయవాదులతో పాటు న్యాయవాదులందరికీ స్ఫూర్తి. ఆయన లాంటి స్వచ్ఛమైన జీవిత విధానం, తార్కిక ఆలోచన పద్ధతి అలవర్చుకోవటమే ఆయనకు మనమిచ్చే నివాళి అని పేర్కొన్నారు. గురువారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహిస్తున్న బొల్లేపల్లి లక్ష్మీనారాయణ సంస్మరణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

'అంగన్‌వాడీలో పౌష్టికాహారం'

నవతెలంగాణ-పినపాక



అంగన్‌వాడీల్లో పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందిస్తున్నామని పినపాక సెక్టార్ సూపర్వైజర్ సత్యవతి తెలియజేశారు. బుధవారం పినపాక మండలం బెస్తగూడెం అంగన్‌వాడీ పాఠశాలలో సామూహిక శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సత్యవతి మాట్లాడుతూ గర్భిణీలు తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని తెలియజేశారు. అంగన్‌వాడీల్లో అందజేసే గుడ్లు, పాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ అంగన్వాడీ టీచర్‌లు, గర్భిణీలు పాల్గొన్నారు.

స్వరాజ్ ట్రాక్టర్ షోరూం ప్రారంభం

నవతెలంగాణ-జూలూరుపాడు

కొత్తగూడెం విద్యానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్వరాజ్ ట్రాక్టర్ షోరూంను బుధవారం టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. రిబ్బన్ కటింగ్ అనంతరం షోరూం యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.



తునికాకు టెండర్లకు తక్షణమే పిలవాలి

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య**

నవతెలంగాణ-ములకలపల్లి



తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టి తక్షణమే టెండర్లకు పిలవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తునికాకు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఇతర పేదలకు రొండో పంటగా ఉంటుందని, ఇప్పటికే ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉంది. తునికాకు సేకరణ సీజన్ సమీపిస్తున్నా అటవీశాఖ అధికారులు టెండర్లు విషయంలో జాప్యం చేస్తున్నారన్నారు. పక్క రాష్ట్రాలలో టెండర్లు పూర్తయ్యాయని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తునికాకు ప్రూనింగ్ పనులు ప్రారంభించే విషయంలో నిర్లక్ష్యం వీడి వెంటనే టెండర్లు పిలిచి తునికాకు సేకరణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోతు రావూజ, వూకంటి రవికుమార్, గోగ్గల ఆదినారాయణ, పోడియం వెంకటేశ్వరరావు, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన

నవతెలంగాణ-పినపాక



పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరినీ కాంగ్రెస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం ఆధ్వర్యంలో పినపాక మండలంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు కుటుంబాలను ఆయన పరామర్శించి శుభకార్యాలలో పాల్గొన్నారు. ఏడూళ్ళ బయ్యారం క్రాస్‌రోడ్‌లో సీనియర్ నాయకులు పుట్టపర్తి త్రిమూర్తులు కుమార్తే గౌరి విజయభార్గవి ప్రథానం కార్యక్రమంలో పాల్గొని నూతన వధువుని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడుముల లక్ష్మీరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, లింగయ్య, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, శంకరయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు ఆనంద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి



- **మద్యం, నగదు తరలకుండా నిఘా పటిష్టం**
- **నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ వేణు**

నవతెలంగాణ-అశ్వారావుపేట

త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణకు ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను క్షేత్ర స్థాయిలో ఖచ్చితంగా అమలు చేయాలని నియోజక వర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ డీ.వేణుగోపాల్ తెలిపారు. విధుల పట్ల అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం వహించ వద్దు అని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే రాజకీయ పార్టీలు, నేతలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని, ముఖ్యంగా తాగునీరు, వికలాంగుల ర్యాంప్‌లు ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం వంటి సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అదేవిధంగా వికలాంగులు, 85 ఏళ్ళు దాటిన ఓటర్లకు ఇంటి నుండి ఓటు వేసే సౌకర్యం కల్పించినందున అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద కేటాయించిన సిబ్బంది విధులను తనిఖీ చేశారు. అక్రమ మద్యం, నగదు తరలింపుపై నిఘాను పటిష్టం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్‌లు, ఎంపీడీవోలు, సెక్టార్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాల బాధ్యులు పాల్గొన్నారు.



ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

- తహసీల్దార్ సూర్య నారాయణ

నవతెలంగాణ-పినపాక



మండలంలో ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేకంగా ఉంచామని పినపాక తహసీల్దార్ సూర్యనారాయణ తెలియజేశారు. బుధవారం ఆయన పినపాక తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో ఇసుక రవాణా చేసే ప్రాంతాలను పరిశీలించామని, అవసరమైన చోట ట్రంచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇసుక రాత్రి వేళల్లో అక్రమ రవాణా చేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు ఉంటాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా అక్రమ రవాణా అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్‌లను గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. మన ఊరు మన ఇసుక ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే గ్రామ పంచాయతీలకు సైతం లాభం వస్తుందని తెలిపారు.



ఉపాధి కార్మికులకు 200 రోజులు పని కల్పించాలి

- **వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు**

నవతెలంగాణ-బూర్గంపాడు



ఉపాధి కార్మికులకు 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సారపాక ప్రాంతంలో గల పుష్కరాల పార్కులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉపాధి హామీ పని చేస్తున్న కార్మికులకు సరైన సహకారం అందించట్లేదని విమర్శించారు. ఎంత పనిచేసిన కూలీ పడట్లేదని, ప్రభుత్వం నిర్ణయించిన 272 రూపాయలు కూడా ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో చార్జీలే 60 రూపాయలు పోతున్నాయని, వారికి ఫోనుమిగిలేది 60 రూపాయల నుండి 70 రూపాయలు తప్ప ఎక్కువ ఏమీ రావ ట్లేదని తెలిపారు. అదే కాకుండా కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఉపాధి పనిని పూర్తిగా రద్దు చేసే విధంగా వివరిస్తుందని బడ్జెట్లో నిధులు కేటాయించకుండా పనిని తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. పని భారాన్ని పెంచుతున్నారని చెప్పారు. అందుకు ఉపాధి కార్మికులకు 200 రోజులు పని కల్పించాలని, 600 రూపాయలు రోజుకు వేతనం చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిత్యవసర సరుకులు విపరీతంగా పెంచడం వల్ల సామాన్య ప్రజలు కొనుక్కొని తినే పరిస్థితి లేదని విమర్శించారు. అందుకు రానున్న కాలంలో ప్రజలపైన భారాలు మోపుతున్న ప్రభుత్వాన్ని గద్దెదించే విధంగా ప్రజలు, కార్మికులు ఉండాలన్నారు. ఆ రకమైన పోరాటానికి ఉద్యమానికి సహకరించాలని, ఉపాధి పనిని కాపాడుకోవడానికి ఉపాధి కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమంలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంజి నరసమ్మ, స్వర్ణ, సోధామని, పద్మ, శైలజ, గంజి ప్రభావతి, మరియమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ..

- పాల్గొన్న బూర్గంపాడు ప్రాజెక్టు సీడీపీఓ ప్రమీల

నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో గల రైతు వేదికలో బుధవారం మండలంలోని మూడు సెక్టార్ల పరిధిలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్టు సీడీపీఓ ప్రమీల పాల్గొని మాట్లాడారు. తల్లి బిడ్డలు, గర్భిణీలు ఆరోగ్యకరంగా ఉండాలంటే పౌష్టిక ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తొలుత గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసనలు చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు వివిధ రకాల పౌష్టిక ఆహారాలైన ఆకు కూరలు, పప్పు, కోడిగుడ్డు, పాలతో పాటు వివిధ రకాల పిండి వంటకాలైన పులిహోర, పాయసాలతో పాటు పొంగలి, సలివుడి ప్రదర్శనగా ఏర్పాటు చేసి అనంతరం వాటిని గర్భిణీలు, బాలింతలకు అందజేశారు. అదేవిధంగా కేంద్రాలలో టీచర్లు ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని పుష్టికరమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డలు సురక్షితంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ రేవతి, సూపర్ వైజర్లు రాజేశ్వరి, సక్కుబాయి, అంగన్వాడీ టీచర్లు, రెడ్డి అరుణ, హంస వేణి, వాసం రమాదేవి, సంద్ర విజయ, భారతి, అరుణ, సరోజిని, పుల్లమ్మ, దీప్తి, కళ్యాణి, శారద పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని అధిగమించడమే లక్ష్యం

- **వాసన్ ఎస్‌పీఓ అనీల్ ఉప్పలపాటి**

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం స్థిరమైన ఆహార వ్యవస్థలను రూపొందించడమే ఎస్ఎఫ్ఎస్‌హెచ్‌సీ (సస్టెయిన్ బుల్ ఫుడ్ సిస్టం ఫర్ హెల్తీ కమ్యూనిటీస్) లక్ష్యమని ప్రభుత్వేతర సేవా సంస్థ వాసన్ (వాటర్ షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్వర్క్) ఎస్‌పీఓ (పథకం రాష్ట్ర స్థాయి అధికారి) అనీల్ ఉప్పలపాటి తెలిపారు. బుధవారం మండలంలోని వినాయకపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాందాస్, డాక్టర్ దీపకొరెడ్డితో సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోప రహిత గ్రామాలు తయారు చేయడానికి వాసన్ సంస్థ చేస్తున్న ప్రయత్నం గురించి వివరిస్తూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందించడం, రసాయన రహిత ఆహార పంటలు, పెరటి తోటలలో కూరగాయలు, ఆకుకూరల సాగు, ఆహారం పట్ల ఉండే మూఢనమ్మకాల తొలగిస్తూ పోషకాహారం తీసుకునేలా అవగాహన సదస్సులు నిర్వహించడంలో వైద్యుల సహకారం, మద్దతు కోరినట్టు తెలిపారు. దానికి వైద్యాధికారులు స్పందిస్తూ సమాజహితం కోరే మంచి కార్యక్రమాలకు తమ మద్దతు ఎల్లప్పుడు ఖచ్చితంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు విజయవంతం చేయడానికి అవసరమైన సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పథకం కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, న్యూట్రిషనిస్ట్ శిరీషలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బూరుగుగూడెం గ్రామంలో ఉదయం 4:30 నిమిషాల సమయంలో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తుండగా ట్రాక్టర్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్టుగా సమాచారం రాగా ఆ ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకున్నామని తెలిపారు. అయ్యన్నపాలేం గ్రామానికి చెందిన దొడ్డపనేని శేషగిరిరావు ఇసుకను సీతాయిగూడెం గ్రామం వాగులో నుంచి రవాణా చేస్తున్నట్టు తెలిసిందని పోలీస్ సిబ్బంది ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలియజేశారు. మండల పరిధిలో ఎటువంటి ఇసుక అక్రమ రవాణా చేసిన పేకాట, కోడిపందాలు ఆడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

జెన్కో రాష్ట్రస్థాయి వాలీబాల్, టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-పాల్వంచ

కేటీపీఎస్ ఏడోదశ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తెలంగాణ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ వాలీబాల్, లాంగ్ టెన్నిస్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ బుధవారం పాల్వంచలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కేటీపీఎస్ ఏడవదశ, 5, 6 దశల చీఫ్ ఇంజనీర్స్ పీ.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా థర్మల్ హైడల్ స్టేషన్ నుండి 11 జట్లు పాల్గొన్నాయి. భూపాలపల్లి, పోచంపాడు, రామగుండం, విద్యుత్ సౌధా, జూరాల, పులిచింతల, బిటిపిఎస్ మణుగూరు, కేటీపిఎస్ ఎడవ దశ, కేటీపీఎస్ 5, 6 వ దశ జట్లు క్రీడల్లో పాల్గొన్నాయి. రెండు రోజుల పాటు జరిగే క్రీడలు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరగనున్నాయి. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్స్ మాట్లాడుతూ థర్మల్ హైడ్రిల్ స్టేషన్ నుండి పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రీడలను క్రీడాకారులు గెలుపు ఓటమిలను సమానంగా తీసుకుని పూర్తిగా క్రీడలను ఆడాలని సూచించారు. క్రీడాకారులు మంచి నైపుణ్యతను ప్రదర్శించి విజయం సాధించాలని కోరారు. అనంతరం 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన లాంగ్ టెన్నిస్ సైంతిటిక్ కోర్టుని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జెన్కో స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్ .లోహిత్ ఆనంద్, సివిల్ యుగపతి డిటి ఎస్ఎస్ఎస్. శేఖర్, గేమ్ సెక్రెటరీ వై. వెంకటేశ్వర్లు, టి. వీరస్వామి పాల్గొనగా రిఫరల్‌గా ఎం. వీరు నాయక్, జి. వెంకటేశ్వర్లు, కే. కాంతారావు వ్యవహరించనున్నారు.

మొదటిరోజు విజేతలు వీరే

వాలీబాల్‌లో కేటీపీఎస్ ఏడోదశ జట్టు వైటిపిఎస్ యాదాద్రిపై 25-10, 25-12 తో విజయం సాధించాయి. కేటీపీఎస్ 5, 6 దశ పోచంపాడు పై 25-10, 25-18 పాయింట్లు విజయం సాధించింది. బీటీపీఎస్ జట్టు జూరాల జట్టుపై 25-17, 25-19 తో విజయం పొందింది. కేటీపీఎస్ ఏడవ దశ పోచంపాడు పై 25-6, 25-10 తో విజయం సాధించింది. కేటీపీ జట్టు యాదాద్రిపై 25-10, 25-17.3 విజయం సాధించింది లాన్ టెన్నిస్‌లో కేటీపీఎస్ ఏడోదశ మొదటి స్థానం సాధించగా కేటీపీఎస్ 5, 6 దశలు రెండో స్థానంలో నిలిచింది. భూపాలపల్లి మూడో స్థానంలో నిలబడింది. డబుల్‌లో కేటీపీ జట్టు బీటీపీఎస్ పై 6-4 స్కోర్‌తో విజయం సాధించగా కేటీపీఎస్ 5, 6 దశలు పోచంపాడు పై 6- 2గెలిచింది. కేటీపీ జట్టు జూరాలపై 6-2 తో విజయం సాధించగా వైటీపీఎస్ జట్టు పొలిచింతలపై 6.3 తో విజయం సాధించింది.



22న పర్ణశాల వాహన పార్కింగ్, బోటు షికార్ వేలం పాటలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ నెల 22వ న ఉదయం 10 గంటల నుంచి పర్ణశాల గ్రామ పంచాయతీలో వాహన పార్కింగ్ ఆసీలు, బోటు షికారు ఫీజు వసూలు మరుగుదొడ్ల నిర్వాహణ కోసం బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలు పాల్గొనే పాట దారులు గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం చలనా కట్టి వేలం పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

జైలుకు రవీందర్ తరలింపు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఈనెల 15వ తేదీన ఆళ్ళపల్లి మండల పరిధిలోని రాయిపాడు గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో తుమ్మ రమేష్ వాసం రవీందర్ ఇరువురు కొట్టుకోవడంతో రమేష్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దాంతో రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈనెల 16వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విషయం విదితమే. దర్యాప్తులో రవీందర్ నేరం రుజువు కావడంతో వాసం రవీందర్‌ను అరెస్టు చేసి, ఇల్లందు కోర్టులో హాజరు పరిచి, అక్కడే ఉన్న సబ్ జైలులో పెట్టినట్టు ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నవతెలంగాణ
8
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | మార్చి 21, 2024 | www.navatelangana.com



మాదిగలను మోసగించిన బీజేపీని ఎన్నికలలో ఓడించాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

మాదిగలను మోసగించిన బీజేపీ పార్టీని పార్లమెంట్ ఎన్నికలలో ఓడించి బుద్ధి చెప్పాలని మాదిగ జేఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్య కర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగల జనాభా దామాషా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. మాదిగలకు 12 శాతం రిజ్వేషన్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హైదరబాద్‌లో జరిగిన మాదిగల సభలో వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చి కాలయాపన కోసం కమిటీని ఏర్పాటు చేయటం మోసగించటానికేనని అన్నారు. వారి ఎత్తుగడలను మాదిగలకు వివరించేందుకు ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ నెల 30వ తేదీన సంగారెడ్డిలో జరిగే సభను జయ ప్రదం చేయాలని కోరారు. బిజేపీ పార్టీని పార్లమెంట్ ఎన్నికలలో ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసి నాయకులు మోదుగు సుగుణరావు, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, దేవేందర్ పాల్గొన్నారు.

వాట్సాప్ సందేశంతో నగదు గోవిందా...!

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఒకరి బ్యాంకు ఖాతా నుంచి ఆన్‌లైన్ నేరగాళ్ళు నగదు కాజేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్‌హెచ్‌ఓ ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం..మండలంలోని అచ్యుతాపురంకు చెందిన కాంట్రాక్టర్ బొల్లేపల్లి విజయ సత్య రామరాజు వాట్సప్ నెంబర్‌కు ఈ నెల 13 వ తేదీన ఎస్బిఐ రివార్డ్ పేరుతో ఓ వెబ్ సైట్ లింకు వచ్చింది. ఈ లింకును అతను ఓపెన్ చేయగా సైబర్ నేరగాళ్లు మూడు విడతల్లో మొత్తం రూ.50 వేల నగదును డ్రా చేశారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు డ్రా చేసిన కొద్ది సేపటి తరువాత విజయ సత్య రామరాజు నంబరుకు మెసేజ్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన ఎస్బిఐ బ్రాంచ్ అధికారులు బాధితుడికి ఫోన్ చేసి మీ బ్యాంక్ ఖాతాను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి నగదు డ్రా చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై బుధవారం రాత్రి బాధితుడు లిఖిత పూర్వకంగా చేసిన ఫిర్యాదుతో సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాట్సప్ నంబర్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

భగత్ సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్

నవతెలంగాణ-కారేపల్లి



దేశకోసం బ్రిటీష్ ప్రాణాలర్పించిన భగత్‌సింగ్‌కు బీజేపీ ప్రభుత్వం ఎందుకు భారతరత్న ప్రకటించటం లేదని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింత రమేష్ ప్రశ్నించారు. బుధవారం కారేపల్లిలో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల సభలో చింతల రమేష్ పాల్గొని మాట్లాడుతూ మేము నిజమైన దేశభక్తులమని బీజేపీ భక్తులు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. బ్రిటీష్ పాలకులు దేశాన్ని విభజించి పాలించు రీతిలో పాలన సాగించారని, అదే రీతిలో బీజేపీ పాలన మతాల మధ్య చిచ్చు పెట్టి అదే దేశభక్తిగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన వీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. దేశంలో కుల, మత, పేద, ధనిక తారతమ్యాలు పోవాలంటే సోషలిజమే మార్గమన్నారు. భగత్‌సింగ్ ఆశయ స్ఫూర్తి తో డీవైఎఫ్ఐ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అంతకు ముందు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు దొంతు గణేష్, జోనెబోయిన నవీన్, వెంకటేష్, సందీప్, షేక్ నఫీర్, నీలం శ్రీరామ్, ఎన్నిశెట్టి ఉమేష్, పవన్, సచ్చుఉమా మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విలేకరులపై కేసు నమోదు

నవతెలంగాణ-కారేపల్లి

అక్రమంగా పాఠశాలలోకి ప్రవేశించి ఉపాధ్యాయుడిని బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు విలేకరులపై కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గణపారపు వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఖమ్మంకు చెందిన జీ.వెంకటేశ్వర్లు, జే.వెంకటేశ్వర్లు అనే ఇద్దరు వ్యక్తులు తాము విలేకరులమని చెప్పి పాఠశాలకు వచ్చారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, సెలవుల దరఖాస్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవి ఇవ్వకూడదని హెచ్‌ఎం వ్యవహరిస్తున్న గణపారపు వెంకటేశ్వర్లు చెప్పినా వినకుండా బలవంతగా హాజరు రిజిస్టర్‌ను, సెలవు చిటీలను తీసుకోని పోటోలు తీసుకోని వెళ్లారు. తనను బెదిరింపులకు గురిచేసి దౌర్జన్యం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుడు గణపారపు వెంకటేశ్వర్లు ఇచ్చిన పిర్యాదు మేరకు కారేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటగాళ్ల విద్యుత్ ఉచ్చులో కొండగొర్రె మృతి

-మాసం స్వాధీనం చేసుకున్న ఫారెస్టు

నవతెలంగాణ-కారేపల్లి

వేటగాళ్ల పెట్టిన విద్యుత్ వైర్ల ఉచ్చుకు కొండగొర్రె చిక్కి మృత్యువాడిన ఘటన కారేపల్లి మండలం చీమలపాడు అటవీ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. కారేపల్లి రేంజర్ సిద్దార్ధ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీమలపాడు సెక్షన్ పరిధిలో అడవి జంతువుల వేటగాళ్లు కొంత కాలంగా అడవి జంతులు సంచరించే ప్రాంతాలలో విద్యుత్ వైర్లు పరిచి వేట సాగిస్తున్నారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేటగాళ్లు మంగళవారం రాత్రి పెట్టిన విద్యుత్ వైర్ల ఉచ్చుకు అడవి కొండగొర్రె చిక్కి మృతి చెందింది. దానిని గ్రామానికి తీసుకవచ్చిన వేటగాళ్లు మాసం పోగులు వేస్తుండగా సంచారం అందుకున్న ఫారెస్టు అధికారులు దాడులు నిర్వహించి జైత్రాంతండాకు చెందిన పడిగ అంజి నుండి సుమారు 2 కేజీల కొండగొర్రె మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు వేటగాళ్లు పరారైనారు. సంఘటన స్థలంలో ఉన్న మాసం గిన్నెలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. దీనికి సంబంధించి నల్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కారేపల్లి మండలం పోలంపల్లికి చెందిన తేజావత్ రవికుమార్ కుటుంబానికి తొడితలగూడెం ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్ 50 కేజీలు, జర్నలిస్టు బోడ కళ్యాణ్ 50 కేజీలు బియ్యంను బుధవారం అందజేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ మర్సకట్ల రోషయ్య, పోలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్, గ్రామపెద్దలు దారావత్ భద్యానాయక్, వివిధ పార్టీల నాయకులు బానోత్ కోటి, గుగులోత్ హరు, భూక్యా రాంకిషోర్, మీనా, వీరన్న, లాల్‌సింగ్, దళ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన నేతలు

నవతెలంగాణ-కొత్తగూడెం



కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీమని, కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం కమ్మ సేవ సంఘం అధ్యక్షుడు బిక్కసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ సెక్రటరీలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలాశయాల్లో నీటి లభ్యత తగ్గుతున్నందున రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందు ముందు ఏ ఏ ప్రాంతాల్లో ఎంత మేర నీటి లభ్యత ఉంటుందో, ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ చేయాలన్నారు. బోర్ల మరమ్మత్తులు, ఫ్లషింగ్‌లు చేయాలని, ప్రయివేటు బావులు, నీటి వన రులు లీజుకు తీసుకోనుట చేయాలని అన్నారు. నీటి వనరులు ఉన్న గ్రామాల్లో సరిపోను ఉన్నది లేనిది చూడాలన్నారు. త్రాగునీటి సరఫరా విషయమై మంజూరు పనులు యుద్ధప్రా తిపదికన పూర్తి చేయాలన్నారు. బోర్ వెల్ ఆపరేటర్లు అనుమతి లేకుండా ప్రయివేటు బోర్లు వేస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొత్త బోర్ల మంజూరు విషయమై నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్ర స్థాయిలో గ్రామాలు తిరిగి తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలని సూచించారు. తాగునీటి ట్యాంక్ పరిశుభ్రత పూర్తి బాధ్యత పంచాయతీ సెక్రటరీలదే అని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించారు. జిల్లాలో 350 ఇంకుడు గుంతలు మంజూరు చేసినప్పటికి ఇప్పటివరకు పూర్తి కాకపోవడం పై అసహనము వ్యక్తం చేశారు. వారం రోజులలో అన్ని పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆమె ఎంపీడీఓలని ఆదేశించారు. త్రాగునీటి ఎద్దడి కల్గకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఇంచార్జ్ డీపీఓ సుధీర్ కుమార్, అన్ని మండలాల మిషన్ భగీరథ డీఈలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి వినతి పత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డీ.వీరన్న మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 12 మంది కాంట్రాక్టర్లు 10 మంది సూపరింటెండెంట్‌లు మారినప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపించారు. ప్రతినెలా 7వ తారీఖు లోపు జీతాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులు ఈ రాష్ట్రంలో 22 జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 7,500 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిపై దృష్టి పెట్టి అనేక సంస్థల్లో రెగ్యులరైజ్ చేస్తున్న వారిలాగనే మెడికల్‌లో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులను నిర్లక్ష్యం చేయడం సబబు కాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆది, సుగుణ, శివారెడ్డి, నవీన్, రాము, రవి, మణెమ్మ, నరసమ్మ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల చట్టం అమలు చేయాలి

ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాలుగా కనీస వేతనాల చట్టాలను షెడ్యూల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు అమలు చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, సీఐటీయూ పోరాట ఫలితంగా ఇప్పుడు కనీస వేతనాల చట్టాలను తీసుకొచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న వేతనం కంటే తగ్గించాలని ప్రయత్నం చేస్తుందని దీన్ని సీఐటీయూ పూర్తిగా వ్యతిరేకిస్తూ దాన్ని సవరించాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన క్యాంపియన్ సందర్భంగా సంతకాల .సేకరణ, వినతి పత్రాన్ని లేబర్ ఆఫీసర్‌కి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ ఈ జీవోలను వర్తింపచేయాలని, పెరిగిన ధరలు అనుగుణంగా కనీస వేతనాల చట్టాలని, కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆది, నరసమ్మ, శివారెడ్డి, మనెమ్మ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ సీడీపీఓ కనకదుర్గ డిప్యూటేషన్ రద్దు

నవతెలంగాణ ఎఫెక్ట్

- ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం బదిలీ

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచ సీడీపీఓ కనుకదుర్గ డిప్యూటేషన్ రద్దు చేసి తన సొంత ప్రాంతమైన ఖమ్మం జిల్లా తిరుమలయపాలెంకి పంపించినట్లు జిల్లా సంక్షేమాధికారి విజేత తెలిపారు. ఇటీవల నవతెలంగాణలో ఆమె అవినీతి అక్రమాలపై వరుస కథనాలు వెలవడంతో స్పందించిన జిల్లా సంక్షేమాధికారి విచారణ చేపట్టి నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించడంతో బుధవారం ఉన్నతాధికారులు కనకదుర్గ సీడీపీఓగా పాల్వంచ డిప్యూటేషన్ రద్దు చేస్తూ చర్యలు తీసుకున్నారు.

పాయం ఇలవేల్పు రణాసురుడి జాతరకు నేడు ఎమ్మెల్యే రాక

- అంగరంగ వైభవంగా సాగుతున్న కార్యక్రమాలు
- జాతరలో కొనసాగుతున్న వాలీబాల్ పోటీలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల పరిధిలోని నడిమిగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్న పాయం వంశీయుల ఇలవేల్పు రణాసురుడి జాతరకు గురువారం పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరుకానున్నారని స్థానిక పాయం వంశీయులైన రామనర్సయ్య, నర్సింహారావు, సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ జాతర 23వ తేదీ వరకు జరుగుతుందన్నారు. రణాసురుడు దైవాన్ని నమ్ముకున్న భక్తులకు కోరిన కోరికలు తీరుతాయని పాయం వంశీయుల దృఢమైన విశ్వాసమని వ్యాఖ్యానించారు. భక్తులందరూ ఆదిపరాశక్తి రణాసురుడుని దర్శించుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ మహా జాతరకు వచ్చి సావిత్రి, గాయిత్రి, సరస్వతి, భవాని, రణాసురుడు దైవాలను దర్శించుకొని మొక్కుకున్న భక్తులకు దీర్ఘకాలిక వ్యాధులు, సంతాన ప్రాప్తి, సర్వరోగ నివారణ, గ్రహశాంతి కలుగుతుందని పేర్కొన్నారు. ఆశించిన పనులు సైతం జరుగుతాయని తెలిపారు. జాతర ప్రారంభమైన మంగళవారం కర్ర దింపుట, దేవుడికి కుంకమ పూజలు, గుడి మేలుకొలుపు కార్యక్రమాలు కాగా, ఒకపొద్దు రణాసురుడు దేవరగుట్ట పై నుంచి బుధవారం మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 6 గంటలలోపు గర్భగుడికి రావడం జరిగిందన్నారు. వనదేవత దేవక గుట్ట పై నుంచి గురువారం మధ్యాహ్నం 2 గంటలకు గర్భగుడికి వస్తుందని, రాత్రి 12 గంటలకు గంగాస్నానం ఉంటుందని, శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు మండ మేలుగుట అనంతరం భక్తులు మొక్కులు చెల్లించే కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. చివరిరోజు శనివారం దేవుడు గుడి నుండి గుట్టకు వెళ్లడం జరుగుతుందని జాతర కార్యక్రమాలు తెలిపారు. ఈ జాతరకు తలపతులుగా పాయం బొర్రయ్య, పాయం పెద్ద పాపయ్య, సీతయ్య, క్రిష్ణ మూర్తి, బుచ్చయ్య, సత్యం, అంజిబాబు, కనకయ్యలు కాగా వడ్డెలుగా మలకం పాపారావు, డోలీ వాయిద్యాలు డిల్లీ రాములు, శివపు వడ్డెగా పాయం రామయ్య వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ మహా జాతర సందర్భంగా 8 మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆళ్ళపల్లితో పాటు గుండాల, కరకగూడెం, పినపాక, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి, తాడ్వాయి, మంగపేట ఉన్నాయి. ఎంట్రీ ఫీజు రూ.250 ఉంటుందని, పూర్తి సమాచారం కోసం 9398942753, 9440806120, 9490991359, 6300695054లను సంప్రదించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.18,116లు, రూ.10,116లు, రూ.5,116ల నగదు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ జాతర ఆలయ కమిటి సభ్యులుగా పాయం రాంబాబు, నాగేశ్వరరావు, రాజబాబు, సోమయ్య, పాపారావు, హనుమంతరావు, పాపయ్య, నాగయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులు

- వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి : నిమ్మల రాంబాబు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్



నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని, నకిలి విత్తనాలు అమ్మె వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని బంధ్రుగొండ గ్రామంలో వరి సాగు చేస్తున్న రైతులను కలిసి పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిలీ విత్తనాల వలన రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, వరి నాట్లు వేసి మూడు నెలలు దాటినా కనీసం 12 అంగుళాల ఎత్తు ఎదగలేదన్నారు. కొద్దిపాటి ఎత్తులోనే చిన్నచిన్న వరి కంకులు వేసి, కొంత భాగం కంకులు ఇంకా వేయకుండా ఉండటం వలన రైతులకు కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాకపోగా ఎకరానికి 20 నుండి 30 వేల రూపాయల నష్టం వాటిల్లుతున్నదని తెలిపారు. వ్యాపారుల స్వార్థం వలనే రైతులకు ఈ నష్టం జరుగుతున్నదని, రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఒక ఎకరానికి 30 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనియెడల ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా పార్టీ పాల్వంచ మండల కార్యదర్శి పూణెం రమేష్, రైతులు కంటే గోవర్ధన్, కంటే రాములు, నెల్లెల రమణయ్య, నిమ్మల కృష్ణ, నిమ్మల నాగేంద్రబాబు, కంటే వీరేష్, భద్రయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నిబద్ధత కలిగిన మహోన్నత వ్యక్తి బొల్లేపల్లి

నవతెలంగాణ-కొత్తగూడెం



చిన్నతనం నుండి క్రమశిక్షణతో మెలిగి, స్వాతంత్ర్య ఉద్యమ పటిమను అలవర్చుకొని, అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, నూతన నమాజం కోసం పరితపించే వ్యక్తిత్వం గలవాళ్లు అతి కొద్ది మందే ఉంటారు. అందులో ఒకరు బొల్లేపల్లి లక్ష్మీనారాయణ. అందరూ బొల్లేపల్లిగా పిలుస్తూ ఉండేవారు.

చలాకీతనం... చెరగని నవ్వు...ఆజానుబావుడు...స్నేహశీలి...ఎన్ని ఒడిదుకులు ఏర్పడినా కూడా చెరగని సాహసంతో తన నైజాన్ని చాటుకున్న వ్యక్తి కామ్రేడ్ బొల్లేపల్లి లక్ష్మీనారాయణ. బొల్లేపల్లి లక్ష్మీనారాయణ ఖమ్మం జిల్లా, వైరా మండలం అష్టగుర్తి గ్రామంలో రాఘవయ్య, కౌసల్య దంపతులకు 10మార్చి1932 న రైతు కుటుంబంలో జన్మించారు. అదే గ్రామంలో ప్రాథమిక విద్యనభ్యసించారు. 3వ తరగతి నుండి 10వ తగరతి వరకు నేటి ఆంధ్రప్రదేశ్ నందిగామలో, 12వ తగరతి వరకు ఆంధ్రప్రదేష్‌లోని ఎన్టీఆర్ జిల్లా ఏలూరులోని కట్టమంచి రామలింగా రెడ్డి కళాశాలలో, డిగ్రీ మచిలీపట్నంలో పూర్తి చేశారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు స్వాతంత్ర్య సమరయోధుడు అన్నె వెంకటేశ్వర్లు సోదరుడైన అన్నె నారాయణరావు, బొల్లేపల్లి ఇద్దరు రూమ్మెట్స్. కమ్యూనిస్టులపై నిర్బంధాలు అధికమవుతున్న కాలం అది. చంద్రుగొండ ప్రాంతంలో జరిగిన ఒక సంఘటలో గాయపడిన నల్లమల గిరిప్రసాద్‌ని, కొండపల్లి లక్ష్మీనర్సింహరావు (కెఎల్) తీసుకెళ్లి ఏలూరులో ఉన్న బొల్లేపల్లి రూమ్‌లో ఉంచుతారు. వైద్యులుగా ఉన్న కమ్యూనిస్టు నాయకుడు డాక్టర్ తిలాక్, డాక్టర్ వీరమాచినేని విమలదేవి వద్ద వైద్యం చేయించారు. అలా అనేక మంది కమ్యూనిస్టు నేతలకు, క్షతగాత్రులకు వైద్యం చేయించేవారు.ఆ కాలంలోనే వామపక్ష భావాలు కలిగిన వారితో పరిచయాలు పెరిగాయి. కమ్యూనిస్టు సిద్ధాంతానికి ఆకర్షితులయ్యారు. ఒకవైపు స్వాతంత్ర్య ఉద్యమాలు, మరో వైపు కమ్యూనిస్ట్ పార్టీ కార్యక్రమాలు కామ్రేడ్ బొల్లేపల్లి లక్ష్మీనారాయణపై తీవ్ర ప్రభావం చూపాయి.

ఏ కష్టం వచ్చినా... చట్టపరమైన ఏ చిక్కు వచ్చినా, ప్రభుత్వపరమైన నిర్బంధాలు ఎదురైనా, కమ్యునిస్ట్ కార్యకర్తలకు అండగా ఉండటం కోసం కమ్యూనిస్టు యోధుడైన చంద్ర రాజేశ్వరరావు సూచనతో న్యాయశాస్త్రాన్ని చదవడం కోసం వారణాసి వెళ్లి అక్కడ ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. లా పట్ట పుచ్చుకొని ఖమ్మం చేరుకున్నారు. ఆనాడు న్యాయవిభాగం చూస్తున్న కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతలు బొడెపూడి, కేఎల్ వద్ద నలహాలు, సూచనలు తీసుకుంటూ న్యాయవాద వృత్తిని సాగించారు. ఈ క్రమంలో టెనెన్సి కేసులు చూడడానికి ఖమ్మానికి కెవి. సుబ్బారావు, కొత్తగూడెంకు బొల్లేపల్లి లక్ష్మీనారాయణని కెఎల్ విజ్ఞప్తి మేరకు పంపారు. ఆనాడు ఎమ్మెల్యే కంగాల బుచ్చయ్య, కెఎల్. నర్సింహరావు, శీలం సత్యం (రాజన్న) టెనెన్సి యాక్ట్ వ్యతిరేకంగా పని చేసేవారు. కార్మిక హక్కులు కాపాడుట కోసం, సింగరేణి ప్రాంతమైన కొత్తగూడెంకు చేరుకొని టిబి.విఠల్‌తో కలిసి కార్మికుల పక్షాన నిలబడ్డారు. అటువంటి మహోన్నత వ్యక్తి అంచలంచలుగా వామపక్ష వాదిగా ఎర్రజెండా నీడలో పెరిగిన గొప్ప వ్యక్తి బొల్లేపల్లి.

కమ్యూనిస్టు పద్ధతులు అలవర్చుకున్న బొల్లేపల్లి లక్ష్మీనారాయణ న్యాయవాద వృత్తిని చేపట్టి నిరంతరం ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం కలిగి అనేక ఆటంకాల నడుమ ప్రభుత్వానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి మధ్య ఘర్షణలు జరుగుతున్న సమయంలో పార్టీ చీలిక వచ్చినప్పుడు సీపీఐ(ఎం) వైపు గట్టిగా నిలబడ్డారు బొల్లేపల్లి. ఎమర్జెన్సీ కాలంలో చుంచుపల్లి బైపాస్ రోడ్లో ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలోఉన్న గుడిసెలలో కమ్యూనిస్టు కార్యకర్తలకు ఆశ్రయం కల్పించిన ఆదర్శ కమ్యూనిస్ట్ ఆయన.

పెత్తందారుల ఆగడాలు ఎక్కువవుతున్న 50వ దశకంలో భూస్వాముల భూముల్లో కౌలుదారులుగా ఉన్న నిరుపేద గిరిజనులను భూమి నుండి భేదాఖలు చేయకుండా వారి భూమిని రక్షించడం కోసం బొల్లేపల్లి అవిశ్రాంతంగా పోరాడారు. పేద కౌలు రైతుల పక్షాన నిలబడి ఆనాటి ఇల్లందు ఎమ్మెల్యే కేయల్.నర్సింహారావు నాయకత్వంలో కౌల్దార్ల తరపున సుమారు 1200 టెనెన్సీ కేసులు ఉచితంగా వాదించి కౌలు రైతులకు పట్టాలు ఇప్పించిన ఘనత ప్రజా న్యాయవాది బొల్లేపల్లి గారికే దక్కుతుంది. రెండు దశాబ్దాల పాటు సీపియం నాయకులు, కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులకి ఒక్క పైసా తీసుకోకుండా వాదించిన నిస్వార్థజీవి బొల్లేపల్లి. తన గిరిజన, ఆదీవాసి క్లయింట్లు ప్రేమతో తీసుకువచ్చే చింత పండు, ఉసిరికాయలు, తేనె, కూరగాయలు తీసుకు వచ్చి బొల్లేపల్లి ఇచ్చి ఆనంద పడేవారు. నిరంతరం కమ్యూనిస్టు సాహిత్యాన్ని అభ్యుదయ కరమైన భావాలు కలిగిన పుస్తకాలను తెప్పించుకొనిమరీ అధ్యయనం చేసేవారు.

ప్రజాశక్తి పత్రిక నిరంతరం అధ్యయనంచేస్తూ కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న కార్యక్రమాలపై తోటి కామ్రేడ్స్‌తో చర్చించి వర్తమాన, భవిష్యత్తు రాజకీయాలు కార్యాచరణపై నిరంతరం అధ్యయనం చేసేవారు. ఏ ఒక్క రోజైనా ప్రజాశక్తి పత్రిక సమయానికి అందకపోతే తన గుమాస్తా (చివరివరకు బోల్లేపల్లీతో నడిచిన సత్యనారయణ రాజు) తో ప్రజాశక్తి కార్యాలయం నుండి పత్రిక తెప్పించుకొనిమరి చదివేవారు. అంటే ఏ రోజు వార్త ఆరోజే చదవాలి అనేవారు బొల్లేపల్లి.

బొల్లేపల్లి లక్ష్మీనారాయణ సుమారు 70 సంవత్సరాల పాటు తన న్యాయవాద వృత్తిని గౌరవప్రదంగా నిర్వహించిన వకీల్ సాబ్. బొల్లేపల్లి కోర్టుకు వస్తున్నారంటే తోటి న్యాయవాదులు, నేటి యువ లాయర్లకు క్రమశిక్షణతో ఎదిగిన నిలువెత్తు శిఖరంగా నడిచి వస్తున్నట్లు కనిపించే వారు. కోర్టులో బొల్లేపల్లి లక్ష్మీనారాయణ చేస్తున్న వాదనలు చూస్తుంటే న్యాయ మూర్తులకు సైతం అబ్బుర పరిచే విధంగా ఉండేవి. న్యాయం, సత్యం ఇంకా నిలబడి ఉన్నాయి అంటే ఇటువంటి వ్యక్తులు ఉండబట్టేనని, న్యాయం నాలుగు పాదాలపై బ్రతికే ఉందనేల అనిపించేదనీ భావించేవారు. అది కేవలం కమ్యూనిస్టు నిబద్ధత కలిగిన న్యాయవాదులకు మాత్రమే సాధ్యమని నిరూపించారు. జీవించినంత కాలం క్రమశిక్షణ, ముక్కుసూటిగా తత్వం, నమయ పాలన, ఇతరులకి ఆదర్శంగా నిలిచిన సుగుణాలు.... బొల్లేపల్లికి 92సంవత్సరాలు. వయసు పైబడిన కొద్దీ మనిషి శరీరంలో మార్పులు సహజంగా వస్తుంటాయి. కనుక బొల్లేపల్లి లక్ష్మీనారాయణ అనారోగ్యంతో గత కొంత కాలంగా చికిత్సలు పొందుతున్నారు. ఆరోగ్యం క్షీణించి కొత్తగూడెం, శ్రీనగర్ కాలనిలోని తన స్వగృహంలో మార్చి 7న తుదిశ్వాస విడిచారు. ....నిజాయితీకి నిలువుటద్దంగా ఉన్న బొల్లేపల్లి భౌతిరంగా లేనప్పటికీ ఆయన ఆదర్శాలు....క్రమశిక్షణ నిరంతరం మనందరికీ స్ఫూర్తిదాయకం.

వ్యాసకర్త..,
బీ.ఆర్.
9492312628

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | మార్చి 21, 2024 | www.navatelangana.com



డ్రయినేజీపై అక్రమ నిర్మాణం తొలగించిన పంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ -బూర్గంపాడు

నిబంధనలకు విరుద్ధంగా డ్రయినేజీపై అక్రమ నిర్మాణం చేపట్టగా పంచాయతీ అధికారులు బుధవారం ఆ నిర్మాణాన్ని తొలగించారు. సారపాకలోని గాంధీనగర్ లో ఓ ఇంటి వద్ద డ్రైనేజీపై అక్రమంగా నిర్మాణం చేపట్టడంతో కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో సారపాక గ్రామ పంచాయతీ ఈవో కంది మహేష్ వెంటనే స్పందించి పంచాయతీ సిబ్బందిని అక్కడకు పంపించి అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. పంచాయతీ పరిధిలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగాలకు వయస్సు నిబంధన సడలించాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణిలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలలో 45 సంవత్సరాలకు వయసు పెంచాలని సీపీఐ పట్టణ కార్యదర్శి విద్యార్థి జేఏసీ కన్వీనర్ దుర్గల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మణుగూరు సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు, కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 45 సంవత్సరాల వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కానీ సింగరేణిలో మాత్రం ఉద్యోగాల్లో నిరుద్యోగ యువతకు కేవలం 35 సంవత్సరాల వయసు నిబంధన ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అంతర్భాగమైనటువంటి సింగరేణిలో ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనమల రేవంత్ రెడ్డి దృష్టికి ప్రజా ప్రతినిధులు తీసుకెళ్లాలన్నారు.



అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ స్థలం పరిశీలన

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ వారు నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం కోసం స్థలాన్ని టాటా కంపెనీ రిప్రెసెంటేటివ్ బసవరాజు బృందం బుధవారం పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీఐలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేయడానికి కావలసిన వసతుల గురించిచర్చించారు. రోజురోజుకు పెరుగుతున్న ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు అందించాలని లక్ష్యంతో టాటా కంపెనీ తో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందుకు కావలసిన స్థలం పర్యవేక్షించారు. ఏజెన్సీ విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మణుగూరు ఐటిఐ ప్రిన్సిపాల్ బి ప్రభాకర్, ట్రైనింగ్ అధికారి జి.రవి, ఏటీఓలు ఎం.శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, నరసయ్య సిబ్బంది పాల్గొన్నారు.



మనిషి ప్రాణానికి ఆక్సిజన్.. ప్రజాస్వామ్యానికి ప్రాణం ఓటు

నవతెలంగాణ-మణుగూరు

మనిషి ప్రాణానికి ఆక్సిజన్ ఎంత ముఖ్యమో ప్రజాస్వామ్యానికి ఓటు కూడా అంతే ముఖ్యమని భద్రాచలం ఐటిడిఏ పిఓ పినపాక నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం ఓటుపై అవగాహన కలిగించేందుకు రెవెన్యూ మరియు పోలీస్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. మణుగూరు పట్టణంలో అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ నాయకులు విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, డీఎస్పి రవీందర్ రెడ్డి, అశ్వాపురం తాసిల్దార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం ముత్యాలమ్మ ఆలయ చైర్మన్‌గా అల్లాడి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ చైర్మన్‌గా అల్లాడి వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు శీరపు రమణా రెడ్డి, కొత్తూరి సీతారామరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 5న గ్రామస్థుల సమక్షంలో గత జాతరలో జరిగిన జమా ఖర్చులు, వివరాలు తెలుసుకోనుటకు గ్రామస్థుల సమక్షంలో ప్రస్తుత ఆలయ కమిటీ చైర్మన్ చుక్క గణేష్ రెడ్డిని వివరాలు అడుగగా, ఆయన నాకు సుమారు 15 రోజులు గడువు కోరగా, దాని దృష్ట్యా తదుపరి గ్రామ సభ బుధవారం ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో కూడా యధావిధి గానే జమ ఖర్చులు వివరాలు తెలియచేయలేదు. మరో మూడు రోజులు సమయం పడుతుందని, ఆరోజు స్టీరింగ్ కమిటీ వారికి వివరాలు తెలియచేస్తానని దాట వేసే ధోరణి చేశారు. అట్టి విషయంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభలు పాల్గొన్న మెజారిటీ సభ్యుల ప్రతిపాదన మేరకు కొత్త ఛైర్మన్ ఏర్పాటు చేయాలని కోరుతూ నినాదాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. ఆ సమయం లో గ్రామస్థులు స్టీరింగ్ కమిటీ సమక్షంలో కర్రీ, శివ కుమార్ లాల్ అల్లాడి, వెంకటేశ్వరరావుని ప్రతిపాధించగా, గ్రామస్తులు ఏకగ్రీవంగా అల్లాడి, వెంకటేశ్వరరావును ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ ఛైర్మన్‌గా ఎన్నిక చేసుకున్నారు. ఈ గ్రామ సభలో గ్రామస్థులు, పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు.

22న ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ సమావేశం

నవతెలంగాణ-ఖమ్మం

పట్టణంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 22న ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షురాలు మేదరమెట్ల స్వరూప రాణి, ప్రధాన కార్యదర్శి కానూరు హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు.

వలస ఆదివాసీ గ్రామాల్లో పౌష్టికాహారం అందించండి

- ఎర్రగుంటలో పర్యటించిన ఎంపీఓ

పినపాక : వలస ఆదివాసీ గ్రామాలలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంపీఓ వెంకటేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం మండలంలోని ఉప్పాక గ్రామపంచాయతీ ఎర్రగుంట వలస ఆదివాసీ గ్రామంలో స్థానిక సెక్రటరీ అరుణ శ్రీతో కలిసి పర్యటించి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. వలస ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అక్కడ గల అంగన్వాడీ పాఠశాలను సందర్శించి బాలింతలకు, గర్భిణీలకు పంచాయతీ ట్రాక్టర్ సహాయంతో బాలామృతం, పాలు, గుడ్లు తెప్పించి వారికి అందించారు. గ్రామానికి చాలా దూరంలో ఉంటూ వలస ఆదివాసులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. అక్కడ ఉన్న మూడు పంపులు సైతం పాడయిపోయి నిరూపయోగంగా ఉన్నాయని వారికి తాగునీరు అందించే ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. ఈ సమస్యపై అటవీ శాఖ అధికారులతో మాట్లాడతానన్నారు. అంగన్వాడీలో చదువుతున్న పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. గ్రామంలో వెంటనే బ్లీచింగ్ పనులు చేపట్టారు. ఇంతవరకు తమ గ్రామాలకు వచ్చిన అధికారి లేదని తమ సమస్యలు వినే నాథుడే లేడని వచ్చిన అధికారికి ఆదివాసీలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అంగన్వాడీ టీచర్ సత్యవతి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ముడివి రమేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒప్పందాన్ని అమలు చేయాల్సిందే..

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్
- రిలయన్స్ స్టోర్స్ హమాలీలు ధర్నా
- 7 లోపు సమస్య పరిష్కరిస్తాం : యాజమాన్యం
- పరిష్కరించుకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం

నవతెలంగాణ-పాల్వంచ

ఒప్పుకున్న ఒప్పందాన్ని రిలయన్స్ స్టోర్స్ యాజమాన్యం అమలు చేయాల్సిందేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక హమాలీలకే అన్ లోడింగ్ పనిని ఇస్తామన్న ఒప్పందాన్ని అమలు చేయాలని కుటుంబాలతో సహా రిలయన్స్ స్టోర్స్ ముందు ఆరు గంటల పాటు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ధర్నా నిర్వహించి వ్యాపార లావాదేవి లను అడ్డుకున్నారు. హమాలీల నిరసన ధర్నాకు మద్దతు ఇచ్చిన జిల్లా కాంగ్రెస్ నాయకులు, జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులు పూర్ణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాష్ ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు. పాల్వంచ పట్టణ ఎస్సై బి.రాము చొరవతో జరిపిన చర్చల్లో ఏప్రిల్ 7 లోగా సమస్య పరిష్కారానికి స్పష్టమైన రిలయన్స్ యాజమాన్యం హామీ ఇచ్చింది.

ఏప్రిల్ 7వ తేదీలోగా పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యం.వి.అప్పారావు, దొడ్డ రవి కుమార్ లు మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ నెలలో స్థానిక హమాలీలకే రిలయన్స్ లో అన్ లోడింగ్ పనిని అప్పగించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు పాల్వంచ పట్టణ కమిటీ ఆధ్వర్యం లో అన్ లోడింగ్ పనిని అడ్డుకున్న సందర్భం లో రిలయన్స్ యాజమాన్యం తరపున ముగ్గురితో కూడిన ప్రతినిధి బృందం సీఐటియు జిల్లా, స్థానిక హమాలీ నాయకత్వంతో చర్చలు జరిగాయని, ఈ చర్చలు నవంబర్, డిసెంబర్ నెలల్లో మూడు సార్లు చర్చలు జరిగాయని అన్నారు. ఈ చర్చల్లో స్థానిక హమాలులకే పని అప్పగిస్తామని, ఛాంబర్ ఆఫ్ కామర్స్ తో గతంలో జరిగిన హమాలీ ఒప్పందాలను అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఈ ఒప్పందం అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని గత మూడు నెలలుగా పదే, పదే వెంటపడుతున్నప్పటికి ఒప్పందం అమలు చేయకపోగా, దాట వేస్తున్నారని అన్నారు. ఒప్పందం అమలు కోసం ఈ నెల 7న అన్ లోడింగ్ పనిని అడ్డుకోగా నాలుగైదు రోజుల్లో పరిష్కారం చేస్తామన్న హామీ కూడా అమలు జరపలేదని అన్నారు. దీనితో చేసేది లేక మరోసారి కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో సహా వచ్చి మాల్ వ్యాపార లావా దేవీలను అడ్డుకున్నామని అన్నారు. రిలయన్స్ మాల్ లో షాప్ ఎంప్లాయిస్ తో చట్ట విరుద్ధంగా హమాలీ పనిని చేయిస్తూ, పని భారాన్ని పెంచుతున్నారని అన్నారు. పైగా మాల్ లో ఉన్న కార్మికులతో హమాలీల మీదకు రెచ్చగొట్టే తప్పుడు పద్ధతులకు కూడా దిగారని అన్నారు. ఇటువంటి రెచ్చగొట్టే చర్యలకు సహించేది లేదని హెచ్చరించారు.

ఉదయం 6 గంటల నుండి హమాలీ కార్మిక కుటుంబాలు చంటి పిల్లలతో సహా వచ్చి నిరసన తెలియ జేస్తున్న విషయం తెలిసి నిరసన దగ్గరకు వచ్చిన స్థానిక పోలీస్ రాము, రాఘవయ్య ల ప్రత్యేక చొరవ తో రిలయన్స్ యాజమాన్యంతో చర్చలు జరపగా, మార్చి ఆర్థిక సంవత్సరం ముగింపు హడావిడిలో ఉన్నందున ఏప్రిల్ మొదటి వారంలో హమాలీల సమస్య పరిష్కరిస్తామని





యాజమాన్యం ఇచ్చిన హామీతో తాత్కాలికంగా హమాలిలు ఆందోళన విరమించారు.

కార్మికులకు అండగా నిలబడతాం. : డీసీఎంఎస్ చైర్మ కొత్వాల శ్రీను.

గత ఒప్పందాన్ని అమలు చేయాలన్న కార్మికుల న్యాయమైన డిమాండ్ సాధనకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, భవిష్యత్ లో జరిగే పోరాటం లో పాల్గొంటామని కార్మికులకు కొత్వల శ్రీను హామీ ఇచ్చారు.

గత ఒప్పందాన్ని అమలు చేయకపోవడం వల్లే మళ్ళీ ఆందోళన : పూర్ణ జిల్లా నాయకులు.

రిలయన్స్ యాజమాన్యం ప్రతినిధులు సిఐటియు హమాలీ నాయకత్వం తో జరిగిన ఒప్పందాన్ని అమలుకి తప్పించుకునేందుకు చేసిన ఫలితమే మళ్ళీ కార్మికులు వారి కుటుంబ సభ్యులతో ఆందోళన కి సిద్ధపడ్డారు. ఇప్పటికైనా తక్షణమే రిలయన్స్ యాజమాన్యం గత ఒప్పందాన్ని అమలు చేయాలి.

హమాలీ కార్మికుల సమస్యను చర్చల పేరుతో కాలయాపన చేస్తే మార్కెట్ బంద్ కి పిలుపునిస్తాం. : చలవాది ప్రకాష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్

గత ఒప్పందాన్ని అమలు కోసం మూడు నెలలుగా కాలయాపన చేస్తున్న రిలయన్స్ యాజమాన్యం ఇదే పద్ధతి కొనసాగిస్తే కార్మికులకు మద్దతుగా మార్కెట్ బంద్ కి పిలుపు ఇస్తాం. పాల్వంచలో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా రిలయన్స్ యాజమాన్యం వ్యవహరిస్తున్నదని, ఇది ఏ మాత్రం సరైంది కాదు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు యం.వి.అప్పారావు, దొడ్డ రవి కుమార్, పట్టణ కన్వీనర్ కె.సత్య, ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు క్రాంతి, వి.వాని,అవాజ్ నాయకులు నిరంజన్,పట్నం నాయకులు తులసీరాం, హమాలీ యూనియన్ నాయకులు ఈర్ల గట్టయ్య, పాల్గొన్నారు.

చర్ల శభరి ఏరియా కమిటీ మావోయిస్టు లొంగుబాటు

నవతెలంగాణ-చర్ల

తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడయిన సరిహద్దు ఛత్తీస్‌గఢ్ చర్ల మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన మడివి బుద్ర తండ్రి కృష్ణ బీమా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, 141 బెటాలియన్ సిఆర్పిఎఫ్ అధికారులు సమక్షంలో బుధవారం లొంగిపోవడం జరిగిందని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ర 2010లో చర్ల- శబరి ఏరియా కమిటీలో చేరి 2015వ సంవత్సరం వరకు దళసభ్యునిగా పనిచేసినాడు. 2015వ సంవత్సరంలో ఏరియా కమిటీ సభ్యునిగా ప్రమోషన్ పొంది తెలంగాణ రాష్ట్ర మావోయిస్ట్ పార్టీ ప్రెస్ టీం బాధ్యతలను నిర్వహించినాడు. మావోయిస్టు పార్టీ కేంద్ర రాష్ట్ర కమిటీ సభ్యులైన హరిభూషణ్, బండి ప్రకాష్, దామోదర్ వంటి అగ్రనాయకుల దగ్గర పనిచేస్తూ మావోయిస్టు పార్టీకి సంబంధించిన విప్లవ సాహిత్యాన్ని, ప్రెస్ నోట్లను, కరపత్రాలను తయారుచేస్తుండేవాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చేపట్టిన "ఆపరేషన్ చేయూత" కార్యక్రమంలో భాగంగా దుమ్ముగూడెం పోలీసులు, 141 బెటాలియన్ సిఆర్పిఎఫ్ సిబ్బంది నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలకు ఆకర్షితుడై స్వచ్ఛందంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారులు ఎదుట బుధవారం లొంగిపోవడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరపున ఇతనిపై 04 లక్షల రివార్డు కలదు. మావోయిస్ట్ పార్టీ నాయకుల వేదింపులు భరించలేక చాలామంది లొంగిపోవడానికి సిద్ధంగా వున్నారు. జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్ నకు హాజరయిన కుటుంబసభ్యులు మావోయిస్ట్ పార్టీలో పనిచేస్తున్న వారిని బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే మడివి బుద్ర లొంగిపోవడం జరిగింది. నాయకులు యువనాయకులు అన్ని వీడి మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న దళనాయకులు, దళసభ్యులు గత కొంతకాలంగా పార్టీ విధానాలు, సిద్ధాంతాలు నచ్చక సాధారణ జీవితం గడపడానికి లొంగిపోతున్నారు. అదేవిధంగా ముఖ్యమైన నాయకులు, దళసభ్యులు అరెస్ట్ కావడం జరిగింది. వరుస లొంగుబాట్లు, అరెస్టులతో తెలంగాణలో మావోయిస్టు పార్టీ దిక్కుతోచని స్థితిలో అంతర్మదనంలో పడింది. అనేకమంది దళ సభ్యులు, దళ ముఖ్యంగా దళంలో పనిచేస్తున్న జనజీవన స్రవంతిలో కలవడానికి నిర్ణయించుకుంటున్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు వారి ఉనికి కాపాడుకోవడానికి చేస్తున్న చర్యలు, మావోయిస్టు పార్టీ వలన ఏజెన్సీ ప్రాంతానికి జరుగుతున్న నష్టం పట్ల విసుగుచెంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై మావోయిస్టు పార్టీని విడిచి బయటకు రావడానికి సముఖంగా ఉన్నారు. కానీ మావోయిస్టు అగ్ర నాయకులు లొంగిపోవాలని నిర్ణయించుకున్న దళసభ్యులను వేరే ప్రాంతాలకు బదిలీ చేయడం, దళం నుండి పారిపోయిన వారిని తిరిగి పట్టుకొని వేధించడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతూ తమ స్వార్ధ ప్రయోజనాల కోసం మావోయిస్టు పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసం అనేక ఆకృత్యాలకు పాల్పడుతున్నారు. గత కొంత కాలంగా నిషేధిత సిపిఐ మావోయిస్ట్ పార్టీ ఆదివాసి ప్రజలలో ఆదరణ,



నమ్మకం కోల్పోయి ఛత్తీస్ ఘడ్ ప్రాంతానికి మాత్రమే పరిమితమైనది, కాలం చెల్లిన సిద్ధాంతాలతో పాటుగా కమిటీలను ఏర్పాటు చేసి బలవంతపు వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తూ, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని అమాయకపు ఆదివాసీలను బయభ్రాంతులకు గురిచేస్తున్నారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే దళ సభ్యులు వారి కుటుంబ సభ్యుల ద్వారా గాని, స్వయంగా గాని తమ దగ్గరలో గల పోలీసు స్టేషన్లో లేదా జిల్లా ఉన్నతాధికారులను గానీ సంప్రదించగలరని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేస్తున్నారు. లొంగిపోయే దళ సభ్యులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరుపున అందవలసిన అన్నీ రకాల ప్రతిఫలాలను అందించడానికి యంత్రాంగం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి సాయి మనోహర్, దుమ్ముగూడెం సీఐ సంతోష్ సిఆర్పిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై పెట్టిన కేసు కొట్టివేత

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

ఖమ్మం పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు ఆకుతోట ఆదినారాయణతో పాటు మరో ముగ్గురిపై నమోదు అయిన కేసులో సరైన సాక్ష్యాలు లేనందున నిర్దోషులుగా విడుదల చేస్తూ ఖమ్మం మూడవ అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఖమ్మానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ మాటేటి కిరణ్ కుమార్ 2021 మార్చి 14న ఖమ్మం మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో జర్నలిస్టులపై ఫిర్యాదు చేయగా, జర్నలిస్టులపై సెక్షన్ 120(బి) 505(1) (బి)(సి)(2) ఐపిసి ప్రకారం కేసులు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి వార్షికోత్సవం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండల పరిధిలోని జానకీపురం గ్రామంలో గల సత్తెమ్మ తల్లి అష్టమి వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ గ్రామ ప్రజలు ఎంతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గల మహిళలు ఉదయం 8 గంటల నుండి బోనాలు ఎత్తుకొని మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామం అంత కలయ తిరిగి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంత భక్తులతో ఎంతో సందడిగా మారింది. వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి సుమారు 2000 మందికి అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ ఇమ్మడి వెంకటేశ్వరావు, నన్నక వెంకటరామారావు,మనికల సోమయ్య, నూనె వెంకటనారాయణ,సాయి స్మిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మెన్ పదవుల్లో మాలలకు అన్యాయం

- మాల మహానాడు మండల అధ్యక్షుడు పిల్లి రవి వర్మ

నవ తెలంగాణ -బూర్గంపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్ చైర్మెన్ పదవుల్లో మాలలకు, మాల ఉపకులాలకు అన్యాయం జరిగిందని జాతీయ మాల మహానాడు పినపాక నియోజకవర్గం ఇన్‌చార్జ్, బూర్గంపాడు మండల అధ్యక్షులు పిల్లి రవి వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ చైర్మెన్ పదవుల్లో మాల కులానికి ఒక్క చైర్మన్ పదవి కూడా లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. మాల కులానికి చెందిన ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, కాంగ్రెస్ లో మాల ఎమ్మెల్యేలు ఉండి కూడా ఒక్క కార్పొరేషన్ చైర్మన్ పదవి కూడా ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. సిఎం రేవంత్ రెడ్డి వాళ్ల కులాలకు అధిక సంఖ్య లో కార్పొరేషన్ చైర్మన్ కేటాయించారని, గత ప్రభుత్వంలో మాలలకు కొన్ని కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ మాలలను పూర్తిగా విస్మరించిందన్నారు. మాల ప్రజాప్రతినిధులు దీనిపై వెంటనే స్పందించి మాలలకు న్యాయం జరిగేలా పార్టీలో ఒత్తిడి తేవాలని ఆయన అన్నారు. లేదంటే రేపు జరగ బోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాలలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తుతారని ఆయన అన్నా రు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నాయకులకు సమాన ప్రాధాన్యత కల్పించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

23న పమ్మిలో చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో పమ్మి గ్రామంలో చెన్నకేశవస్వామి దేవాలయంలో ఈనెల 23 నుండి 25 వరకు దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నరహరి వెంకటాచార్యులు తెలిపారు. దేవాలయ బ్రహ్మోత్సవ వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. 23న ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుని చేయుట, సాయంత్రం అంకురార్పణం, ధ్వజా రోహణము 24న స్వామివారికి నవకలశస్నపనము, హరే నామ రామసంకీర్తన, ఆంజనేయస్వామికి ఆకు పూజ, సాయంత్రం చెన్నకేశవస్వామి వారి కళ్యాణం, 25న ఉదయం గ్రామ సేవ గరుడోత్సవం, సాయంత్రం పూర్ణహుతి, పవళింపు సేవ కార్యక్రమాలతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పమ్మిలో మూడు రోజులు పాటు జరిగే చెన్నకేశవస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు, ప్రజలు,మహిళలు,అధిక పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని పూజారి వెంకటాచార్యులు పేర్కొన్నారు.

పల్లెల్లో బెల్ట్ షాపుల దందా

- అధిక ధరలతో సిండికేట్ దోపిడీ..
- మామూళ్ల మత్తులో అధికారులు..!

నవతెలంగాణ- పాల్వంచ రూరల్

పట్టణాల్లో ఉన్న వైన్ షాపుల్లో దొరకని బ్రాండెడ్ లిక్కర్ బాటిల్ గల్లీలో ఉండే బెల్ట్ షాపుల్లో దొరుకుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. మద్యం మాఫియాలో చేరిన కొంతమంది కేటుగాళ్ల సిండికేట్ గా ఏర్పడి నిబంధనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా దోచుకుంటున్నారు. మండల పరిధిలోని ప్రతి పల్లెలో గల్లీ గల్లీకి బెల్ట్ షాపులు దర్శనమిస్తాయి. పాల్వంచ కేంద్రంగా కేటుగాళ్ల అంతా కలిసి అక్రమ సంపాదనే ధ్యేయంగా అధికారుల అండదండలతో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపులకు మద్యం బాటిళ్ల అమ్మే సిండికేట్‌లోనే ఒక్క పాటిల్ పైన 20 నుండి 30 రూపాయల వరకు అధికంగా అమ్ముతున్నారనేది బహిరంగ రహస్యం. అక్కడి నుండి తెచ్చిన బెల్టు షాపు నిర్వాహకులు 50 నుండి 60 రూపాయలు




ఒక్కో బాటిల్ పైన వసూలు చేస్తున్నారని మద్యం ప్రియులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు కల్తీ మద్యం కూడా విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో స్పిరిట్ కలిపి అక్రమంగా మద్యం తయారు చేస్తూ దొరికిన సంఘటనలు ఉన్నాయి. అక్రమ వైద్యం తయారీ కోసం మందు బాటిల్స్ మూతలు తీయడానికి కొంతమంది నైపుణ్యం కలవారిని ప్రత్యేకంగా జీతభత్యాలు ఇచ్చి పెట్టుకుంటారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజంతా కూలీ నాలి చేస్తే వచ్చేది 400 రూపాయలు అని, అందులో సాయంత్రం బెల్ట్ షాపుకు పోతే ఒక్క కోటరు 200 నుండి 250 రూపాయలు అక్కడే పోతున్నాయని మద్యం ప్రియుల బాధితుల మహిళలు అంటున్నారు. ఆ మద్యం తాగటం వల్ల వచ్చే రోగాలకు అప్పులు చేసి ఆసుపత్రి బిల్లులు కట్టవలసి వస్తుందని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని బాధితులు తెలిపారు. గల్లీ గల్లీకి మద్యం అందుబాటులో ఉండటం 15 సంవత్సరాల పిల్లలు కూడా మద్యానికి అలవాటు పడి జులాయిగా తిరుగుతున్నారని విమర్శలు ఉన్నాయి. దొంగతనాలు చేస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇంత జరుగుతున్నా మద్యం షాపులపై కొంత మేరకైన నియంత్రణ ఉంటే, గొడవలు తగ్గి, చాలామంది అనారోగ్యం పాలు కాకుండా చూడవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కేటుగాళ్ల కట్టిస్తారా, ప్రోత్సహిస్తారు చూడాలి.

కామేపల్లి సొసైటీ అధ్యక్షురాలిగా దొంగల వెంకట నరసమ్మ ఎంపిక

నవతెలంగాణ-కామేపల్లి

కామేపల్లి సహకార సొసైటీ అధ్యక్షురాలిగా దొంగల వెంకట నర్సమ్మను తాత్కాలికంగా లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఇటీవల కాలంలో ఆ సొసైటీ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో వైస్ చైర్మెన్‌కి అధ్యక్ష పదవిని అందజేశారు. వైస్ చైర్మెన్‌పై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో తాత్కాలికంగా బుధవారం సంబంధిత అధికారుల సమక్షంలో లాటరీ పద్ధతిలో వెంకట నరసమ్మను ఎంపిక చేశారు. ఈ నెల 22న అధ్యక్ష పదవి ఎన్నిక



నిర్వహించనున్నారు.



ధర చెల్లించని మిల్లులను సీజ్ చేయండి

- క్వింటా ధాన్యం రూ.2800కు కొనకపోతే చర్యలు
- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు
- మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులకు భరోసా
- అయినా పట్టించుకోని మిల్లర్లు

నవతెలంగాణ-వేములపల్లి

రైతులు మిల్లుకు తెచ్చిన ధాన్యం క్వింటాకు రూ.2800 చెల్లించకపోతే మిల్లులను సీజ్ చేయండని ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నల్లగొండ జిల్లా వేముపల్లి మండలంలోని శెట్టిపాలెం సమీపంలో మహర్షి రైస్ మిల్లు వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అదే సమయంలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని గూడూరు, వెంకటాద్రిపాలెంలో ఓ కార్యక్రమానికి వెళ్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి రైతుల ఆందోళనను గమనించి వాహనం ఆపి వారితో మాట్లాడారు. మిల్లులు సిండికేట్‌గా మారి ధర చెల్లించడం లేదని కొనుగోలు నిలిపివేశారని రైతులు తెలిపారు. క్వింటాకు రూ.1950 నుంచి 2000 వరకు మాత్రమే ధాన్యానికి ధర చెల్లిస్తున్నారని విన్నవించారు. దాంతో మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. వెంటనే జాయింట్ కలెక్టర్, డీఎస్ఓతో ఫోన్లో మాట్లాడారు. రైతులకు ధర చెల్లించని మిల్లులను వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. రైతులకు రూ.2000 ధర చెల్లిస్తే నష్టపోతారని, క్వింటా ధాన్యానికి రూ.2800 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే మిల్లర్లు ఎఫ్‌సీఐకి ధాన్యాన్ని అందించకుండా అక్రమంగా నిలువ ఉంచుకున్నారని, దీంతోపాటు ధాన్యం కొనుగోలు చేయని, కనీస ధర ఇవ్వని మిల్లులపై కేసు వేయండి అని అధికారులను ఆదేశించారు.

మంత్రి హెచ్చరికలు పట్టించుకోని మిల్లర్స్



రైతులకు రూ.2800 ధర చెల్లించాలని, అన్ని మిల్లులు ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి హెచ్చరించినప్పటికీ మిల్లర్లు పట్టించుకోలేదు. మహర్షి మిల్లు వద్ద రైతులు, అధికారులతో మంత్రి మాట్లాడి వెళ్లిన కొద్దిసేపట్లోనే మిల్లర్లు ధాన్యానికి రూ.2150 మాత్రమే చెల్లించారు. చేసేదేమీలేక రైతులు తక్కువ ధరకే తమ ధాన్యాన్ని అమ్ముకొని వెళ్లిపోయారు. అధికారులు మిల్లుల వద్ద పర్యవేక్షణ చేసి మంచి ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఫార్మాసిటీ ఉన్నట్టా? లేనట్టా?



గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఫార్మాసిటీ భవితవ్యం ముందు నుయ్యి... వెనుక గొయ్యిలా తయారైంది. కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీని రద్దు చేస్తామని చెప్పి... ఆ వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దాని స్థానంలో వికారాబాద్, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల్లో 10 ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అయితే ఎలాంటి కార్యచరణ ఇప్పటి వరకు మొదలు కాలేదు. ఫార్మా సిటీ ఉన్నట్టా? లేనట్టా? అనే అంశం అటు అధికారులకు గాని, ఇటు ఫార్మా రంగ నిపుణులకు గాని తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సస్పెన్స్‌కు సర్కార్ తెరదించకుంటే ఫార్మా పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలి పోయే అవకాశ ముందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

రద్దు... ఆ వెంటనే ఉపసంహరణ

- దానికి బదులుగా 10 ఫార్మా క్లస్టర్ల ప్రతిపాదన
- ఇంకా మొదలుకాని ఏర్పాటు ప్రక్రియ
- అప్రమత్తం కాకుంటే ఫార్మా కంపెనీలు తరలిపోయే ప్రమాదం
- అయోమయంలో టీఎస్ఐఐసీ అధికారులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఫార్మాసిటీ భవితవ్యం ముందు నుయ్యి... వెనుక గొయ్యిలా తయారైంది. కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీని రద్దు చేస్తామని చెప్పి... ఆ వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దాని స్థానంలో వికారాబాద్, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల్లో 10 ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అయితే ఎలాంటి కార్యచరణ ఇప్పటి వరకు మొదలు కాలేదు. ఫార్మా సిటీ ఉన్నట్టా? లేనట్టా? అనే అంశం అటు అధికారులకు గాని, ఇటు ఫార్మా రంగ నిపుణులకు గాని తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సస్పెన్స్‌కు సర్కార్ తెరదించకుంటే ఫార్మా పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలిపోయే అవకాశముందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

హైదరాబాద్ నగర శివార్లను ఆనుకుని రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల సరిహద్దులోని యాచారం, కడ్తాల్, కందుకూర్, మండలాల్లోని పది గ్రామాల పరిధిలో ప్రపంచంలోనే అతి పెద్ద ఫార్మాసిటీ కోసం 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు దశల్లో నిర్మించే ఈ మెగా ప్రాజెక్ట్ కోసం 18,333 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు దాదాపు 13 వేల ఎకరాల భూమిని తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఐఐసీ) సేకరించింది. మిగతా భూ సేకరణలో స్థానికుల సహాయ నిరాకరణ, కోర్టు కేసుల నేపథ్యంలో ముందుకు సాగలేదు. 20 ఏండ్ల వ్యవధిలో రూ.70వేల కోట్ల పెట్టుబడులు వస్తాయనీ, దాదాపు 5లక్షల 50వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని గత ప్రభుత్వం అంచనా వేసింది. ఫార్మా సిటీ పరిధిలో తమ కొత్త యూనిట్లను నెలకొల్పేందుకు 400 ఫార్మా కంపెనీలు ఇప్పటి వరకు దరఖాస్తులు పెట్టుకున్నాయి. తొలి దశలో 200 కంపెనీలకు స్థలం కేటాయించారు. అందులో కొన్ని కంపెనీలు నిర్మాణం కూడా మొదలు పెట్టాయి. అయితే ఇప్పటివరకు ఏ కంపెనీ ఉత్పత్తిని ప్రారంభించలేదు. ఈ లోపు 2023 ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీని రద్దు చేస్తామని ప్రకటించి, ఆ వెంటనే ఉపసంహరించుకుంది. ఇందుకు బదులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 10 ఫార్మా విలేజిలను ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించింది. ఫార్మా సిటీ స్థాయిలోనే ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పినా, ఇందుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి కార్యచరణ రూపుదాల్చ లేదు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో మెగా టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అటు టౌన్‌షిప్ ముందుకు సాగడంలేదు.... ఇటు ఫార్మా సిటీపై క్లారిటీ లేదు. దాంతో అసలు ఈ ప్రాజెక్ట్ ఉందా? లేదా? అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముందుకు కదలని క్లస్టర్ల ఏర్పాటు

ఫార్మా సిటీని రద్దు చేసి దానికి బదులు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో పది ఫార్మా విలేజీల ఏర్పాటుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించి భూ కేటాయింపులు ఇప్పటి వరకు జరగలేదు. ఫార్మా రంగ అభివృద్ధికి హైదరాబాద్ నగర పరిధిలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఫార్మా క్లస్టర్లను వెంటనే చేపట్టి వాటిని అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. ఫార్మా ఉత్పత్తులు, ఎగుమతుల్లో దేశంలోనే అత్యధిక వాటా ఉన్న తెలంగాణలో ప్రపంచ దిగ్గజ ఫార్మా కంపెనీలు తమ పెట్టుబడులను పెట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తగిన శ్రద్ధ, ప్రణాళికలు రూపొందించకపోతే ఇక్కడ ఉన్న ఫార్మా కంపెనీలు ఇతర రాష్ట్రాల వైపు దష్టి సారించే పరిస్థితి ఉత్పన్నమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఇందుకు సంబంధించి అనేక ఉదహారణలున్నాయి. ఒప్పందం అయిన కంపెనీలు సైతం తమ పెట్టుబడులను తమిళనాడు, కర్నాటక, గుజరాత్, మహారాష్ట్రకు తరలించాయి. ప్రభుత్వం ఫార్మా సిటీ విషయంలో ఓ స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించకుంటే గతం పునరావృతమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వసూలు చేయాలి .. ఢిల్లీకి పంపాలి



- ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రుల పనితీరు
- రైతులు అన్యాయమవుతున్నా పట్టించుకోవడం లేదు
- సమీక్ష పెట్టి రైతులకు నష్టపరిహారం ప్రకటించాలి : ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణాలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు అందినకాడికి వసూలు చేయడం.. ఢిల్లీకి పంపడమే వాళ్ల పనితీరుగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రెండు పర్యాయాలు సాగునీరు ఇచ్చి లక్షలాది ఎకరాలను కాపాడామన్నారు. ఆనాడు ఎస్ఎల్‌బీసీ, ఎడమకాల్వ చివరి భూములకు కూడా నీరందించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి పొలానికి కూడా నీరు అందని పరిస్థితి ఉందని, రైతులు కన్నీరు పెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే నీరు ఇచ్చి ఆదుకునేవారని చెప్పారు. పంటలు పండితే రైతులకు రూ.500 ఇవ్వాల్సి వస్తుందనే సాకుతోనే నీరు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, కనీసం జిల్లా మంత్రులకు కూడా సోయి లేకుండా పోయిందని ఆరోపించారు. మంత్రులకు ఇసుక దందా చేయడం, వసూలు చేయడం ఢిల్లీకి పంపడం మాత్రమే తెలుసని విమర్శించారు. ప్రభుత్వం మిల్లులతో కుమ్మక్కై రైతులకు ద్రోహం చేస్తోందని ఆరోపించారు. రైతులను ఆదుకునేందుకు వెంటనే జిల్లా స్థాయిలో వెంటనే సమీక్ష జరిపి నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా.. కనీసం రెండు తడులకైనా నీరు అందిస్తే పంటలు చేతికొచ్చేవని రైతులు కన్నీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మట్టపల్లి సైదులు యాదవ్, హాతీరాంనాయక్ తదితరులు ఉన్నారు.

వేల ఎకరాల్లో పంట నష్టం

- వడగండ్ల వాన బీభత్సం
- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి
- పలుచోట్ల నాయకుల పరిశీలన
- నేలకూలిన భారీ వృక్షాలు

మూడ్రోజులుగా కురుస్తున్న ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలు రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చాయి. ఇప్పటికే నీరు లేక పైర్లు ఎండిపోతుంటే.. వడగండ్లు పంటలను నేలపాలు చేశాయి. మరోవైపు అంతంత మాత్రంగానే ఉన్న మామిడి కాయలు కూడా రాలిపోయాయి. ఈ క్రమంలో తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. పలుచోట్ల బుధవారం నాయకులు పంటలను పరిశీలించి అన్నదాతలకు ధైర్యం చెప్పారు.



నవతెలంగాణ- దండేపల్లి/ బెజ్జంకి/ సిద్దిపేట/ నిజాంపేట

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో బుధవారం సాయంత్రం వర్షం పడింది. పిడుగుపాటుకు గురై ఇద్దరు రైతులకు చెందిన ఏడు మేకలు చనిపోగా.. వందల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మేదరిపేట, చింతపల్లి, తాళ్లపేట క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. భారీ గాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. మండల వ్యాప్తంగా సుమారు 190 మంది రైతులకు చెందిన 300 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్టు మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ అంచనా వేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షానికి రోడ్లపై భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. జన్నారం మండలం తిమ్మాపూర్‌లో వడగండ్ల వర్షంతో 15 ఎకరాల్లో జొన్న పంట దెబ్బతింది.

బెజ్జంకి మండలంలో వడగండ్ల బీభత్సం

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో వడగండ్ల వాన పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలకు అపార నష్టం వాటిల్లింది. చివరిదశలో ఉన్న వరి పంట నేలరాలింది. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పైర్లు నేలకొరిగాయి. రేగులపల్లి గ్రామంలో వడగళ్ల వానతో నష్టం వాటిల్లిన వరి పంటలను ఏట సంతోష్, కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. 6 ఎకరాల్లో వరిపంట సాగు చేశానని దేవిశెట్టి రేగులపల్లికి చెందిన రైతు ఆంజనేయులు అన్నారు. చివరి దశలో ఉన్న వరి పైరుకు వడగండ్లతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) నేతలు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో అకాల వర్షానికి నష్టపోయిన ఇండ్లను, ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జంగిటి కనకరాజు, ఎమ్మార్వో సలీమ్, మున్సిపల్ మాజీ చైర్మెన్ రాజనర్సు బుధవారం పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేశారు. సంగారెడ్డి జిల్లాలోనూ వడగండ్లతో రైతులు నష్టపోయారు.

నష్టపరిహారం అందేలా కృషి చేస్తా : ఎమ్మెల్యే రోహిత్ రావు

మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని జడ్చెరువు తండాలో వడగండ్ల వానకు వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని నష్టపోయామని తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును వేడుకున్నారు. పంటలను ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. రైతులకు పంట నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులతో నివేదికలు తెప్పించి ముఖ్యమంత్రి, మంత్రులకు పరిస్థితిని వివరించి ఆదుకుంటామన్నారు.

బతికేదెట్లా?



- ఏడెనిమిది నెలలుగా అందని జీతాలు
- దుర్భరంగా పంచాయతీ కార్మికుల బతుకులు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నాలుగైదు నెలల పెండింగ్
- కాంగ్రెస్ సర్కారు వచ్చినంకా అందని జీతాలు
- నేడు పంచాయతీరాజ్ కమిషనరేట్‌ను ముట్టడించనున్న జీపీ కార్మికులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇచ్చే జీతమే రూ.9,500. ఆపైన ఇద్దరి జీతాన్ని ముగ్గురు పంచుకోవడం. ఆ అరకొర జీతం చెల్లింపులోనూ తీవ్ర జాప్యం. ఒక జిల్లాలో మూడు నెలలు..మరో జిల్లాలో ఆరు నెలలు..ఇంకో జిల్లాలో ఎనిమిది నెలలు...అక్కడక్కడా 12 నెలల నుంచి జీతం అందని దౌర్భాగ్యం. చెత్త ఎత్తేటోళ్లు, మోరీలు తీసేటోళ్లు, చెప్పిందీ చేసి పడుండేటోళ్లు, వాళ్లేం చేస్తారులే అనుకున్నారో ఏమోగానీ పాలకులు వారిపట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణం. జీతం ఇగొస్తదేమో, అగొస్తదేమో అని కండ్లు కాయలు కాసేదాకా ఎదురుచూసిన పంచాయతీ కార్మికులు ఉద్యమబాట పడుతున్నారు. పెండింగ్ జీతాల విడుదల, మల్టీపర్పస్ విధానం రద్దు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీఓలకు, డీపీఓలకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలిచ్చినా పరిష్కారం కాకపోవడంతో పంచాయతీ కార్మికులంతా గురువారం నాడు హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌కు ముట్టడికి పిలుపునిచ్చారు. సమ్మెకాలంలో కాంగ్రెస్ నేతలు తమ వెన్నంటే ఉన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు కాబట్టి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు వేతనాల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా వేతన సమస్య ఉంది. 23 జిల్లాల్లో 6 నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు అందట్లేదు. 9 జిల్లాల్లో మూడు నుంచి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా ఇటీవల పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ, డీపీఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు, పోరాటాలు చేశారు. దీంతో ఉన్నతాధికారులు దిగొచ్చి ప్రస్తుతం మూడు నెలల జీతాలను విడుదల చేశారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలంలోని పంచాయతీల్లో ఎనిమిది నుంచి 12 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేతేపల్లి మండలంలోనూ 8 నెలలుగా జీతాల్లేవు. అదే జిల్లాలోని పెద్దవూర మండలంలో పెరిగిన వెయ్యి రూపాయల వేతనాన్ని ఇవ్వడం లేదు. అడిషనల్ కలెక్టర్ పెరిగిన వేతనాలు ఇవ్వాలని అధికారులకు చెప్పినా ఆచరణలో అమలు కావడం లేదు. ఇలా అన్ని జిల్లాల్లోనూ వేతనాల చెల్లింపు విషయంలో ఏదో ఒక సమస్య ఉంది. ఇదేంటని అడిగితే ఇష్టముంటే చేయండి లేకుంటే వెళ్లిపోండి అని అధికారులు హూంకరిస్తున్న పరిస్థితి నెలకొంది. కుటుంబం గడవక ఇండ్లల్లో గొడవలు జరిగి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో నలుగురు కార్మికులు పనిబంద్ పెట్టేశారు. నల్లగొండ జిల్లా వలిగొండ మండలంలోనూ జీతాలు రాక నలుగురు కార్మికులు విధులకు రావడం లేదు. ఏనాటికైనా తమ కొలువు పర్మినెంట్ అవుతుందనే ఆశతో వికారాబాద్ జిల్లాలో జీతం రాకున్నా ఓ కార్మికుడు పనిచేశాడు. శాలరీ రాకుండా ఎన్ని నెలలు గడుపుతావు? కుటుంబం పరిస్థితేంటి? అంటూ ఇంటి నుంచి ఆయన భార్య వెళ్లిపోయింది. ఇవి మనకు తెలిసిన కొన్ని ఉదహరణలు మాత్రమే. జీతాలు రాకుండా ఇబ్బందులు పడుతున్న వారు వేల సంఖ్యలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకుని వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మల్టీపర్పస్ విధానం ఎందుకొద్దంటున్నారంటే





బీఆర్ఎస్ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానంలో కార్మికులు పనిచేయాలనే నిబంధన తీసుకొచ్చింది. ఇది కార్మికులను పొట్టనబెట్టుకుంటున్నది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ సమయంలో చెరువులో దిగి పనిచేస్తుండగా ముగ్గురు కార్మికులు అందులో పడి చనిపోయారు. సంబంధం లేని పనిచేయటం వారిని కుటుంబానికి దూరం చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం చుక్కాలబోడు గ్రామానికి చెందిన భూక్యా వెంకటేశం అనే కార్మికునికి ఎలక్ట్రిషియన్ పనిరాదు. అధికారుల ఒత్తిడితో కరెంటు స్తంభం ఎక్కి పనిచేస్తుండగా విద్యుద్ఘాతంతో చనిపోయాడు. ఇప్పుడు ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడింది. సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన మహేందర్ అనే కార్మికుడు కూడా విద్యుద్ఘాతానికి గురై చేయి, కాలు కోల్పోయి ఏ పనీ చేయలేని పరిస్థితిలో ఉన్నాడు. నల్లగొండ జిల్లా మాడుగుల పల్లి మండలం కన్నెగల్లుకు చెందిన పంచాయతీ కార్మికుడు జి.నరేశ్ కూడా విద్యుద్ఘాతంతో చనిపోయాడు. ట్రాక్టర్ ప్రమాదాల్లోనూ పలువురు కార్మికులు చనిపోయారు. ఇలా ఎందరో కార్మికులు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. అధికారులు దారుణంగా వ్యవరిస్తూ కారోబార్లతోనూ మోరీలు తీయిస్తున్నారు. మెదక్ జిల్లా ఏడుపాయల జాతర సందర్భంగా జిల్లాలోని 21 మండలాల సిబ్బంది అక్కడ పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వారితో సంబంధం లేని పనులు చేయించి రోజుకు రూ.300 ఇచ్చి వెళ్లగొట్టారు. ఇలా సంబంధం లేని పనిచేయించడం, అధికారుల ఒత్తిడితో రాని పని చేసి ప్రాణాలు కోల్పోతుండటంతో పంచాయతీ కార్మికులు మూకుమ్మడిగా వీటిని వ్యతిరేకిస్తున్నారు.


11 నెలల నుంచి జీతం వస్తలేదు



వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నా. 11 నెలల నుంచి జీతమొస్తలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా బాధలు ఎవ్వరికీ చెప్పుకోలేకపోతున్నాం. పనిచేసేదానికంటే ఎక్కడికన్నా వెళ్లిపోవాలనిపిస్తున్నది. కానీ, ఎన్నటికైనా పర్మినెంట్ కాకపోతుందా? అన్న ఆశతోనే బాధలను ఓర్చుకుంట పనిచేస్తున్న. దయచేసి కాంగ్రెస్ ప్రభుత్వం దయతలచి వెంటనే వేతనాలు ఇప్పించాలి. మాతోని అన్ని పనులు చేయించుకోవడం సరిగాదు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయించాలి.

– నీలా ఆంజనేయులు, తేనేపల్లి గ్రామం, గుర్రంపోడు మండలం, నల్లగొండ జిల్లా

అప్పుసప్పులు చేసి సంసారం ఎల్లదీస్తున్నం



వచ్చేదే చాలీచాలని వేతనం. ఏడునెలల నుంచి ఇస్తలేరు. అప్పుసప్పులు చేసి సంసారం ఎళ్లదీస్తున్నం. సేవలు చేయించుకుంటూ జీతాలివ్వకపోవడంతో జీవితాలు బజారునపడ్డాయి. వెంటనే వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయించి ఆదుకోవాలి. అన్నిపనులు సక్కంగ రాకున్నా మల్టీపర్పస్ పేరుతో మాతో పని చేయిస్తున్నారు. మా మండలంలో జానయ్య అనే వ్యక్తి ఎలక్ట్రిషియన్ పనిచేసేవాడు. డ్రైవింగ్ సరిగా రాకున్నా అతనితో బలవంతంగా ట్రాక్టర్ నడిపించడం వల్ల బోల్తా పడి చనిపోయాడు. ఇయ్యాల ఆయన కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం ఎలాంటి సహాయసహకారాలు అందించలేదు. అందుకే ప్రమాదబీమా రూ.10 లక్షలు అమలు చేయాలని కోరుతున్నాం. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి. సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ చేయాలి.

– ఏదాకుల కోటయ్య, తుంగతుర్తి గ్రామం, కేతేపల్లి మండలం, నల్లగొండ జిల్లా

ఆర్ఆర్ఆర్ భూ బాధితుల ధర్నా

- రూ.7 లక్షలా 50 వేలకు గుంట భూమి రాదని ఆవేదన

నవతెలంగాణ- గజ్వేల్

రీజనల్ రింగ్ రోడ్‌లో భూములు పోతున్నాయని గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రైతులు ధర్నా చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం ముందు బైఠాయించారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.18 లక్షలు కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు లక్షల 50 వేల రూపాయలు మాత్రమే ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చ కోసం రైతులను రమ్మని చెప్పి.. ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గజ్వేల్ ఐఓసీ గేటు మూసేసి ధర్నా చేశారు. కోటిన్నర విలువ చేసే ఎకరా భూమికి రూ.7 లక్షలా 50 వేలు పరిహారం ఇస్తే బయట గుంట భూమి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రైతులతో చర్చించి.. ఆందోళనను విరమింపజేశారు.

ఎంపీ వద్దిరాజుకు రాజ్యసభ ఛైర్మెన్ శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రం నుంచి రాజ్యసభ ఎంపీగా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రకు ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధనఖర్ శుభాకాంక్షలు తెలిపారు. రెండోసారీ ఎన్నికైన తర్వాత వద్దిరాజు ధన్‌కర్‌ను బుధవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సభ్యుడిగా ప్రజలకు మరింత బాధ్యతతో సేవలందించాలని ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సూచించారు.

ఆహా.. ఏమి రుచి..



సీట్ కార్న్ ఎంతో ఆరోగ్యకరమైనది. ఇందులో ఎన్నో పోషకాలున్నాయి. ప్రొటీన్, మెగ్నీషియం, కాపర్, సెలీనియం, బీటా కెరోటిన్, లుటీన్, విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ డి వంటి పోషకాలు లభిస్తాయి. అదనంగా డైటరీ ఫైబర్ కూడా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. ఇన్ని పోషకాలున్న స్వీట్ కార్న్‌తో కొన్ని వెరైటీ వంటలను ఇప్పుడు తెలుసుకుందాం.

సూప్



కావలసిన పదార్థాలు : స్వీట్ కార్న్-ఒక కప్పు, ఉల్లి కాడలు-అర కప్పు, టమాటా సాస్-ఐదు చెంచాలు, దాల్చిన చెక్క-కొద్దిగా, జీలకర్ర - ఒక స్పూను, మిరియాలు- ఒక స్పూను, ఉల్లిపాయ తరుగు -అర కప్పు, టమాటా-ఒకటి, పచ్చి మిర్చి-నాలుగు, ఉప్పు, పంచదార- తగినంత, నీళ్లు - మూడు కప్పులు,

తయారీ విధానం : ముందుగా ఉల్లి పాయ, టమాటా, పచ్చిమిర్చి ముక్కలుగా తరిగి మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. అలానే శుభ్రంగా ఉన్న వస్త్రంలో దాల్చిన చెక్క, జీలకర్ర, మిరియాలు తీసుకొని మూటలా కట్టాలి. ఉల్లి ముద్ద, సుగంధ ద్రవ్యాల మూట, మొక్క జొన్నలను నీళ్లలో వేసి ఉడికిందాలి. కొద్దిసేపటికి ఉప్పు, ఉల్లి కాడలు, టమాటా సాస్ వేసి బాగా మరిగించాలి. సూప్ చిక్కగా అవుతుంది. అప్పుడు సుగంధ దినుసుల మూటను తీసేసి వేడివేడిగా తాగితే చాలా రుచిగా ఉంటుంది.

కార్న్ పాలక్ పకోడి



కావలసిన పదార్థాలు : పాలకూర - ఒక కప్పు, స్వీట్ కార్న్ గింజలు - ఒక కప్పు, శనగపిండి - రెండు కప్పులు, కారం - మూడు టీస్పూన్లు, అల్లం తరుగు - రెండు టీస్పూన్లు, జీలకర్ర పొడి - నాలుగు టీస్పూన్లు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - డీప్‌ఫ్రైకి తగినంత.

తయారీ: ముందుగా పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి గిన్నెలో వేయాలి. పాలకూర వేసిన గిన్నెలో నూనె తప్పించి మిగతా పదార్థాలు, రుచికి సరిపడా ఉప్పు, కొద్దిగా నీళ్లుపోసి పకోడి పిండిలా కలుపుకోవాలి. నూనె వేడెక్కిన తరువాత కలిపి పెట్టుకున్న పిండి మిశ్రమాన్ని పకోడీల్లా వేసుకుని గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి. వేడివేడిగా సర్వ్ చేసుకుంటే ఈ పకోడీలు చాలా రుచిగా ఉంటాయి.

పరోటా



కావలసిన పదార్థాలు : గోధుమపిండి - ఒక కప్పు, స్వీట్ కార్న్ - అరకప్పు, ఉప్పు - రుచికి సరిపడా, జీలకర్ర - ఒక స్పూను, ఇంగువ పొడి - చిటికెడు, ఉల్లి తరుగు - మూడు స్పూన్లు, పచ్చిమిర్చి తరుగు - అర స్పూను, అల్లం తరుగు - అర స్పూను, వెల్లుల్లి తరుగు - అర స్పూను, వాము - పావు స్పూను, కొత్తిమీర తరుగు - అర స్పూను, నూనె - వేయించడానికి సరిపడా.

తయారీ : గోధుమ పిండిని చపాతీ పిండిలా కలుపుకోండి, దాన్ని తడి బట్టలో చుట్టి ముప్పావు గంట సేపు పక్కన పెట్టండి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయండి. అందులో జీలకర్ర, ఉల్లి తరుగు, ఇంగువ పొడి వేసి వేయించండి. ఆ తర్వాత పచ్చిమిర్చి తరుగు, వెల్లుల్లి తరుగు, అల్లం తరుగు, వాము, కొత్తిమీర తరుగు, స్వీట్ కార్న్ వేసి బాగా కలపండి. అందులోని తడి ఇంకిపోయేదాకా చిన్న మంట మీద వేయించండి. ఇప్పుడు గోధుమ పిండిని ముద్దలుగా తీసుకొని పూరీల్లా ఒత్తుకోండి. స్వీట్ కార్న్ మిశ్ర మాన్ని మధ్యలో పెట్టి ఆ రొట్టెను మడిచి మళ్లీ రోల్ చేయండి. ఇవి మందంగా వస్తాయి. స్టవ్ మీద పెనం పెట్టి నూనె వేయాలి. ఒత్తిన పరోటాను వేసి రెండు వైపులా కాల్చుకోవాలి. అంతే టేస్టీ స్వీట్ కార్న్ పరోటా రెడీ అయినట్టే. ఇవి చాలా రుచిగా ఉంటాయి. దీనికి ఎలాంటి చట్నీలు అవసరం లేదు.

ఉప్మా




కావాల్సిన పదార్థాలు : ఒక కప్పు రవ్వ, ఒక కప్పు స్వీట్ కార్న్, రెండు టేబుల్ స్పూన్లు క్యాప్సికమ్ ముక్కలు, ఒక పచ్చిమిర్చి, ఒక రెమ్మ కరివేపాకు, ఒక టేబుల్ స్పూన్ అల్లం, అయిదు టేబుల్ స్పూన్లు నూనె, తాలింపుకు ఆవాలు, మినపప్పు, నాలుగైదు జీడిపప్పులు, మూడు కప్పుల నీళ్లు, రెండు టేబుల్‌స్పూన్ల కొత్తిమీర, రుచికి తగిన ఉప్పు.

తయారీ విధానం :

మొదటగా రవ్వను డ్రై రోస్ట్ చేసి పెట్టుకోవాలి. అలాగే స్వీట్ కార్న్ ఉడికించి సిద్ధంగా పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక బాండీలో నూనె లేదా నెయ్యి వేసి, వేడి చేసి జీడిపప్పు, శనగపప్పు, ఆవాలు వేసి వేయించాలి. ఆ తర్వాత కరివేపాకు, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు, అల్లం తురుము వేసి వేయించాలి. ఇప్పుడు అందులో స్వీట్ కార్న్, అలాగే ఉప్పు వేసి 2-3 నిమిషాలు వేయించాలి. మరొక బాండీలో రెండు కప్పుల గోరువెచ్చని నీళ్లు పోసి రవ్వ వేయాలి. రవ్వ ఉడుకుతుండగా మొదట చేసిన మిశ్రమాన్ని వేసి ముద్దలుగా కాకుండా బాగా కలపాలి.

ఉప్మా దగ్గరకు వచ్చినపుడు కొద్దిగా కొత్తిమీర కలపండి, స్టవ్ ఆఫ్ చేయండి. అంతే వేడి వేడి స్వీట్ కార్న్ ఉప్మా రెడీ...

పాయసం



కావాల్సిన పదార్థాలు: స్వీట్ కార్న్ - ఒక కప్పు ఒలిచిన గింజలు, పాలు - రెండు కప్పులు, నెయ్యి - మూడు టేబుల్ స్పూన్లు, పంచదార - అరకప్పు, యాలుకల పొడి - అర టీస్పూను, పిస్తా, కిస్ మిస్, జీడిపప్పు, బాదం పప్పు - అన్నీ కలిపి అరకప్పు.

తయారు చేసే విధానం : కార్న్‌ను మిక్సీలో వేసి ముద్దగా చేసుకోవాలి. కార్న్ ముద్దని ఒక బౌల్‌లో వేసి అందులో కొద్దిగా పాలు పోసి ముద్దగా చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నెయ్యి వేసి అందులో ఈ కార్న్ పాలు మిశ్రమాన్ని వేయించాలి. ఆ తర్వాత మరో కప్పు పాలు పోసి కలిపి చిన్న మంట మీదే 8 నిమిషాల పాటు ఉడికించాలి. అడుగంటకుండా చూసుకోవాలి. ఇప్పుడు పంచదార వేసి కలపాలి. కొద్ది సేపు మరిగిన తర్వాత యాలకుల పొడి వేయాలి. దించే ముందు బాదం, జీడిపప్పు, కిస్ మిస్, పిస్తా చల్లాలి. స్టవ్ ఆపేయాలి. అంతే స్వీట్ కార్న్ పాయసం సిద్ధమైనట్టే.

వేసవిలో జుట్టు సంరక్షణ..



వేసవి కాలంలో జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. ఎండ వేడి నేరుగా తలకు తగలడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. దీంతో చుండ్రు సమస్య అధికమవుతుంది. సాధారణంగా మన జుట్టు తలను ఇన్సులేట్‌గా, వెచ్చగా ఉంచడానికి సహాయపడుతుంది. ఈ ప్రక్రియ శీతాకాలంలో మన ఆరోగ్యానికి తోడ్పడుతుంది, అయితే ఇది హాట్ సమ్మర్‌లో సమస్యలకు కారణమవుతుంది. ఎండాకాలం స్కాల్ప్‌లో ఈ ఇన్సులేషన్ కారణంగా, జుట్టు రాలే సమస్య ఎక్కువవుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, చెమట కారణంగానూ జుట్టు జిడ్డుగా మారడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ సీజన్ కొన్ని టిప్స్ ఫాలో అయితే.. జట్టును సంరక్షించుకోవచ్చు.

- బయటకు వెళ్లేప్పుడు, జుట్టును స్కార్ఫ్ లేదా క్యాప్‌తో కవర్ చేసుకోవాలి.
- కొంతమంది ఎండ వేడి తట్టుకోలేక, రోజూ తలస్నానం చేస్తూ ఉంటారు. దీనివల్ల జుట్టులోని తేమ, నూనె తొలగిపోయి జుట్టు నిర్జీవంగా తయారవుతుంది. కాబట్టి వీలైనంత వరకు తక్కువసార్లు తలస్నానం చేయాలి.
- జుట్టు కుదుళ్లు బలంగా తయారయ్యేందుకు గోరువెచ్చని నూనెతో మర్దన చేయాలి.
- సాధారణంగా పొడవాటి జుట్టు ఉన్నవారికి వేసవి వేడి వాతావరణంలో జుట్టుపై శ్రద్ధ పెట్టడం పెద్ద సమస్య. కాబట్టి పొడవు జుట్టు ఉన్న వారు జుట్టు రాలకుండా, చిట్లకుండా ఉండేలా పైకి టై చేసుకోవాలి.
- ఈత కొలనుల్లో స్నానాలు చేసినప్పుడు జుట్టు పొడిబారుతుంది. బలహీనంగా, పెళుసుగా మారుతుంది. కాబట్టి అటువంటిచోట స్నానం చేసిన తరువాత మంచి నీళ్లతో మరోసారి తలస్నానం చేయాలి.
- వేడినీటి స్నానం శరీరానికే కాదు, జుట్టుకు కూడా మంచిదే. అయితే వేడినీటి స్నానం తరువాత చివరగా జుట్టును చల్లటి నీటితో కడగాలి. ఇలా చేస్తే, జుట్టుకు బలం పెరిగి మెరుపుగా తయారవుతుంది.
- సన్‌స్క్రీన్ లోషన్ రాసుకున్నప్పుడు రాత్రి పడుకోబోయే ముందు తలస్నానం చేయాలి. అలా సాధ్యం కానప్పుడు ఆ లోషన్లకు బదులు కొబ్బరినూనెతో మర్దనా చేయాలి.
- వేసవికాలంలో జుట్టుకు నిమ్మరసం వాడినట్లయితే మరింత నిర్జీవంగా మారొచ్చు. కాబట్టి కాఫీ డికాషన్ లాంటి కండిషనర్లను వాడటం మంచిది.

రాష్ట్ర గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటి వరకు రాష్ట్రానికి ముగ్గురు గవర్నర్లుగా నియమితులయ్యారు. వీరందరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనార్హం. 2014 నుంచి 2019 సెప్టెంబరు 7 వరకు ఈఎస్ఎల్ నరసింహన్ మొదటి గవర్నర్‌గా పని చేశారు. పదేండ్ల తెలంగాణ చరిత్రలో ఐదేండ్లకు పైగా నరసింహన్ సేవలందించారు. ఆయన తర్వాత 2019 సెప్టెంబరు 8 నుంచి సోమవారం వరకు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఝార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాధాకృష్ణన్‌కు కేంద్రం తెలంగాణ అదనపు బాధ్యతలను అప్పగించింది. రాష్ట్రంతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

రెండు సార్లు ఎంపీగా ఎన్నిక

తమిళనాడులోని తిరుప్పూరులో 1957 మే 4న జన్మించిన రాధాకృష్ణన్ రాజకీయ జీవితం బీజేపీ నుంచి ప్రారంభమైంది. కోయంబత్తూర్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన 1998, 1999లో రెండు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2004, 2014,2019 ఎన్నికల్లో ఆదే స్థానం నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనతంరం తమిళనాడు పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులయ్యారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డు చైర్మెన్‌గా విధులు నిర్వహించారు. 2023 ఫిబ్రవరి 18 నుంచి జార్ఖండ్ గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు.

పిచ్చుకల్ని రక్షించుకోవాలి

- పిచ్చుకల దినోత్సవంలో ఎంసీ పర్గెయిన్
- కేబీఆర్ త్రూ లెన్స్ ఐస్, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ సమతుల్యత కోసం పిచ్చుకల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వన్యప్రాణి), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎంసీ పర్గెయిన్ అన్నారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. చిత్రలేఖనం, డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కేబీఆర్ పార్కు 25వ వార్షికోత్సవం సందర్భంగా 'కేబీఆర్ త్రూ లెన్స్ ఐస్' కార్యక్రమం ద్వారా పార్కులోని విభిన్న వృక్ష, జంతుజాలాలను తమ కెమెరాల్లో ఫొటోగ్రాఫర్లు బంధించారు. మొక్కలు, జంతువులు, ప్రకృతి, వ్యక్తులు అనే నాలుగు కేటగిరీల్లో తమ ఎంట్రీలను అందజేశారు. అందులో విజేతలకు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ అటవీ సంరక్షణాధికారి శివాని డోగ్రా, డెక్కన్ పక్షుల సంస్థ నిర్వాహకులు సురేఖ, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీకి కడెం ప్రాజెక్టు

(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడంతో వేలాది ఎకరాలు బీళ్లుగా మారాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.96టీఎంసీ(శతకోటి ఘనపుటడుగులు)లు మాత్రమే నీరు నిల్వ ఉండటంతో కాల్వల ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి ఈ దుస్థితిని చూడాల్సి వచ్చిందని అన్నదాతలు వాపోతున్నారు. ఆ ప్రాంతాన్ని నవతెలంగాణ సందర్శించినప్పుడు రైతుల బాధలు వర్ణనాతీతం. ఈ ప్రాజెక్టు ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఉంది. ఇక్కడ నుంచి గతంలో ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ గెలిచినా ప్రాజెక్టు అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. వరద వచ్చినప్పుడల్లా టెక్నికల్ అధికారులు కేంద్రం నుంచి వచ్చి ప్రాజెక్టును చూసి పోతున్నారు తప్ప ..నిధుల కేటాయింపు శూన్యమే.

నిర్మల్ జిల్లాలోని ఈ ప్రాజెక్టు ప్రకృతి అందాలకే పరిమితం కాకుండా.. అన్నదాతలకు కల్పతరువు. 1955 ఏడాదిలో 7.60టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు అన్నదాతలకు వర ప్రదాయనిగా మారింది. ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద 68,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ప్రతి ఏటా ఖరీఫ్‌లో సుమారు 50వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తుంటారు. రబీ సీజన్‌లో 35వేల ఎకరాల్లో పంటలకు నీరందిస్తుంది. కానీ గత వర్షాకాలంలో సంభవించిన వరదల కారణంగా ప్రాజెక్టు పరిస్థితి ఒక్కసారిగా ఆందోళనకరంగా మారింది. అధిక వర్షాల కారణంగా ఏకంగా 60టీఎంసీల నీరు ఈ ప్రాజెక్టులోకి పోటెత్తడంతో గేట్లు తట్టుకోలేకపోయాయి. పాత గేట్లు కావడంతో తెరుచుకోలేకపోవడం..రూప్ తాడు తెగిపోయి కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోయాయి. మరో రెండు మూడుగేట్లు తెరుచుకోలేదు. ఒకవైపు వరద పోటెత్తడం..మరోవైపు గేట్లు మొరాయించడంతో ప్రాజెక్టు మనుగడపై భయాందోళన రేకెత్తించింది. పరిసర గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇరిగేషన్ అధికారులు ఏకంగా 50టీఎంసీల నీటిని కిందకు వదిలిపెట్టారు. గేట్లు తెరుచుకోకపోవడం..మరమ్మతులు చేయించని కారణంగా ప్రాజెక్టులో నీరంతా కిందకు వెళ్లిపోయింది. ఫలితంగా డెడ్ స్టోరేజీకి వెళ్లిపోయింది. దీనిని పరిశీలించేందుకు కేంద్రం నుంచి టెక్నికల్ టీమ్ కూడా వచ్చింది. ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమైనాయి.

బీళ్లుగా మారిన పొలాలు

ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 7.60టీఎంసీలు కాగా.. ఖరీఫ్ పంటలకు సాగునీరందించగా.. ప్రతి ఏటా రబీ సాగు కోసం 4టీఎంసీల నీటిని నిల్వ చేస్తుంటారు. ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద కుడి, ఎడమ కాల్వల ద్వారా యాసంగి సీజన్‌లో వరి, మెట్ట పంటలు సుమారు 35వేల ఎకరాలకు సాగునీరందిస్తారు. కానీ వరద నీరంతా కిందకు వెళ్లిపోవడంతో ప్రస్తుతం 2.96టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. ఈ నీటితో రబీ పంటలకు సాగునీరందించడం సాధ్యమయ్యే పరిస్థితి లేకపోవడంతో అధికారులు తాజాగా క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో ఈ ఏడాది రబీలో 35వేల ఎకరాలు బీళ్లుగా మారాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి ఇలాంటి పరిస్థితి వచ్చిందని స్థానికులు, పరిసర గ్రామాల్లోని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించాలని అధికారులు అప్పటి పాలకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య వచ్చిందని చెబుతున్నారు.

కడెం మండలం అంబారిపేట గ్రామానికి చెందిన ఈ రైతు పేరు జిన్క భూమన్న. ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద రబీలో నీరు వస్తుందనే ఆశతో మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కానీ కాల్వ ద్వారా నీటి సరఫరా కాకపోవడంతో ప్రాజెక్టు కింద లీకేజీ నీటిలో మోటార్లు పెట్టి రెండు ఎకరాలు తడిపాడు. మరో ఎకరం పంటకు నీరందించలేని పరిస్థితి ఉండటంతో పంట ఎండిపోయి గేదెలు, ఆవులకు మేతగా వినియోగమవుతోందని చెబుతున్నారు.

బీడు పొలాన్ని చూపిస్తున్న ఈ రైతు పేరు బైరి ఆనంద్. ప్రతి ఏటా రబీలో ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా రెండు ఎకరాల్లో వరి సాగుచేసేవారు. కానీ ఏడాది నీటి సరఫరా కాకపోవడంతో పొలం సాగు చేయలేదు. అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించడంతో ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద వేలాది మంది రైతులు పంటలు వేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

అధికారమే పరమావధి

(మొదటిపేజీ తరువాయి)

గళాలను అణచివేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కాంగ్రెస్ ఖాతాలు ఫ్రీజ్

బీజేపీకి ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఈ తీరుపై పలు సందర్భాలలో తన ఆగ్రహాన్ని వెలిబుచ్చుతున్నది. చెల్లింపు వివాదం కారణంగా పార్టీ ఖాతాలను ఆదాయపు పన్ను అధికారులు స్తంభింపజేశారనీ, దాదాపు రూ.210 కోట్ల లాక్ చేశారని ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. ఈ చర్య సంబంధిత ధోరణికి ఒక సూచిక మాత్రమేనని విశ్లేషకులు చెప్తున్నారు. దేశవ్యాప్తంగా భిన్నాభిప్రాయాలకు స్థానమివ్వకుండా ప్రభుత్వం రహస్య నియంత్రణ అమలు చర్యలను సైతం ఉపయోగించిందనే ఆరోపణలున్నాయని వారు అంటున్నారు. ముఖ్యంగా, కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శించేవారు గణనీయమైన నష్టాలను ఎదుర్కొంటారని చెప్తున్నారు.

కేంద్ర దర్యాప్తు సంస్థలు, చట్టాలే ఆయుధాలు

మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ, సీబీఐలను తనకు అనుకూలంగా, ప్రత్యర్థులపై ఆయుధంగా వినియోగించుకుంటున్నదని పలువురు రాజకీయ నాయకులు ఆరోపిస్తున్నారు. అలాగే, కొన్ని చట్టాలలోని నిబంధనలనూ అసమ్మతి వర్గాలపై మోడీ సర్కారు ప్రయోగిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద విదేశీ నిధులపై కఠినమైన పరిమితులతో సహా, భారతీయ పౌర సమాజ సంస్థలు గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొన్నాయని గుర్తు చేస్తున్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ కింద విచారణ కారణంగా తన కార్యకలాపాలను నిలిపివేసిన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియాతో సహా, ప్రభుత్వంపై విమర్శనాత్మకంగా నివేదించిన ప్రముఖ సంస్థలూ ఈ బాధను ఎదుర్కొన్నవే కావటం గమనార్హం. కేంద్రంలో మోడీ సర్కారు తొలిసారిగా అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి 2020 మధ్యకాలంలో దాదాపు 19వేల ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్సులు రద్దయినట్టు అంతర్జాతీయ న్యాయనిపుణుల కమిషన్ కనుగొన్నది.

జర్నలిస్టులు, విమర్శకులనూ వదలని వైనం

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులను సైతం మోడీ సర్కారు వదలటం లేదు. మోడీ హిందూ జాతీయవాద అజెండాపై అత్యంత తీవ్రమైన విమర్శకులలో ఒకరైన ప్రముఖ జర్నలిస్ట్ రాణా అయ్యూబ్. కోవిడ్-19 రిలీఫ్ ఫండ్ నుంచి నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆమె చేసిన ఆరోపణలపై ఆమె సంవత్సరాల తరబడి మనీ-లాండరింగ్ దర్యాప్తుతో సహా అనేక దఫాలు చట్టపరమైన, చట్టవిరుద్ధమైన వేధింపులను ఎదుర్కొన్నారు. గతంలో విమర్శకుడు హర్ష్ మందర్, అతని ఇంటిపై దాడి చేసి, ఆయన లాభాపేక్ష రహిత సంస్థ మీద ఎఫ్‌సీఆర్‌ఏ ఉల్లంఘనలపై దర్యాప్తు జరిగిన విషయాన్ని సైతం రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

సోషల్ మీడియా సంస్థలపై ఒత్తిళ్లు

ఎన్నికల సీజన్ మొదలవటంతో అభ్యర్థులు, పార్టీ ప్లాట్‌ఫారమ్‌ల గురించి తెలుసుకోవటానికి కోట్లాది మంది పౌరులు ఇంటర్నెట్‌పై ఆధారపడతారు. కానీ భారత ప్రభుత్వం ఆన్‌లైన్ కంటెంట్‌పై ఆంక్షలు విధిస్తున్నది. ముఖ్యంగా, బీజేపీకి, మోడీకి, ఎన్డీయే ప్రభుత్వానికి, పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఏదైనా కంటెంట్ ఉంటే.. వాటిని తొలగించాలంటూ సోషల్ మీడియా కంపెనీలపై సర్కారు బలవంతం చేస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

మోడీ పాలనలో పౌరులు, మీడియా, రాజకీయ పార్టీల హక్కులు కాలరాస్తున్నారనీ, ప్రజాస్వామ్య దేశంలో ఈ విధానం ఏ మాత్రమూ మంచిది కాదని మేధావులు అంటున్నారు. ఎలాగైనా, మూడోసారి సైతం అధికారంలోకి రావాలనీ, 400కు పైగా ఎంపీ స్థానాలను సాధించాలనే క్రమంలో మోడీ సర్కారు అప్రజాస్వామికంగా వ్యవహరించటం ఖండనార్హమని చెప్తున్నారు. గత ఐదేండ్ల నుంచి కేంద్రం ఇదే నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నదనీ, దేశ ప్రజలు, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, అణగారిన వర్గాల ప్రజలు రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కు అనే ఆయుధంతో సరైన సమాధానం చెప్పాలని మేధావులు, సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

వైద్యారోగ్య శాఖలో 5,348 పోస్టుల భర్తీకి పచ్చజెండా

(మొదటిపేజీ తరువాయి)

స్థానికత ఆధారంగా ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హతకు సంబంధించిన వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి తీసుకోవాలనీ, ఆయా వివరాల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చి నేరుగా ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించారు.

తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. దీంతో బుధవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. బీహార్ మినహా తొలి విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలు, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం మార్చి 28 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశముంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలు, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్థానాలకు మార్చి 28న నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. బీహార్‌లో మార్చి 30న నామినేషన్ల పరిశీలన జరగనుంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలు, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్థానాలకు మార్చి 30 నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. బీహార్‌లో నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 2 వరకు అవకాశం ఇచ్చారు. ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

తొలి విడతలో 21 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అందులో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు, రాజస్థాన్‌లోని 12 స్థానాలు, ఉత్తర ప్రదేశ్‌లోని 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లోని 6 స్థానాలు, ఉత్తరఖాండ్, అస్సాం, మహారాష్ట్రల్లోని ఐదేసి స్థానాలు, బీహార్‌లోని నాలుగు స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లోని మూడు స్థానాలు, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల్లోని రెండేసి స్థానాలు, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్ దీవులు, జమ్మూ కాశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లోని ఒక్కో స్థానం ఉన్నాయి.

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్, జూన్ 1న తుది విడత పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ముఖ్యమంత్రి గారూ..

(మొదటిపేజీ తరువాయి)

గల్లీలో రైతుల కన్నీళ్లు కనిపించవా...?..అన్నదాతల ఆర్తనాదాలు ప్రభుత్వానికి వినిపించవా..? అని నిలదీశారు. ఎన్నికల గోల తప్ప.. ఎన్నో కష్టాలు పడుతున్న రైతులపై కనికరం లేదా..? సీట్లు.. ఓట్లు.. పంచాయితీ తప్ప.. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా..? అంటూ సీఎంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజాపాలన అంటే.. 24/7 పాటు ఫక్తు రాజకీయమేనా..? పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంటనష్టంపై లేదెందుకు ? పాడైపోయిన పంటలను పరిశీలించే తీరిక లేదా? హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొట్టీ కొట్టీ.. రైతుల సమస్యలు వినే ఓపిక లేదా ? అంటూ ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు.

"ఇంతకాలం.. పచ్చని పైర్లు ఎండుతున్నా.. సాగునీరు ఇవ్వడం చేతకాలేదు..! ఇప్పుడు.. నష్టపోయిన పంటలకు.. పరిహారం ఇవ్వటానికి మనసు రావడం లేదా..? గుర్తు పెట్టుకోండి..! ఎద్దేడ్సిన ఎవుసం..! రైతేడ్సిన "రాజ్యం బాగుండదు .." !!... అని సీఎంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై.. భారత "రైతు" సమితి.. పోరాడుతూనే ఉంటది..!!! ... " అని హెచ్చరించారు.



1 శాతం మంది చేతుల్లోనే భారత్

హామీలు విస్మరించిన బీజేపీ

దేశంలో నిరంకుశ పాలన : వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : భారత జాతీయ ఆదాయంలో ఎక్కువ భాగం దేశంలో అత్యంత సంపన్నులైన (కోటీశ్వరులు) కేవలం 1 శాతం ప్రజల చేతిలోనే ఉండిపోతోంది. అమెరికా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో పోలిస్తే జాతీయ ఆదాయంలో వీరి వాటాయే ఎక్కువ. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ మంగళవారం ప్రచురించిన నివేదిక ప్రకారం 2014-15, 2022-23 మధ్యకాలంలో దేశంలో సంపదకు సంబంధించి ఆదాయ అసమానతలు అధికంగా ఉన్నాయి. ఆర్థికవేత్తలు నితిన్ కుమార్ భారతి, లూకస్ ఛాన్సెల్, థామస్ పికెట్టి, అన్మోల్ సోమంచి ఈ నివేదికను రూపొందించారు.

ఈ నివేదిక ప్రకారం...అత్యంత సంపన్నులైన 1% జనాభా యొక్క ఆదాయం, సంపద వాటాలు అధిక చారిత్రక స్థాయిల్లో ఉన్నాయి. 2022-23లో దేశ ఆదాయంలో 22.6%, సంపదలో 40.1% వీరి వద్దే ఉంది. వీరి సంపద వాటా 1961 తర్వాత ఈ స్థాయిలో ఉండడం ఇదే మొదటిసారి. ఆదాయాలు, సంపదలు కొద్ది మంది వద్దే పోగుపడి ఉండడం సమాజం, ప్రభుత్వంపై ప్రభావం చూపుతుంది. ఇటీవలి సంవత్సరాలలో దేశంలో కీలకమైన సంస్థలు వీరి వద్ద రాజీ పడిపోయాయి.

2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత దశాబ్ద కాలంలో అనేక ప్రధాన రాజకీయ, ఆర్థిక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 'దేశాన్ని అభివృద్ధి చేస్తామని, ఆర్థిక సంస్కరణలు చేపడతామని హామీ ఇచ్చి బీజేపీ అధికారంలోకి వచ్చింది. వరుసగా రెండుసార్లు దేశాన్ని పాలించింది. అయితే ఈ కాలంలో నిర్ణయాలు తీసుకునే అధికారం ఒకే వ్యక్తి చేతిలో కేంద్రీకృతమైంది. ఫలితంగా అది నిరంకుశ పాలనకు దారితీసింది. బడా వ్యాపారవేత్తలు, ప్రభుత్వం మధ్య సంబంధాలు పెరిగిపోతున్నాయి' అని ఆ నివేదిక వివరించింది. ఫోర్బ్స్ బిలియనీర్ ర్యాంకింగులను ఈ నివేదిక ఉటంకించింది.



సుమారు రూ.100 కోట్ల కంటే నికర సంపద ఎక్కువగా ఉన్న భారతీయులు 1991లో ఒక్కరు మాత్రమే ఉండగా 2022 నాటికి వారి సంఖ్య 162కు పెరిగింది. ఇదే కాలంలో ఈ వ్యక్తుల మొత్తం నికర సంపద దేశ నికర జాతీయాదాయంలో 1% నుండి 25%కి పెరిగింది. ఆదాయం, సంపదను లెక్కించడానికి దేశంలో పన్ను వ్యవస్థను పునర్వ్యవస్థీకరించా ల్సిన అవసరం ఉన్నదని నివేదిక అభిప్రాయపడింది. ఆరోగ్యం, విద్య, పోషకాహారం వంటి విషయాలలో ప్రభుత్వ పెట్టుబడులు సగటు భారతీయుల కోసమే ఉండాలి తప్పించి సంపన్నుల కోసం కాదని స్పష్టం చేసింది. భారత్‌లో ఆర్థిక సమాచారం నాణ్యత పేలవంగా ఉన్నదని, ఇటీవలి కాలంలో అది పడిపోతోందని నివేదిక తెలిపింది. అధికారిక సమాచారం మరింతగా అందుబాటులో ఉండాలని, అసమానతలపై అధ్యయనం పెంచడంలో పారదర్శకత అవసరమని, ప్రజల మధ్య జరిగే చర్చల్లో ఆధారాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నివేదిక సూచించింది.

విచారణ మొదలైంది

కలెక్టర్ నుంచి నివేదిక అందిన తర్వాత తగిన చర్యలు

తమిళనాడులో మోడీ ర్యాలీలో స్కూల్ విద్యార్థులు ఉండటంపై ఈసీ వర్గాలు



న్యూఢిల్లీ : తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఇటీవల ప్రధాని మోడీ పర్యటన వివాదంగా మారింది. మోడీ నిర్వహించిన ర్యాలీలో పాఠశాల విద్యార్థులు ఉండటం దీనికి కారణమైంది. దీంతో మోడీ ఎన్నికల ర్యాలీ కోసం స్కూల్ విద్యార్థులను తీసుకొచ్చారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన ఎన్నికల సంఘం(ఈసీ) దృష్టికి వెళ్లింది. ఈ ఆరోపణలపై విచారణ జరుపుతున్నట్టు ఈసీ వర్గాలు వెల్లడించాయి."ఈ విషయం ఈ (మంగళవారం) ఉదయం మా దృష్టికి వచ్చింది. కమిషన్ మార్గదర్శకాల ఆధారంగా జిల్లా కలెక్టర్ ఇప్పటికే విచారణ ప్రారంభించారు. నివేదిక అందిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటాం" అని సీనియర్ ఎన్నికల అధికారి ఒకరు తెలిపారు.

కోయంబత్తూర్‌లోని ఎన్నికల అధికారులు.. శ్రీ సాయిబాబా విద్యాలయం ఎయిడెడ్ మిడిల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మోడీ నిర్వహించిన ర్యాలీలో భాగంగా బీజేపీ ఏర్పాటు చేసిన వేదికలపై దేవతామూర్తులుగా ప్రదర్శనలు ఇస్తున్నారని మీడియాలో వచ్చిన వార్తలపై జిల్లాలోని విద్య, కార్మిక శాఖల నుంచి నివేదికలు కోరారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులోకి వచ్చినప్పటికీ.. ప్రధాని స్థాయిలో మోడీ పలు సందర్భాల్లో కోడ్‌ను ఉల్లంఘించిన ఘటనలు వార్తల్లో వచ్చాయి. పదేండ్లలో కేంద్రం సాధించిన విషయాల గురించి మోడీ పేరుతో దేశవ్యాప్తంగా లక్షలాది మందికి 'వికసిత్ భారత్ సంపర్క్' నుంచి వాట్సప్ సందేశాలు రావటం కోడ్‌ను ఉల్లంఘించటమేనంటూ ఈసీకి ఫిర్యాదులు సైతం అందాయి. అయితే, దీనిపై ఈసీ ఇంకా ఎలాంటి చర్యా తీసుకోకపోవటం గమనార్హం.

టాప్‌లోనే సూర్యకుమార్

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల



లండన్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) విడుదల చేసిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ టాప్‌లోనే నిలిచాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన బ్యాటర్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ 861పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇది ముంబయి ఇండియన్స్‌కు ఊరటనిచ్చే అంశం. గత మూడు నెలలుగా టి20 క్రికెట్‌కు దూరంగా ఉన్నప్పటికీ సూర్యకుమార్ నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం. రెండోస్థానంలో ఇంగ్లండ్ సంచలనం ఫిల్ సాల్ట్(802పాయింట్లు) నిలిచాడు. టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 714పాయింట్లతో ఏకంగా 6వ స్థానానికి ఎగబాకాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ అనూహ్యంగా అగ్రస్థానానికి ఎగబాకాడు. తాజా ర్యాంకింగ్‌లో ఆదిల్ రషీద్ 726పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక ఐర్లాండ్‌తో జరిగిన మూడు టి20ల సిరీస్‌ను ఆఫ్ఘనిస్తాన్ జట్టు 2-1తో చేజిక్కించుకోవడం కీలకపాత్ర పోషించిన రషీద్ ఖాన్ టాప్-10 బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. ఈ సిరీస్‌లో 25ఏళ్ల రషీద్ ఖాన్ 8వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. బౌలర్ల టాప్-10 జాబితాలో అక్షర్ పటేల్ 4వ, రవి బిష్ణోయ్ 6వ స్థానంలో నిలిచారు.

ఐసిసి టాప్-10 బ్యాటర్ల జాబితా..

1. సూర్యకుమార్(భారత్)	:861పాయింట్లు
2. ఫిల్ సాల్ట్(ఇంగ్లండ్)	:802 ..
3. మహ్మద్ రిజ్వాన్(పాకిస్తాన్)	:800 ..
4. బాబర్ అజామ్(పాకిస్తాన్)	:764 ..
5. ఐడెన్ మార్క్రమ్(దక్షిణాఫ్రికా)	:755 ..
6. యశస్వి జైస్వాల్(భారత్)	:714 ..
7. రిలే రూసో(దక్షిణాఫ్రికా)	:689 ..
8. ఫిన్ అలెన్(న్యూజిలాండ్)	:686 ..
9. జాస్ బట్లర్(ఇంగ్లండ్)	:680 ..
10. రీజా హెండ్రిక్స్(దక్షిణాఫ్రికా)	:660 ..

ఐసిసి టాప్-10 బౌలర్ల జాబితా..

1. ఆదిల్ రషీద్(ఇంగ్లండ్)	:726 పాయింట్లు
2. వానిందు హసరంగ(శ్రీలంక)	:687 ..
3. అకిల్ హొసైన్(వెస్టిండీస్)	:664 ..
4. అక్షర్ పటేల్(భారత్)	:660 ..
5. మహీశ్ తీక్షణ(శ్రీలంక)	:659 ..
6. రవి బిష్ణోయ్(భారత్)	:659 ..
7. జోష్ హేజిల్‌వుడ్(ఆస్ట్రేలియా)	:654 ..
8. టబ్రైజ్ షాంసీ(దక్షిణాఫ్రికా)	:654 ..
9. మిఛెల్ సాంట్నర్(న్యూజిలాండ్)	:645 ..
10. రషీద్ ఖాన్(ఆఫ్ఘనిస్తాన్)	:645 ..

ఆరంభ వేడుకలకు చెపాక్ స్టేడియం ముస్తాబు

రేపటినుంచి ఐపీఎల్ సీజన్-17 టోర్నమెంట్

చెన్నై: గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) ఆరంభ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు బిసిసిఐ ఏర్పాట్లు పూర్తి చేసింది. చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియం (చెపాక్)ను మిరుమిట్లు గొలిపే దీపకాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ వేడుకల్లో బాలీవుడ్ స్టార్స్ అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్‌తోపాటు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, సింగర్ సోనూ నిగమ్ ఆటపాటలతో సందడి చేయనున్నారు. 22న (శుక్రవారం) సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభోత్సవ వేడుకలు మొదలవుతాయి. డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగనున్న తొలి మ్యాచ్‌కు ముందు ఈ వేడుకలు జరగనున్నాయి. ఆరంభ వేడుకలు ముగిసిన అనంతరం 7:30 గంటలకు మ్యాచ్ టాస్ వేస్తారు. రాత్రి 8 గంటలకు మ్యాచ్ మొదలవుతుంది.

బెంగళూరు-చెన్నై మ్యాచ్‌పైనే అందరి దృష్టి

మార్చి 22న బెంగళూరు-చెన్నై జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ ఏడాది సీజన్ ప్రారంభం కానుండగా.. శనివారం(23న) పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య మొహాలీ స్టేడియంలో, కోల్‌కత్తా నైట్‌రైడర్స్-సన్‌రైజర్స్ జట్ల మధ్య కోల్‌కతా వేదికగా మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక ఆదివారం (24న) రాజస్తాన్ రాయల్స్-లక్నో జెయింట్స్, గుజరాత్ టైటాన్స్-ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది. శుక్ర, శని, ఆదివారం కలిపి కేవలం మూడు రోజుల్లో ఐపిఎల్ లో ఆడే 10జట్లు తమ తొలి లీగ్ మ్యాచ్‌లను ఆడను న్నాయి. లోక్‌సభ ఎన్నికలు ఈ కాలంలోనే జరగను ండడంతో బిసిసిఐ కేవలం 21 మ్యాచ్‌ల షెడ్యూల్ ను మాత్రమే ఇప్పటివరకు విడుదల చేసింది. ఈసారి కూడా ఎన్నికలు ఏడు దశల్లో జరగనుం డడంతో ఎన్నికలు పూర్తియిన రాష్ట్రాల్లో మిగిలిన మ్యాచ్‌లను నిర్వహించేందుకు బిసిసిఐ కసరత్తు చేస్తోంది.

సన్‌రైజర్స్ రాత మారేనా..!

స్టార్ ఆటగాళ్లతో సీజన్-17కు సిద్ధం

గత రెండు సీజన్‌లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈసారి ఎలాగైనా మంచి ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో జట్టులో భారీ మార్పులు చేసింది. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియాను వన్డే ప్రపంచకప్, డబ్ల్యూటీసీ ఛాంపియన్‌గా నిలిపిన పాట్ కమిన్స్‌ను వేలంలో రూ.20.50 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. అంతేకాదు మార్క్రమ్ స్థానంలో కమిన్స్‌ను కెప్టెన్‌గా నియమించింది. సౌతాఫ్రికా టి20లీగ్‌లో సన్‌రైజర్స్‌కు వరుసగా రెండు టైటిళ్లు అందించిన మార్క్రమ్‌ను ఐపిఎల్‌లో కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించింది. ఇక జట్టు కూర్పు పరంగా ట్రావిస్ హెడ్ బ్యాకప్‌గా ఉపయోగించుకున్నా... మార్క్రమ్, హెన్రిచ్ క్లాసెన్, వానిందు హసరంగలను తుది జట్టులోకి తీసుకోవాల్సి ఉంటుంది. హసరంగ అవసరం లేదని భావిస్తే కొన్ని మ్యాచ్‌ల్లో అతనికి బదులుగా ఫజల్‌హక్ ఫారూకీ లేదా మార్కో జాన్సెన్‌ను ఆడించే ఛాన్స్ ఉంది. ఏది ఏమైనా విదేశీ ఆటగాళ్లను ఆడించడంలో సన్‌రైజర్స్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చు. ఈ సీజన్‌లో ఆరెంజ్ ఆర్మీ తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఢీకొట్టనుంది. మార్చి 23న ఈడెన్ గార్డెన్స్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.

జట్టు: కమిన్స్(కెప్టెన్), అబ్దుల్ సమద్, అభిషేక్ శర్మ, మార్క్రమ్, జాన్సెన్, త్రిపాఠి, సుందర్, ఫిలిప్స్, సన్వీర్ సింగ్, క్లాసెన్, భువనేశ్వర్, మయాంక్, నటరాజన్, అన్మోల్‌ప్రీత్ సింగ్, మయాంక్ మార్కండే, ఉపేంద్ర, ఉపేంద్ర సింగ్ యాదవ్, ఉమ్రాన్ మాలిక్, నితీష్ కుమార్ రెడ్డి, ఫరూకీ, షాబాజ్ అహ్మద్, హెడ్, హసరంగా, ఉనాద్కట్, ఆకాష్ సింగ్, సుబ్రమణ్యన్.



రామ్‌చరణ్, జాన్వీ కపూర్, చిరంజీవి

రామ్ చరణ్ కొత్త సినిమా మొదలైంది

నవచిత్రం

రామ్ చరణ్ కథానాయకుడిగా, తొలి చిత్రం 'ఉప్పెన'తో బ్లాక్ బస్టర్ సాధించిన బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ ఆర్‌సి16 బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో రామ్‌చరణ్‌కి జతగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో సినిమా తెరకెక్కుతుంది.

ముహూర్తపు సన్నివేశానికి చిరంజీవి క్లాప్ కొట్టగా, బోనీ కపూర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ చేతుల మీదుగా చిత్ర యూనిట్ స్క్రిప్ట్‌ను అందుకున్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు సానా మాట్లాడుతూ, 'ఈ సినిమాకు ఎ.ఆర్.రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నారు. నా రెండో సినిమాకే నా కల నేరవేరుతుందని అనుకోలేదు. మా అందరికీ ఇది మంచి సినిమా అవుతుంది. ఈ సినిమా జరగటానికి ప్రధాన కారణమైన మా గురువు సుక్కుసార్‌కి థ్యాంక్స్' అని చెప్పారు.

'సుకుమార్ చెప్పినట్లు బుచ్చిబాబు క్రేజీ పర్సన్. తన ఆలోచనలు గొప్పగా ఉంటాయి. తను నన్ను కలిసినప్పుడు ఐదు సిట్యువేషన్స్ చెప్పి, ఒక్కోదానికి మూడేసి సాంగ్స్ ఉండేలా ప్లాన్ చేసిన ఓ ఫైల్ ఇచ్చాడు. తనలోని ఆసక్తి చూసి ముచ్చటేసింది. ఇప్పటికే మూడు ట్యూన్స్ పూర్తి చేశాం' అని మ్యూజిక్ డైరెక్టర్ ఏ.ఆర్.రెహ్మాన్ తెలిపారు.

హీరోయిన్ జాన్వీ కపూర్ మాట్లాడుతూ, "బుచ్చిబాబు ఈ కథను నెరేట్ చేయటానికి వచ్చినప్పుడు ఆయనకు సినిమాపై ఉన్న క్రేజ్ చూసి సినిమా చేయాలనుకున్నా. ప్రేక్షకులందరూ మెచ్చుకునేలా మంచి సినిమాలో భాగమవుతాను' అని అన్నారు. 'బుచ్చిబాబుకి సినిమా అంటే పిచ్చి. రంగస్థలంలో సుకుమార్ అసిస్టెంట్‌గా తను ట్రావెల్ అయ్యాడు. రంగస్థలం నెరేషన్‌ను సుకుమార్ నాకు నలభై నిమిషాలే ఇచ్చారు. అయితే అక్కడి నుంచి ప్రతిరోజూ రెండేసి గంటల నెరేషన్‌ను ఇస్తూ వచ్చింది మాత్రం బుచ్చిబాబునే. ఈ స్టేజ్ పై ఉన్న ప్రముఖులను చూస్తుంటేనే తన సంకల్పం ఏంటో అర్థమవుతుంది. తను ఉప్పెనతో పెద్ద సక్సెస్ చూశాడు. నేను నాకెరీర్‌లో ఇంత త్వరగా ఎ.ఆర్.రెహమాన్‌గారితో పని చేస్తానని అనుకోలేదు. కచ్చితంగా అద్భుతమైన సినిమా చేస్తామనే నమ్మకం ఉంది. నేను, జాన్వీ కలిసి జగదేకవీరుడు-అతిలోక సుందరి అనే సినిమా చేయాలని చాలా మంది అనుకున్నారు. మా కాంబినేషన్ ఈ సినిమాతో నిజం కాబోతుండటం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

కన్నప్ప కామిక్ బుక్ విడుదల



విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' రెండో షెడ్యూల్‌ను ఇటీవలే పూర్తి చేశారన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. వెండితెరను మించిన కొత్త క్రియేటీవ్ వెంచర్‌ను ఆవిష్కరించారు విష్ణు మంచు. తన తండ్రి మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 19న 'కన్నప్ప స్టోరీ బుక్ వాల్యూమ్ 1'ని లాంచ్ చేశారు. ఇది భక్త కన్నప్ప పురాణ కథను కామిక్ రూపంలో చూపిస్తుంది. ఈ వినూత్న ప్రాజెక్ట్ కన్నప్ప కథను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

"కన్నప్ప కామిక్ బుక్ వాల్యూమ్ 1" ద్వారా భక్తి, త్యాగం వంటి భావనలు అందరికీ తెలుస్తాయి. ఇందులో కన్నప్ప సాహసం, భావోద్వేగం, ఆధ్యాత్మిక భావనలను చూపించనున్నారు. ఈ కామిక్ పుస్తకంతో విష్ణు మంచు భక్త కన్నప్ప చరిత్రను ఈ తరానికి అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాంస్కృతిక వారసత్వంతో వినోదాన్ని మిళితం చేయడం ద్వారా, కన్నప్పపై ఆసక్తిని రేకెత్తించడానికి, కన్నప్ప పట్ల భక్తిని ప్రేరేపించడానికి ప్రయత్నించారు.

"కన్నప్ప స్టోరీ బుక్ వాల్యూమ్ 1" విడుదల అనేది భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని మాత్రమే కాకుండా, కన్నప్ప కథపై విష్ణు మంచు నిబద్ధతను కూడా ప్రదర్శించింది. ఇన్ స్టాగ్రాంలో రిక్వెస్ట్ చేసిన వారికి, వారి చిరునామాను పంపిన వారికి ఉచితంగా పుస్తకాలు అందుతాయి.

విష్ణు మంచు మాట్లాడుతూ, 'ఈ కథ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నేను కోరుకున్నాను. కామిక్ పుస్తకం.. సినిమా లానే ఉంటుంది. నేను చదివిన అత్యంత ఉత్తేజకరమైన కథను ప్రపంచానికి తెలియజేయాలనేది నా కల. యువత ఈ కథను, చరిత్రను తెలుసుకోవాలని అనుకున్నాను. మన చరిత్ర, మన మూలాలను తెలుసుకునేలా చేయడంలో ఇది గొప్ప ప్రారంభం అని నేను భావించాను. ఇది నేను డబ్బు కోసం చేస్తున్న పని కాదు. ఈ కథ నా మనసుకెంతో దగ్గరైంది. కన్నప్ప భక్తి భావాన్ని ప్రపంచమంతా తెలుసుకోవాలని అనుకుంటున్నాను' అని అన్నారు.

కన్నప్ప సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్ బాబు జన్మదిన వేడుకలు, మోహన్ బాబు యూనివర్సిటీ 32వ వార్షిక దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు డా. మోహన్‌లాల్ గౌరవ ముఖ్య అతిథిగా విచ్చేయగా, శ్రీ ముఖేష్ రిషి గౌరవ అతిథిగా హాజరయ్యారు.

నా తనయుడు విష్ణు చేసిన ఈ ప్రయత్నాన్ని అభినందిస్తున్నాను. కన్నప్ప చరిత్ర గురించి ఇప్పటి యువతకు చేరాలన్న విష్ణు కల కామిక్ బుక్ రూపంలో తీరడం ఆనందంగా ఉంది. అలాగే సినిమా సైతం విజువల్ వండర్‌గా పాన్ ఇండియా స్థాయిలో అందర్నీ విశేషంగా అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం.

\- మోహన్‌బాబు

సరికొత్త కథ, కథనాలు..



అప్సరరాణి

అరుణ్ ఆదిత్య, అప్సర రాణి జంటగా వినూత్న సెల్యూలాయిడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై కృష్ణబాబు దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం ఫిలింనగర్ దైవ సన్నిధానంలో జరిగింది. జస్ట్ ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ వి. సముద్ర తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించగా, రైటర్ పరుచూరి గోపాలకృష్ణ హీరోయిన్‌పై క్లాప్ కొట్టారు. తొలిషాట్‌కు సంగీత దర్శకురాలు యం యం శ్రీలేఖ కెమెరా స్విచ్చాన్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ కృష్ణబాబు మాట్లాడుతూ. 'ఏప్రిల్ 20 నుంచి 10 రోజుల పాటు షెడ్యూల్ చేస్తాం. సబ్జెక్టు బాగా వచ్చింది. అరుణ్ ఆదిత్య - అప్సర రాణి జంటగా చేస్తున్న ఈ సినిమా ఖచ్చితంగా అందరికి నచ్చుతుంది. త్వరలోనే ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేస్తాం' అని తెలిపారు.

అప్సరరాణి మాట్లాడుతూ, 'మంచి రోజు మంచి సినిమా ప్రారంభమైంది. సంతోషంగా ఉంది. నా కెరీర్‌కు ఈ సినిమా మంచి హెల్ప్ అవుతుందన్న నమ్మకంగా ఉంది. నాకు అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్‌కు, డైరెక్టర్‌కు ధన్యవాదాలు' అని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వెంకటేష్ మాట్లాడుతూ, 'ఒక టాలెంట్ ఉన్న డైరెక్టర్ ఈ సినిమాను ఒక తపస్సులా చేస్తున్నాడు. కృష్ణబాబు స్క్రిప్టును అద్భుతంగా రెడీ చేశారు. ఈ ప్రాజెక్టును ఎంతో నిజాయితీగా, పర్ఫెక్ట్‌గా సిద్ధం చేశారు. హీరో అరుణ్ ఆదిత్య ఈ ప్రాజెక్టుకు దొరికిన ఆణిముత్యం, హీరోయిన్ అప్సర రాణి కూడా నిబద్ధతతో, అంకితభావంతో పని చేసే వ్యక్తి. ఆమె డెడికేషన్ ఈ సినిమాకు ఎంతో హెల్ప్ అవుతుంది' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886